# బూచీ

చెమట కక్కుకుంటూ పరుగు నడకలతో వస్తూన్న రమణారావు చప్పున ఆగి మళ్లీ మెల్లగా కాలు కదిపాడు.

ఆవేళ మెడ్రాసు మెయిలు అరగంట లేటు కాబట్టి సరిపోయింది. ఎవరికోసమని గదిని అలంకరించటంలో నిమగ్నుడయ్యాడో వాళ్లను ఆవేళ కలుసుకోలేక పొయ్యేవాడేమో! జేబురుమాలుతో చెమట తుడుచుకుంటూనే ఆ పదిగజాలు నడచి ప్లాటుఫారం టిక్కెట్టు తీసుకున్నాడు.

ఫేంటు జేబులో ఎడమచెయ్యి కుక్కి ముఖాన్ని కాస్త నిగారించి మనుష్యులవేపు చూసీచూడనట్లుగా ప్లాటుఫారం మీదకు వెళ్లాడు.

బుక్‌స్టాల్ దగ్గర గులాబిరంగు సిల్కుచీర పైట మెలికలు తిరిగి మహావయ్యారంగా గాలికి కదులుతోంది. ముందుకున్న రెండుజడలు గప్పున ఒకదానితరవాత ఒకటి వీపుమీద వాలిలటం చూశాడు. సంశయంతోనే కొంచెం దూరంలో ఆగాడు. యింకా ఆ అమ్మాయి పుస్తకాలు కొనటం పూర్తి చేసినట్లులేదు.

రెండు జడల్లో రెండే సంపెంగపూలున్నాయ్. ఇంత వరకు వాటిని చూశాడు. కాని మనస్సులో వాటివిషయమై ఆలోచించనే లేదు. చప్పున ఆ అమ్మాయి ముఖం తిప్పి దీక్షగా చూసి వెటకారంగా నవ్వింది. ఆ నవ్వుతో ఒళ్లంతా ఝల్లు మంది. గబగబ వెనుకకు నడక సాగించాడు. ఆ అమ్మాయి కూడ తనను అనుసరిస్తోందని గుర్తించాక ముందుకు గబగబా పోడానికి యెందరో అడ్డొస్తున్నారు. పాన్‌వాలాతో సహా అందరూ తనకేదో అపాయం తెచ్చిపెట్తున్నారు. మెల్లిగావెళ్లి స్టేషన్ బిల్డింగ్ రాతిస్తంభపు చాటున నిలుచున్నాడు. చూస్తూండగానే ఆ అమ్మాయి మాయమైపోయింది. కాస్త మెత్తగా వున్న ఆ జోళ్ల టిక్‌టిక్‌లింకా ఆ గుండెలో ప్రతి ధ్వనిస్తున్నయ్.

గంట టంగ్‌టంగ్‌మంది. కాస్త నిబ్బరంగా వుందామనుకొనేసరికి ఒక కీచుగొంతుక వినిపించింది. వినేవాళ్లందరికీ ఆ గొంతుకెంతో తియ్యగా మళ్లీమళ్లీ వినాలని వుంది. ఆ ఐదేళ్ల పాపాయి వసపోసిన చిలుకలా పలుకుతూంటే చుట్టూ విన్న వాళ్లందరికీ ఎంతో ముచ్చటగా వుంది. రమణారావుకు యెక్కడలేని అవమానబాధ మనసులో చొచ్చుకొనిపోవటంతో దృష్టిని నేల కప్పచెప్పేడు.

చెవులుమాత్రం ఆ పిల్ల పలుకులను వింటూన్నాయ్. అక్కడనుంచి పోదామని ప్రయత్నించాడు. కాని కాలు కదపటం సాధ్యమైందికాదు. కాస్సేపటికి నవ్వే గొంతుకలు చుట్టుముట్టాయ్. బిక్కచచ్చి ముఖం ఎత్తలేకపోయాడు.

చివరికి ధైర్యాన్నంతా చేకూర్చుకొని తలెత్తాడు. తన చుట్టూ ఎవరూ లేరు. మెయిల్ కోసం నిల్చునే వాళ్లలానే నిల్చున్నారు. చేరువలోవున్న అందరి ముఖాల్లో ఒకేవిధమైన నవ్వు కనిపిస్తోంది. కాని ఒక ముఖంలో కనిపించే పెంకినవ్వులో మనస్సంతా కోపంతో మండుకుపోయింది. ఆ నవ్వును మనసులో వెక్కిరించుకుంటూంటే మళ్లీ పాప పలుకులు వినిపించినయ్.

ఇంతమందిలో నా మోహం పడలేకపోయాడు. లేని నవ్వును తెచ్చుకొంటూ మెల్లగా కదులుతుంటే ఆ పాపాయి పిన్ని చెయ్యి పట్టుకొని అటువేపే లాగుతూ అంది "బూచీ వెళ్లిపోతున్నాడేం పిన్నీ?"

గులాబీరంగు సిల్కుచీర అలాగే వయ్యారంగా కదులుతోంది. గులాబీరంగు చెక్కిళ్లు అలా పెంకిగా సొట్టలుదేరుతున్నాయ్. ఆ పిన్నిమాత్రం, యెందుకు వెళ్లిపోతున్నాడో చెప్పలేదు.

గంట మోగింది. రైలు వచ్చిపడింది. వెయిటింగ్ రూమ్‌లో వున్న తాతయ్య చేతికర్రతో బయటికివచ్చి అక్కడే వున్న తులసితో "ఈయన కాస్త కోపిష్టిమనిషి. చాలా జాగ్రత్తతో చూడాలి" అన్నాడు. తాతయ్య యీ కబురు యింతవరకూ దాచి యిప్పుడే యెందుకు చెప్పవలసివచ్చిందో ఆమె వూహించలేకపోయింది. దాని విషయంలో, అట్టే తల పాడుచేసుకోడానికి వ్యవధికూడా లేదు. తాతయ్యను పాపతో సహా అనుసరించింది.

## ౨

గేటుబయటి, వచ్చే ముఖాలవైపు కళ్ళప్పచెప్పి చూస్తున్న రమణారావు మనస్సు మనస్సులాలేదు. ఆడవాళ్లను వుద్ధరించేవాళ్ళలో తనొకడని కొద్దోగొప్పో అనుకొనేవాడే. కనికరం చూపించే పరిస్థితి ఆడవాళ్లయందేగాని మగవాళ్ళయందెప్పుడూ రాదనే నమ్మేవాడు. ఏదైనా ఒకవిషయాన్ని వాదించేటప్పుడు ఆడిన నాల్గుమాటలైనా, ఆడవాళ్ళవైపున వకాల్తా తీసుకొని మాట్లాడేవాడు. ఒకనాడైనా యిలాంటి పరిస్థితి వస్తుందని హద్దుమీరి ఆలోచించలేదు.

"ప్లాటుఫారంటిక్కెట్టు తీసుకోలేకపోయావురా...!" హఠాత్తుగా విన్నమాటలతో కాస్త కంగారుపడ్డా సర్దుకొని "...హాఁ...లే"— దంటూ నాన్చేశాడు. వెనక నున్న

అమ్మాయి మాత్రం 'పాపం! తీసినా...' చప్పున ఆపి ముందుకొచ్చింది ...'పిల్లకి పెద్దనాన్నకి యేం సంబంధం.' అన్న సంశయం మనస్సులో కొట్లాడినా రమణగుండెల్లో గడ గడ ధ్వని రేగింది...వెనుకనే వున్న పాప...కీమనే స్వరంతో "బూచీ" అంది. ఆ ఒక్క మాటతో సగం ప్రాణం యెగిరి పోయింది...కళ్లలో నీరు తిరిగిపోతూంటే అతి ప్రయత్నం మీద ఆపుకుంటున్నాడు. యీ లిప్తలో జరిగిన మార్పులు పరీక్షించిన తులసి కొంచెం ప్రక్కకు జరిగింది. పాప మళ్ళీ 'బూచీ' అంది. కూలీలతో తాతయ్యా వస్తున్నారు...తులసి పాపను యెత్తుకుని "కుక్కను చూస్తూ బూచీ బూచీ అని యెందుకే గోలపెట్టావ్ పాపా! ఊరుకో—!" అంటూనే ముందుకు గబగబ నడచింది.

టాక్సీలో బెడ్డింగు సూటుకేసు వగైరా సామానులు కూలీలు పడవేస్తోంటే కళ్లప్పచెప్పి చూస్తూన్నాడు. కారు కదులుతూండగా ముందుసీటులో కూర్చొన్న రమణారావు తనని కుక్కను చేసిన తులసివేపు ఒకసారి చూడకుండా వుండ లేకపోయాడు.

ముసలివాళ్లిద్దరూ అల్లుళ్ళ హోదాలనీ, రాజకీయాలనీ కలిపి మాట్లాడుకుంటున్నారు...తరువాత...

'యెవరినీ తీసుకురాకపోవటమే మంచిపనిచేశారు.

గొడబలేకుండానే ట్రీట్ మెంటు అయిపోతుంది. సేవ చెయ్యటానికి మా తులసివుంది లెండి. . . .వంట చెయ్యటంలో. . .'

"వంట చెయ్యటం కూడానా. . .'

'ప్రస్తుతం అదే. వంటమనిషి కూతురు ఒంట్లోబాగు లేదని వెళ్లింది. అంతా నేనే చూసుకొంటానంటుంది . . . మాటల్లో మంచి దిట్టండి. . ."

'ఏవమ్మాయ్. తాతయ్య ఎంతవరకు చదివించారు?'— ప్రశ్నించాడు రమణ పెదనాన్న.

'చదరంగం తప్పించి తాతయ్యకింకేం చదువురాదు. తాతయ్యే చదివించుంటే నాక్కూడా ఆ పిచ్చే పట్టేదేమో! యీ చదువు నాకు చాలనుకున్న వరకు నేనే చదువుకున్నా!'

తాతయ్య నవ్వుతూ 'చాశారా'? అన్నాడు. అనుకోని సమాధానం విన్న రమణ పెదనాన్న బిగ్గరగా నవ్వుతూ 'యిలా వుంటేనే పిల్లలండీ' అన్నాడు.

రమణ ఈమాటలన్నీ ఒకచెవి అప్పచెప్పి వింటూన్నా . . . ఆమె వ్యంగ్యంగా విసరిన విరుగుడు లేని బాణంతో బాధపడు తున్నాడు. కారు అద్దంలోంచి రోడ్డువైపు చూస్తున్నాడేకాని మనస్సంతా ఆమెతోనే నిండిపోయివుంది.

పెదనాన్న, తాతయ్య పాపచేతిలో వున్న బొటారబ్బరు కుక్క బొమ్మ బూచి అనుకొని వుంటారని సంతృప్తి పడబోయాడు.

ఇంటికివచ్చి పెదనాన్న వ్రాసిన వుత్తరం రెండుసార్లు చదివినా యెక్కడా తనయింటికి వస్తానని లేదు. హాస్పటల్ పనిమీద ఫలానా తేది మెయిల్‌లో ఆఫ్నూరు రాదలచానని, స్టేషనుకు రమ్మనమని ముక్తసరిగా మూడు మాటలలో తెల్పారు. అర్థం చేసుకోవటం చేతకాక అప్పుచేసి ఆ లాడ్జి కొంచెం బాగా కనిపించటానికని శ్రమ తీసుకోవలసి వచ్చింది.

## 3

మధ్యాహ్నం భోజనాలయ్యాయ్. మేడమీద హాలులో కూర్చొని తమలపాకులు వేసుకొంటూనే మాటల్లో మాటగా రాఘవయ్యగారు రమణ పెదనాన్నని అడిగారు "ఆ కుర్రాడెవరని"

'వాడా! ఏదో ఆఫీసులో పనిచేస్తున్నాడు ... వాడి మాటకేంగాని మీరొకసారి వీలు చూసుకొని బరంపురం రావాలి.'

" రాకేంగాని — నా కెక్కడ తీరుబడి? రిటైరయి కూర్చుందామంటే అయిందా? అమ్మాయి ఢిల్లీ వచ్చే

మంటుంది? పెదమనుమరాలు ఉమ చెంగల్పట్టు వచ్చే మంటుంది. యింక యీ రెండో మనమరాలు యీ విశాఖ పట్టణం కదలకంటుంది." నగవు వెళ్లబోస్తూ చివరికి తులశమ్మే పంతం నెగ్గించుకొన్నట్లుంది.

వెంకటరమణమూర్తిగారు తులసి వేపు చూసి 'నిల్చుంటావెందుకమ్మా—కూర్చో' అన్నారు.

తులసి మౌనంగా మెడగా కుర్చీమీద కూర్చుంది. రాఘవయ్యగారు మాటలు పొడిగించారు.

"ఆంధ్రులు ఆంధ్రదేశం అంటే మహా వెఱ్ఱుంది. వాళ్ల మీద దుమ్మెత్తామంటే మనల్ని మరి బ్రతకనివ్వరు!"

ఈ స్తుతితో తనకు సంబంధం లేనట్లుగానే తులసి ముఖం పక్కకు తిప్పింది.

"అటు తల్లి పోరుపెడుతుంది. అల్లుడు పెద్ద యింజనీరా—'రా' అని అంటే వాడిమాటలు వింటుందా? దీని తరవాత అమ్మాయి మాంచాల, పదేళ్ల తమ్ముడు కమలాకరం కూడ ఉత్తరాలు వ్రాస్తూంటారు రమ్మని... నేను వెళ్లనంటే వెళ్లనంటుంది. తాతయ్య దగ్గిరే యిక్కడే వుంటానంటుంది. ఇక్కడ పూర్వులు గడించిన మేడ వుండబట్టి

వున్నాను... లేదా అంటే ఆ కూతురు దగ్గిరే కాలం వెళ్లబుచ్చేవాడినా...?"

తులసి హఠాత్తుగా కలుగజేసుకొని "స్కూళ్ల యిన్ స్పెక్టరుగా వుండి దోచావుగా తాతయ్యా!! ఈ యిల్లు లేక పోతే గోదావరి తీరంలో కట్టుకొనే వాళ్లం."

ఇద్దరు ముసలాళ్లు ఫక్కున నవ్వారు. తులసి కూడా తరవాత చిరునగవు వెళ్లబోసి, "సరే...సరే..." అంటూ మాటలు దొరక్క సిగ్గుపడిపోయింది. రాఘవయ్యగారు నవ్వు తూనే "చూడండి యెంతనింద నెత్తిన వేసిందో! దోచానా?" అన్నాడు. మనుమరాలివేపు తిరిగి, "పోవే, నీకు ఏ స్కూల్ యింస్పెక్టరో మొగుడుగా దాపరిస్తాడులే. అప్పుడు వాడితో కదలవా యేం?"

తాతయ్య హాస్యానికి కొంచమైనా చలించకండా "కదలనంటే కదలను" అంది.

"అలా అంటే యెలా అవుతుందమ్మాయ్! మొగాళ్ల యిష్టంగాని."

ఈ కొత్త చుట్టం కలుగచేసుకొంటాడని అనుకోని తులసికి ఆశ్చర్యం కాసేపు ఆవరించింది. ఐనా నవ్వుతూ "ఈ

కాలం మొగాళ్లు అలా అనుకోంటే మొగాళ్లు కారు. యిష్టా యిష్టాలు మగవాళ్లకి ఆడవాళ్లకి సమానంగానే వుంటాయ్."

కొత్త ముసలాయన ముక్కు నులుపుకొని బదులు చెప్పలేదు. పాప గబగబ మేడమెట్లు ఎగబాకుతూనే "పిన్నీ—పిన్నీ" అని కేకలు వేయటంతో తులసి లేచి వెళ్లింది. ఉమ క్రిందనుంచే "భోజనానికి వేళ కాలేదే" అంది.

౪

వెంకటరమణమూర్తిగారు హాస్పిటల్‌లో చేరి మూడు రోజులైంది. హెచ్చుడబ్బు వుండటమే యీ జబ్బు. అంతకంటే యేమిలేదు. డాక్టర్లు యీయన వైఖరీచూసి 'సరే! రెండు వారాలుంటేచాలన్నారు. స్పెషలు వార్డులో మంచంమీద నుంచి యిచ్చే ఆజ్ఞలను శిరసావహించటంలో రమణారావు ప్రాణంపోతోంది. ప్రతిదానికి రాఘువయ్యగారి యింటికే వెళ్లాలి. ఇది యిమ్మన్నారు, అది యిమ్మన్నారు, అని అడిగి తెచ్చేసరికి సరిపోతోంది. కేరియరుతో భోజనంకూడా తనే మోసుకెళ్లాలి.

రాఘువయ్యగారి యింటికె వెళ్లేటప్పుడు యే అమ్మాయిల యెదరగానో, యే పెద్దమనుషుల కళ్లయెదటో, యే పాపాయిల ముందరో "బూచీ" అయిపోతున్నాడు. తప్పించు

కుందామన్నా వీలుపడని పరిస్థితులలో మనసులో పెద్దపెట్టున యేడ్చుకోవటం తప్పించి విమోచన మార్గాన్ని ఆలోచించ డానికి సాహసించ లేదు.

బాగా చీకటిపడింది. ఖాళీ కేరియరుతో రాఘవయ్య గారి యింటికి వచ్చాడు.

తలుపు తోసుకొని లోనికి వెళ్ళేసరికి గదిలో తులసి కుర్చీమీద యేదో పుస్తకం పట్టుకొని కూర్చొనుంది. ఎత్తిన తల దించి ఏమీ మాట్లాడదు. రమణ ఆమె ముఖం వేపు చూడలేదు. కాళీ కేరియర్ అక్కడపెట్టి ఏదో అడుగుదా మనే సంకల్పంతో యింటి వాసాల వేపు చూస్తూ నిల్చున్నాడు.

'ఏం యింటివాసాలు లెఖ్ఖపెడుతున్నావా ?"

యీ ప్రశ్న చాలా అసహజంగా వినిపించిందతనికి. తనని యిప్పుడు ఒరే అని సంబోధిస్తున్న స్నేహితులు మొదట 'ఏమండీ—మీరు' అంటూనే వచ్చారు.

దీనికి జబాబీయలేదు—దృష్టి నేలమీదకు మరల్చాడు.

'పోనీ ఆ గచ్చువెయ్యటానికి ఎంత సున్నం పట్టిందో చెప్పు చూద్దాం ?'

ఒళ్లుమండింది. గొంతుక గురగురతో కటువుగా "మీరు మహా చెప్పగలిగినట్టు ? " అన్నాడు.

"నువ్వు చెప్పలేనంటే చెప్తాను కూర్చో— "

మర్యాద తెలియని మూఢురాలువేపు చూస్తున్నట్లుగా చూస్తున్నాడు.

ఆమె మందహాసంతో తేలిగ్గాఅంది. "యీమాత్రం చెప్పలేకపోయావ్. ఎంత సున్నం పట్తుంది ? పట్టినంత ! "

మొఖం మొద్దుదేరింది. "నువ్వెప్పుడైనా యెవరితోనైనా స్నేహం చేశావా? " ఆమె మళ్లీ వెటకారంగానే అంది.

జవాబు రాకపోవటం గుర్తించి హేళనగా "వాళ్ళు మర్యాదస్తులేనా " అంది.

"వాళ్లు మర్యాదస్తులుకారని మీరు భయపడక్కర లేదు."...అన్నాడు చివరకు యెర్రగా ఒకసారి చూసి.

"మధ్యను నాకెందుకూ భయం! నీకే మర్యాద తెలిసుంటే కూర్చోమంటే కోపంగా చూడవు!"

మాటాడకండా కూర్చున్నాడు.

సిగ్గుపడేవాళ్ళు అనాలనుకున్నది వెంటనే అనలేరు. అంతేకాక మనస్సులో వున్నది మాటల్లోకి వచ్చేసరికి మొండిదైపోతుంది. ఎన్నెన్నా అనుకున్నాడు కాని చివరకు ఒక్క మాట అన్నాడు. "ఇలా పగపడితే మీ కేం వస్తుందని."

ఇలా అన్నందుకు సిగ్గుపడ్డాడు. కానీ ఆ సిగ్గు ఆ జవాబు విన్నాక మరచిపోయాడు. . .ఆమె నవ్వకుండానే అంది "నేనేం చేశానని, ఎక్కడ కనిపించినా పాపే బూచీ అనేది."

"మీరు నేర్పకపోతే ఆ పిల్లకేం తెలుసు? నిజానికి ఆవేళ నేను చెయ్యాలని చేయలేదు"

"కళ్ళున్నవాళ్ళు అలా గ్రుడ్డిగా నడుస్తారని నేనెప్పుడూ అనుకోలేదు."

"ఎలాంటి ప్రమాణం చెయ్యమన్నా చేస్తాను. నేను చెయ్యాలని చెయ్యలేదు."

"చేసినపని చేసి మాటాడకుండా పోయావుగా"

"నామీద నాకే అసహ్యం వేసింది. అలా వేగంగా వెళ్ళిపోయాను. ఆ రోడ్డు మలు పలాంటిది. పైగా ఎలక్ట్రిక్ స్తంభం అడ్డొచ్చింది, గప్పున తిరిగేసరికి."

"ఆ స్తంభానికి ఢీకొనలేకపోయావ్ ?"

రమణ కాస్సేపు సమాధాన పరచే విధానం చేతకాక ఊరుకున్నాడు. తరవాత ముఖమెత్తి "పాప మీ మాట వింటుంది. దయచేసి మీరు చెప్పితే..."

"దయచేసి" అంది తులసి వెటకారంగా. వెనువెంటనే పకపక నవ్వింది. అంతవరకూ గోడచాటున దాగొని యీ సంభాషణ వింటున్న వుమ చప్పున వచ్చి నవ్వుతూ 'ఓహో! బూచీ వచ్చాడే' అంది. తులసి మళ్లీ నవ్వుతూ "చూడక్కా! పాపను చూస్తే..." అర్థోక్తిలో ఉమ గంభీరమైన ముఖంతో తులసిని మందలిస్తూ ఆపింది. రమణవేపు తిరిగి చిన్న నవ్వు నవ్వి "మీ పెదనాన్న యీవేళ వేగంగా భోజనం చేశారే" అంది. రమణ తలవూపాడు. తులసి రమణ లోకువ దాస్యాన్ని యెత్తిపొడిచేటట్లుగా "దయచేసి...మీరు చెప్పితే" అంటూ వెటకారించింది. ఉమ చెల్లెల్ని కసరి "మర్యాదిస్తుంటే ముఖం గాని మొత్తిందా యేం? ఊరుకో. అట్టే నవ్వకు" అంటూ రమణరావు దగ్గరగా నున్న కుర్చీమీద కూర్చొని సౌహార్ద్రమైన స్వరంతో "పాప వూరుకోక యేంచేస్తుంది? బిస్కట్ చేతిలో పెట్టి యెలా చెప్పితే అలా వినే పిల్ల. మంచికథలు చెప్పావంటే నిన్ను విడిచిపెట్టదు." అన్నది.

ఉమ ఆడిన యీ మాటలుకన్నా, తన లోకువ దాస్యాన్ని యెత్తిపొడిచిన మాటలు రమణ మనస్సులో నాటుకపోయాయ్.

ఈ పదహారేళ్ల పెదాల పెంకెతనాన్ని అణచే మార్గం కోసం ఆలోచిస్తున్న రమణరావు వేగంగానే శలవు తీసుకొని వెళ్లిపోయాడు.

✂

మరుచటిరోజు సాయంత్రం రమణను చూసి పాప మళ్లీ మొదలు పెట్టింది. యీసారి దగ్గరగావచ్చి అంటోంది. తులసి వంటయింట్లోనుంచే చాటుగా కిటికీగుండా వస్తోంది.

"పాపా...రా" అని పిలచాడు ఆప్యాయంగా.

పాప అడుగు కదపలేదు కాని సర్వాం పెద్దది చేసింది.

" బూచీ అంటే బిస్కట్ యివ్వను. తెలిసిందా ? " అంటూ జేబులోంచి బిస్కట్ పాకెట్ తీసి చూపించాడు.

" నాదగ్గర లేవేమిటి ? "

" అవి మంచివి కావు. "

" ఛో. నీవే మంచివి కావు "

" రా పాపా " దగ్గరగా వచ్చి పాపను యెత్తుకో బోయాడు. చేతినుంచి జారిపోయి పరుగెత్తి మేడమెట్లు సగం యెక్కి " అమ్మా బూచి చూడే...... " అంది సగం యేడుపుతో.

అక్కడకు వచ్చిన పిన్నిని చూసి పాప గబగబ మెట్లు దిగి "పిన్నీ" అంటూ దగ్గరకు వచ్చి నిలుచుని రమణారావు వేపు కొఱకొఱ చూసింది.

పాప నలా నిలబెట్టి "ఎవరే బూచి! నువ్వే బూచీ... పాపే బూచి" అని రెట్టించింది. ముఖం ముడుచుకొని కోపంగా పాప వేపు చెయ్యి చూపిస్తూ —

పాప కళ్లల్లో నీరు గిర్రున తిరిగిపోయింది. ఇది పచ్చి మోసమని ఆ లేతమనస్సుకు స్ఫురించకపోయినా పిన్నికి కోపం వచ్చిందని మాత్రం తెలుసుకొంది. 'పిన్నీ' అని కేక వేసి తులసి కాళ్లను పట్టుకొని ముఖం దాచేస్తూ యేడవటానికి ఉపక్రమించింది.

సైగ చేస్తూ 'పాపే బూచీ అను' అంది తులసి రమణ వేపు చూస్తూ. కాని ఆ పిల్ల పరిస్థితి చూసి పెదిమలు కదప లేకపోయాడు.

"అనండీ మహాత్మా" అంది మందహాసంతో క్షమార్హుడైన రమణతో.

కానీ రమణారావు మనస్సంతా ఆనందంతో వూగులాడింది. యిటువంటి అతిప్రియమైన పలుకులను తను వింటా

పొరపాటునైనా వూహించలేదు. బహుశః తన మనస్సంతా ఆడవాళ్లను గురించి ఆలోచనలో పడి వుండవచ్చు.

మాట్లాడడానికి నోరు పెగిలిందికాదు.

తులసి చప్పున రమణ మానానికి చెంప పెట్టుగా 'నీకంటె పాపే నయం అన్నమాట' మాటలు జారవేసింది.

పాపను భుజంమీద వేసుకొని వసారాలో నిల్చుంది. ఉమ చెదిరిపోయిన జుత్తుతో ఆవులింతలు తీస్తూ మెట్లు దిగుతూంది.

“ఉమ ఊర్మిళై పోతోంది. ఆ చెంగల్పట్టులో ఏ శూర్పణఖ వెంటాడుతుందో ఆలోచించవేమే అక్కా?”

“ఏం యీ సరసం—రాజుల సరసంలా.”

“నీ కెప్పుడూ నిద్దర. తాతయ్య కెప్పుడూ క్లబ్బులో గుర్రాలు ఏనుగులమీద సవారీ...యింవేళైనా కాస్త వేగంగా లేమంటే...”

“ఇంకా టైముందికదే...ఓహో బూచీ వచ్చాడే—వంటయిందా?”

“ఎవరే బూచీ? నువ్వో బూచీ—ఉమే బూచీ”

“కథేమిటి అడ్డంగా తిరిగింది. నువ్వూ పాపనై పోతున్నట్లుందే!”

"కాస్త లావుగా వున్నావుగా, నీలాంటి వాళ్లను చూచి నాలాంటి పాపలు జడవాలే!"

"ను వ్వెప్పుడూ యిలా వుండిపోవులే."

"ఉంటానని ధైర్యమేనే."

"అంతా నీ చేతుల్లోనే వున్నట్టు."

"అంతా నా చేతుల్లోనే వుంది. నేనూ కూర్చుంటే యీ సరికి నీకన్నా..."

"యింకా ఎన్నిరోజులే వుండిపోతావు" కటువుగా అంటూనే ముఖం తిప్పుకొని పెరటికి నడిచింది ఉమ.

ఇంతవరకు ధర్మ సందేహంతో కొట్లాడు కొంటూన్న పాప ఒక్కసారి 'పిన్నీ' అని పిలచింది. హాస్యాన్ని హాస్యంగా తీసుకోలేని అక్కవే పింకా అలా చూస్తూనేవుంది. తులసి ముఖంలో మారే రంగులను పరీక్షిస్తున్నాడు రమణారావు.

పాప పిన్ని భుజంమీాద తల ఆన్చుకొనే 'పిన్నీ' అని పిలచింది.

"ఏం పాపా?"

"బూచీ ఎవరు పిన్నీ"

"ఎవరూ కారే"

తల ఒక్కసారి పైకెత్తి పిన్ని ముఖంవేపు చూస్తూ.

"అమ్మ కాదూ ?"

"కాదే"

"నేనో"

"నువ్వూ కాదే"

"మరి బూచో ?"

తులసికి నవ్వాగింది కాదు. పాపదృష్టి రమణరావు వేపుంది.

"ఆయన పేరు బూచీ కాదే. బూచీ చచ్చి పోయాడు."

"ఎప్పుడు పిన్నీ ?"

"ఎప్పుడో చెప్తాను. నువ్వు ఆయనకు నమస్కారం పెట్టే" రమణరావును చూపిస్తూ అంది.

'చెప్తావా ?'

'నే నెప్పుడైనా అబద్ధం ఆడేనా ?'

పాప పిన్ని ముఖంవేపు అనుమానంగా చూస్తూనే వుంది. ఒక్కసారి రెండుచేతులు జోడించి నమస్కారం అంది. రమణరావు ఆనందం పట్టలేక చేతులు చాచాడు. పాప కుడి కన్నును కుడిచేతి చూపుడు వేలితో మూసి నోరు తెరచింది.

'వెళ్లమ్మా పాపా' అంటూనే రమణతావు వేపు వంగింది తులసి.

'పిన్నీ బూచీ ఎప్పుడు చచ్చిపోయాండే?'

'ఎవరికి నమస్కారం పెట్టావో వాళ్లనే అడుగు.'

'నువ్వు చెప్తా నన్నావ్'

'నా కంటే అతనే బాగా చెప్తాడు. వెళ్లమ్మా' అంటూనే రమణ చేతికి అందిచ్చింది పాపను.

'యీ వేళ కేరియర్ నేనే తీసుకువెళ్తున్నా. మేం వచ్చేవరకూ పాప నువ్వూ యిక్కడే వుంటారు కదూ! పాపకు మంచి మంచి కథలు చెప్తాను కదూ...బూచీకథ...మాంచాల కథ...'

'మాంచాల పిన్ని కథే' పాప బిగ్గరగా అంది.

తులసి నవ్వుకుంటూ వంటి యింటివేపు వెళ్లిపోయింది.

ఆస్పటల్‌కు వెళ్లేవాండు పాప వస్తానని యేడ్చింది. తులసి 'తాతయ్య యిప్పుడే వస్తారు. నువ్వూ తాతయ్యా కలసి కారుమీాద వద్దురుగాని అందాక రవణ దగ్గర వుండు మంచి కథలు చెప్తాడు' అని సమాధాన పరచింది.

ఉమ తులసి వెళ్లిపోయాక, తలుపులు గడియవేసి పాపను యెత్తుకొని మేడమీాదకు పోయాడు.

'బూచీ ఎవరో రేపు చెప్తానమ్మా' అన్నాడు.

'యిప్పుడే' అంది పాప విసుక్కుంటూ.

'ముందు మంచికథ చెప్తాను వింటావా?'

పాప రమణ ముఖంవేపు చూసింది.

'నీ పేరేమిటో ముందు చెప్పాలి?

'పాప' అంది సంకోచిస్తూనే.

'నాన్న పేరు?'

'నాన్న'

'అమ్మ పేరో?'

'వుమ'

'పిన్ని పేరు?'

'పిన్ని'

'మరి నా పేరో?'

'................'

పాపను గిరుగిన తిప్పుతూ 'ఘట్టిగా నవ్వుతే నా పేరు చెప్తాను.'

పాప నవ్వలేదు. ముద్దుపెట్టుకొంటూ 'మంచి పాపవే నువ్వు. ఆడుతూ పాడుడూ నవ్వుతూంటావు కదూ?'

పాప మాటాడలేదు.

"అదిగో ఊరుకో కూడదు. మంచి పాపలు మంచిగా మాట్లాడాలి. నవ్వుతాను 'చాచా' అనాలి తెల్సిందా ?"

"చాచా !!"

"అవును నా పేరు చాచా. చాచా అని నాలుగు సార్లు పిలు. పిలమ్మా పిలు. నన్ను చాచా అని పిలిస్తే బూచీ కథ... మాంచాల కథ...యింకా ఎన్నో మంచి కథలు చెప్తాను."

"రోజూ చెప్తావా ?"

"అదిగో నువ్వు చాచా అని పిలవందే. పిలిస్తే నే చెప్తాను."

"చాచా" అంది పాప మెల్లగా.

"మళ్ళీ"

"చాచా"

"ఘట్టిగా నాలుగు సార్లు"

"చాచా, చాచా...చాచా...చాచా"...

"నువ్వు నా పాపవేకదూ ?...అవును చాచా అను."

"అవును చాచా,"

"నువ్వు చాచా చెప్పినట్లు వింటావు కదూ,—వింటాను చాచా అను."

" వింటాను చాచా. "

" అదిగో మెల్లిగా—భయపడుతున్నావ్. పాపలు భయపడకూడదమ్మా. ఏదీ మంచి కథలు చెప్పు చాచా అను"

"మంచి కథలు చెప్పు చాచా."

"అయితే మంచి కథ ఒకటి చెప్తాను—ఊఁకొట్టావా."

పాప తల వూపింది.

"అదిగో భయపడితే చెప్పనమ్మా. చాచా దగ్గర భయపడకూడదు. ఊఁ కొట్టాను చాచా అనాలి. అంటావు కదూ."

"ఓ"

"అయితే అను"

"ఎలా అనాలో చెప్పు చాచా"

" నువ్వు చాలా మంచి పాపని. నీకు మంచి కథలు రోజూ చెప్తాను. పెద్ద యేనుగు కథ. కోతి కథ. మంచి బొమ్మలు రోజూ కొంటాను. ఏం. రేపు సాయంత్రం మరి బీచిలో ఆడుకొందాం. చిన్నపాపలు...పెద్దపాపలు యెందరో వస్తారు. వెళ్దామా? "

"పిన్నో"

"పిన్నెందుకు? పిన్ని పాప కాదే. పాపలతోనే ఆడు కుందువుగాని. అక్కడే బూచీకథ చెప్తాను. పిన్నిని ఏమీ

అడక్క......అబద్ధాలు చెప్తుంది. చూశావా—చాచాని బూచీ అని ఎలా అబద్ధం చెప్పిందో. నేను చాచాని. రోజూ చాచా అని పిలుస్తావా ?—పిలుస్తానను."

"పిలుస్తాను"

"ఏమని పిలుస్తావ్"

"చాచా అని."

"గట్టిగా యిప్పుడు పదిసార్లు పిలిచేయమ్మా."

"చాచా...చాచా...చాచా...చాచా"

"ఒకటి, రెండు, మూడు...పది. అమ్మయ్య యిక కథ మొదలెడ్తా. బూచీకథ రేపు.

"ఇప్పుడే"

"మంచి బాలరాజు కథ చెప్తాను. యెక్కడ తెలియక పోయినా అడుగుతావు కదూ ? అనగా, అనగా ఒక బాల రాజ్యం వుండేది. బాలరాజ్యం అంటే ఏమిటో తెలుసా ?

పాప తెలియదన్నట్లుగా తలవూపింది.

'బాలరాజ్యం అంటే పెద్దదేశం. మేడలూ, పడవలూ, సినీమాలు, మోటార్లూ అన్నీ వున్నాయి ఆ దేశంలో. అక్కడ రాజు బాలరాజు. రాణీనీలాంటి పాపే. మంత్రి ఒక పాపాయి. నీలాంటి చిన్న చిన్న పాపాయిలే అందరూనూ. అక్కడ బాల

లందరూ సుఖంగా బతికేవాళ్లు. అల్లరంటూ లేనేలేదు. పాపా యిలే మోటార్లు, రైళ్లూ, విమానాలు నడుపుతారు...కోతిని ఎక్కడైనా చూశావమ్మా?"

"ఓ"

"ఎక్కడే!"

"నాన్న చూపిస్తే...అక్కడే కోతులూ, బాతులూ, పెద్దఏనుగూ..."

"ఓహో మెడ్రాసులో చూశావా? కోతి ఎలా వుంటుందమ్మా?'

"కోతి...కోతి..."

"తోక వుంటుందని చెప్పాలి మరి. ఆ కోతి ఒకసారి బాలరాజ్యంలోకి వచ్చింది. కిచకిచలాడుతూ మేడమీాద గెంతులేసింది. ఇంకేం చేసిందంటే బిస్కత్తులూ పిప్పర మెంట్లూ, చాకలేట్లూ, దొంగలా తినేసింది. ఆఖరికి రాజుగారి సింహాసనం మీాద కూర్చుంది. మరి బాలరాజుకు కోపం రాదూ?"

"ఓ"

"కోతిని పట్టుకోవాలని ఆర్డరువేశారు. పదిమంది పాపా యిలు పట్టుకోడానికి వెళ్తే కిచకిచలాడుతూ వాళ్ల బుర్రల మీాద గెంతులేసి పాపాయిలను కరిచేసింది. ఎవరూ పట్టుకో

లేకపోయారు. మరి ఆ దేశం రాణీ యేమో నీలాంటి పాపే కదూ. నీకు భయంలేదు కదమ్మా? - లేదు అనూ!"

"లేదు"

"ఆ రాణి నీలాంటి పాపే. బాలరాజులా కోటూ అదీ వేసుకొని పెద్ద తాడు పట్టుకొచ్చింది. ఆ కోతి ఏం చేసిందంటే?..."

"యేంచేసింది"

"యేం చేసింది చాచా అంటేనే?"

"యేంచేసింది చాచా?"

"రాణీ చెయ్యి కరిచేసింది."

"రాణీ చెయ్యే!"

"కరిచేసినా......రక్తం కారినా రాణీ కోతిని విడిచి పెట్టలేదు. తాడుతో ఘట్టిగా కోతిని స్తంభానికి కట్టేసింది. చూశావా ఆ పాపాయి ఎంత ధైర్యమయిందో? కోతి కిచ కిచమంటూ ఏడుస్తోంది. బాలరాజు వచ్చాడు. దేశంలోని పాపాయిలంతా వచ్చారు. పెద్ద సభ అయింది. ఆ సభలో రాణీపాపని అందరూ మంచి పాపన్నారు. చూశావా భయం లేని పాపలు ఎంత మంచి పాపలో. నువ్వూ! భయపడ్తావా?"

"ఊహు"

"ఊహు చాచా అనాలి...యేది అను మరి?"

"ఊహు చాచా."

బాలరాజు అడిగాడు. 'కోతీ కోతీ యెందుకీ దేశం వచ్చావ్ అని.' కోతి యేమందంటే చూడ్డానికి వచ్చానంది."

"చూడ్డానికా వచ్చావ్ ? అబద్ధం ఆడుతున్నావ్. మా బిస్కెట్‌లన్నీ పరపరమని నమిలేశావే. మా చాకెలేట్లన్నీ చప్పరించేశావే...మా పకోడీలు—జిలేబీలు, బుగ్గిలో కలిపేసావే. ఇన్ని పెద్దతప్పులు చేసింది కాకుండా బాలరాజు సింహాసనంమీద కూర్చోడానికి నీ కెన్ని గుండెలున్నాయ్ ?" అని బాలరాజు కోపంతో అన్నాడు.

"రాణీయో"—అంది పాప ఉత్సాహంతో.

"రాణీ యేమందంటే...ఓయీ కోతీ! బాలరాజ్యం వీరుల రాజ్యం సుమా! వాళ్లకి భయం అన్నది లేనేలేదు. మంచివాళ్లందరినీ వాళ్లు పూజచేస్తారు. చెడ్డవాళ్లందరినీ మంచిగా ఉండేటట్లు చేస్తారు. నువ్వు మా దేశాన్ని దోచేసి పాడుచేశావ్...నేస్తంగా వచ్చుంటే మా సింహాసనం పక్కనే కూర్చోబెట్టుకొనే వాళ్ళం. చూశావా పాపా ? యెలా అందో ఆ రాణి. బాగా అంది కదూ ?"

"ఓ"

"మరి చాచా మంచివాడు కదమ్మా ?...మంచివాడే అను. ?

"మంచివాడే,"

"మంచివాళ్ళను బూచీ అనకూడదు. మరి రేపటినుంచి అనవుకదూ. అననంటేనే కథ చెప్తాను. లేదా అంటే చెప్పను."

"అనను."

"అనను చాచా అనాలి."

"అనను చాచా."

"ఆ కోతి యేం చేసిందంటావ్ ? యేడ్చింది. నేనేమీ యెరుగను బాలరాజా! నేస్తంగానే వచ్చాను. నే నేమీ తినలేదు. యీ పాపాయి లంటే నా కెంతో ఆనందం. వాళ్లు నన్నుచూసి గెంతులేస్తారు. నవ్వుతారు. కోతీ పేలు చూడవూ అని తలలందిస్తారు. అలాంటి పాపలంటే నా కెంతో సరదా! వాళ్ళకి నేస్తంగానే వచ్చాను రాజా! నన్ను వదిలేయవూ?" అంటూ ఏడ్చి చెప్పిందమ్మా."

"బాలరాజు వదిలేశాడా ?"

"లేదే—వదిలేస్తాడా ? బాలరాజు చాలా మంచివాడమ్మా. మంచివాళ్ళకు ఎవరైనా అబద్ధం చెప్తే వినబడదు. నిజం వినుపిస్తుంది. చూడు నువ్విప్పుడు ఒక్కబిస్కత్తు దొంగతనంగా తినేశావనుకో. యెవ్వరూ చూడలేదని అబ్బేతిన లేదు చాచా అంటావనుకో. చాచా చాలా మందివాడు కదూ? చాచాకు ఎలా వినిపిస్తుందంటే. . . నేను తినలేదని నువ్వంటావ్

చాచాకు నేను తిన్నాను అని వినిపిస్తుంది. అంచేత అబద్ధం ఆడకు. దొంగతనం చెయ్యకు. ఏం మాటాడవమ్మా...అబద్ధం ఆడను చాచా'' అను.

"అబద్ధం ఆడను చాచా."

"దొంగతనం చెయ్యను చాచా—" అను.

"దొంగతనం చెయ్యను చాచా."

"అయితే బాలరాజుకు కోతి ఆడిన మాటలు వినిపిస్తాయా? వినిపించవు కదూ. ఎంచేత? బాలరాజు మంచివాడు కాబట్టి నిజమే వినిపిస్తుంది. కోతి అబద్ధం ఆడిందికదూ. బిస్కట్లూ, చాకలేట్లు తినేసింది కదూ."

"తినేసింది. కోతి మంచిదే కాదు."

"అయితే, చెడ్డకోతికి యేం శిక్ష వేదామో చెప్పూ."

పాప ఆలోచనలో పడ్డది.

"చంపేద్దామా?"

"పాపం వద్దు చాచా."

"అయితే ఏం చేద్దామే? వదిలేద్దామా?"

"మళ్ళీ బిస్కట్లు తినేయదూ?"

"అయితే యేం చెయ్యాలో నువ్వే చెప్పాలి మరి. పాపవి కదూ!"

కొంతసేపు అలాచూస్తూ వుండిపోయాడు. ఆలోచనలో యేదో స్ఫురించినట్లు పాప చప్పున 'అందులో పెట్టేద్దాం' అంది.

"ఎందులో ?"

"నాన్నా నేనూ చూశాం..."

"ఓ హో బోనులోనా......యెంత తెలివైన పాపవే...నువ్వు నా పాపవే..." అంటూ పాపను తన ఉనికినే మరచి ముద్దులాడాడు.

౬

రమణారావు రెండోరోజు వుదయమే వచ్చాడు. ఉమ అంది. "ఏమిటోయ్ చాలా మంచి కథలు చెప్పావట పాపకి."

"ఎక్కడో చదివింది జ్ఞాపకంవస్తే చెప్పాను." ముక్తసరిగా తేల్చి పాపదగ్గరకు వెళ్లి "రా—పాపా పెద్ద పడవ చూపిస్తా" నన్నాడు.

"పెద్ద పడవే ?"

"అవును—రా అమ్మా" పాపచెయ్యి పట్టుకొని మేడ మెట్లు దించాడు. ఉమ 'హార్బరుకు తీసుకువెళ్తా వేమిటి ? అంది మేడమీంచే.

అందాకా కాదు. స్టీమరు యిప్పుడే వెళ్లిపోతోంది. టౌనుహాలుదగ్గర నిలబడి వచ్చేస్తాం" అంటూ నడిచాడు ముందుకు.

పాప రమణ చిటికిన వేలు పట్టుకొని నడుస్తోంది.

"నన్ను చాచా అని పిలవలేదేం పాపా ?"

"మరిచిపోయాను చాచా."

"నువ్వు చాలా మంచిపాపవి" అంటూనే యెందుకో నవ్వుకొన్నాడు.

వీళ్లిద్దరు ఔనుపోలు దగ్గరికి వెళ్లేసరికి, స్టీమరు చాలా దూరం వెళ్లిపోయింది.

"యెన్ని పడవలో...మునిగిపోవూ ?"

"అబ్బే పడవలు మునగవే. ఆ పడవల్లో యిన్ని చేపలు పట్టారు"

"అన్ని చేపలే...మేం చేస్తారు చాచా ?"

"అమ్ముతారు. చేపలబజారు యెప్పుడైనా చూశావా? అబ్బా యెంత గోల. యింట్లో గోల పెట్టే యిల్లుకూడా చేపల బజారై పోతుంది. నువ్వు యింట్లో యెప్పుడూ ఏడవకేం ? ఎవరైనా వింటే ఛీ చేపల బజారంటారు."

ఏడవ నంది పాప. తరవాత చిన్న కథలు రెండు చెప్పాడు. కోయిల యెందుకు కూస్తుందంటే పాపాయిలు పాటలు నేర్చుకొంటారనట. చందమామ కూడ పాపాయేనట. శుభ్రంగా వున్న పాపాయిలు చందమామంత అందంగా

వుంటారట."...కబుర్లాడుకొంటూ తిరిగి వచ్చేశారు.

ఆ వేళ సాయంత్రం బీచికి తీసుకుపోయాడు. నవ్వించి, ఆడించి "నే నెవరమ్మా" అంటే "నా చాచా" అనే పరిస్థితికి తీసుకొచ్చాడు.

మరుచటిరోజు సాయంత్రం వేగంగా హాస్పటల్ నుండి వచ్చేసరికి పాప పరుగెత్తుకొని వచ్చింది.

"వెళ్దామా?" అన్నాడు.

"ఊ..." అని వీధిలోనే అడుగుపెట్టింది.

రోడ్డంతా నడుస్తూ "పాపా! నన్ను చాచా అని పిలవకపోతే నీకు బూచీకథ చెప్పనంటే చెప్పను."

"మరిచిపోయాను చాచా" అంది అమాయకంగా మీదికి చూస్తూ.

"మరచిపోకూడదు. యిక మరిచిపోను చాచా అని లెంపలు వాయించుకో."

పాప నిస్సంకోచంగా "మరిచిపోను చాచా" అంటూ లెంపలు వాయించటంతో రమణరావు తెల్లబోతూనే పాపను ఒక్కసారి చేతుల్లోకి తీసుకొన్నాడు.

బూచీకథ—మాంచాల కథ...పట్టి ఆ లేత హృదయానికి హత్తుకొనేటట్టు చెప్పాడు.

## ౭

"పాప నీ పేరు మంచిది కాదంది" భోజనానికి రమ్మన్న పిన్నితో ఆరాతిని.

"నీపేరు బాగుందేమిటె...?"

"మాంచాల పిన్ని పేరు చాలా మంచిది."

"ఎవరన్నారు?"

"చాచా"

"చాచా మెవరే?"

"చాచా తెలీదూ?"

"బూచీయేనా?"

"అన్నీ అబద్ధాలే..."

"పాపే అబద్ధాలాడుతుంది,"

"ఛో, నేను కాదు. నువ్వే. బూచీ మనిషేమిటె?"

"మరెవ్వరు?"

"పెద్ద...రా...క్ష...సు...డు. పాపాయిల్ని... పెద్ద వాళ్ళని బిస్కట్లలాగ నమిలేస్తే..."

"అలా అని ఎవరు చెప్పారే?"

"చాచా"

"అన్నీ అబద్ధాలే..."

"చాచా వస్తే చెప్తానుండు..."

"నన్నేం చేస్తాడు— నేనంటే మీ చాచాకి భయం."

"అమ్మా చూడే పిన్ని... అన్నీ అబద్దాలే... చాచాకి భయమట!" యీమాటలలో లేచి కూనిరాగాలు తీస్తూ ఉమ దగ్గరకు పరిగెత్తింది. తులసి ఆశ్చర్యపడి అలా నిల్చుండిపోయింది.

మరుచటిరోజు ఉదయం పరుపుమీదనుంచే 'అమ్మా' చాచా మంచికథలు చెప్తాడే—నువ్వూ.' వినే అంది.

ఉమ యీవేళ ఉదయమే ఆలోచనలో పడింది. పాప మాటలు వినిపించుకోలేదు. తులసి వింటోంది.

"ఏం కథలు చెప్పాడే మీ చాచా?" అంది కుర్చీమీద కూర్చొనే!

పాప ముఖం తిప్పుకొనే అమ్మదగ్గరకు వెళిపోయింది. తులసి ముఖం వివర్ణమైంది.

ఆవేళ వుదయమే రమణారావు వచ్చాడు. పాప పరుగెత్తి 'చాచా' అంటూ చెయ్యిపట్టుకొని మేడమీదకు తీసుక వచ్చి కుర్చీమీద కూర్చొబెట్టింది. తన చిన్న పేముకుర్చీ లాగి కూర్చొని, 'బాలచంద్రుడు చచ్చిపోయాడా చాచా' ప్రశ్నించింది తలతిప్పుతూ, రాత్రినుంచి కొట్టుకొంటున్న సంశయాన్ని తీర్చుకోటానికి.

"నిన్న చెప్పానుగా యుద్ధంలో చచ్చిపోయాడని."
"మాంచాల యేడవలేదూ?"

యీప్రశ్నతో పాపతలమీద చెయ్యివేసి అప్యాయంగా 'ఏడవలేదమ్మా... మంచివాళ్లు మట్టి ముద్దల్లా ఒక మూల కూర్చోరు. గొప్ప పనులు చేసి గొప్పగా చచ్చిపోతారు.'

"చచ్చిపోతే యేడవరూ?"

"మాంచాల మంచిదికదూ. మంచివాళ్ళు యెప్పుడూ యేడవరు. నువ్వుకూడా మంచిదానివి కావాలంటే యెప్పుడూ యేడవకూడదు. తెలిసిందా?"

తెలిసిందని తృప్తితోనే తలవూపుతూ, తులసి అక్కడకు వచ్చి నిలుచోడం చూసింది. గబగబ లేచి కుడిచేతితో రమణ నోరు మూసింది. పాప చేతిని పక్కకునెట్టి "ఏమే పాపా" అన్నాడు.

"బూచీ పిన్ని వచ్చింది-కథ చెప్పకు చాచా!"

ఇద్దరు ముఖాలు చూసుకొన్నారు. తులసి దించిన ముఖం యెత్తలేదు. రమణరావు యేదో గొణుక్కున్నాడు. పాప చటాలున—

"చాచా—పిన్నంటే భయమా?" అంది.

"లేదమ్మా" అన్నాడు నవ్వుతూ.

"పిన్ని అన్నీ అబద్ధాలే ఆడుతుంది"

రమణ పాపతలను తన భుజంమీద చేతితో ఆన్చి తల దించి నిలుచున్న తులసివేపు చూశాడు. ఆమె అసహాయత్వాన్ని, దిగులును గుర్తించి అన్నాడు.

"పాపా-బూచీ ఎవరో చెప్పానుగా!"

తలెత్తి "పెద్దరాక్షసు" డంది.

"అయితే పిన్నిని బూచీ యెందుకన్నావే?"

"పిన్నే నిన్ను బూచీ అనమంది చాచా!"

"అందుకేనా పిన్నిని బూచీ అని పిలచావ్—తప్పమ్మా... తప్పని లెంపలు వాయించుకో."

పాప నిస్సంకోచంగా లెంపలు వాయించుకోటం చూసి తులసి అక్కడనుంచి గబగబ వెళ్ళిపోయింది.

ఆవేళ సాయంత్రం రమణారావు వచ్చాడు. పాప యేడుస్తోంది. రమణను చూడగానే యేడుపు ఆపి, 'చాచా' అంటూ కాళ్లకు లంకెలు వేసింది. పాపను యెత్తుకొని 'యేడ్చే' పాపలు మంచిపాపలు కారమ్మా' అన్నాడు. పాపేమీ మాటడలేదు.

తులసి దగ్గరకు రాగానే పాప మళ్ళీ వుపక్రమించింది. 'యెందుకే యేడుపు?' అన్నాడు. తులసి అలా ఇంకా నిల్చునే వుంది. 'ఎందుకా?' అంటూనే ఉమదగ్గరకు వచ్చింది. తులసి వేపు తిరిగి, 'లెంపలు వాయించుకోవే' అంది.

"ఏం" అన్నాడు రమణారావు అర్థంగాక.

"నిన్ను చాచా అనిపిలిస్తే వీపు చదును చేస్తానంది.—మంత్రం వేశావుగా...నిన్నేమైనా దానెదురుగా అనగలం?"

రమణ పాపను భుజానికి ఘట్టిగా హత్తుకుంటూనే మేడమెట్లువైపు నడిచాడు.

వరుసగా వారంరోజులు వుదయమే వెళ్లేవాడు. పాపకి ప్రపంచం అంతా కథలమయంగా వుందేమో! కథలు చెప్పే టప్పుడు చూపించే ఆసక్తి, వేసిన వింతప్రశ్నలు, పొందుతున్న అనుభూతి చూస్తూ రమణారావు ఆశ్చర్యపడేవాడు.

పెదనాన్న దగ్గిరికి రెండురోజులై వెళ్లలేదు. తులసి వెళ్తోంది. మూడోరోజు సాయంత్రం ఉమ, తులసి బయలు దేరారు. రమణ, పాప మేడమీద కూర్చుని కథల గొడవలో వున్నారు.

బాగా చీకటి పడ్డాక ఉమ వచ్చింది. వెళిపోతానని రమణ లేచాడు. ఆగవోయ్ అంది ఉమ.

ఉమ యెదురుగా కూర్చొంది. తులసి కూడా గదిలోకి వచ్చి పరుపుమీద వాలి చేతిలోవున్న సంచికలోని పేజీలు తిరగ వేస్తోంది.

"రమణా! నువ్వూ మనిషి వేనా?" ప్రశ్నించింది ఉమ సూటిగా. తల దించుకొని పాప వేపు చూస్తున్న రమణ ఒకసారి తల యెత్తాడు. ఉమ కోపంతో వున్నట్లు గ్రహించాడు. కానీ జవాబీయడానికి యేమీ అర్థంకాలేదు. ఏమాటా దొరకలేదు.

"మెత్తగావున్న వాళ్లు గొంతుకలు కోస్తారోయ్" అంది. తులసి రమణవేపు సంచిక మూసి, చూసింది. రమణ యీమాటలకు వేగంగా జవాబిచ్చే పరిస్థితిలోలేడు. పాప దిక్కువచ్చి రమణ మొహం వేపు చూస్తోంది. చాలాసేపటి

వరకు నిశ్శబ్ధంగానే వుంది. రమణారావు నిల్చున్నాడు. పాప మీద చెయ్యివేసి తలదించుకొనే "వస్తాను" అంటూనే గబ గబ మేడ దిగిపోయాడు.

రెండోరోజు సాయంత్రింవరకూ వెళ్లలేదు. కేరియర్ మొయ్యటానికి మొదటిరోజులలో వెళ్లేటైముకు వెళ్లి చేతులు కట్టుకొని నిల్చొని "కేరియర్" అనిఅడిగాడు. తులసి కేరియర్ తెచ్చి చేతికి అందిచ్చింది. ఇదివరలా తలదించుకొనే వెళ్లి పోయాడు. మళ్లీ చీకటి పడ్డాక వచ్చి కాళీ కేరీయరును పెట్టేశాడు.

వెళిపోతుంటే తులసి ఆగమంది. ఆగాడు. "ఎవరిమీద అలిగావ్" అంది.

"అలక! దేనికి?"

"అయితే పొద్దున్న రాలేదేం?"

'రాలేదు!"

"ఏడ్చి ఏడ్చి పడుకొని అప్పుడే లేచి పలవరిస్తోంది. ఒకసారి చూస్తావా?"

రమణ మాట్లాడకుండా చలించనివాడి మల్లే గబగబ మెట్లెగబ్రాకాడు.

పాప చూడగానే "చాచా" అని కెవ్వున కేకవేసింది. ఉమ అక్కడేవుంది. పాపను భుజంమీద వేసుకొనియిటూ అటూ తిరుగుతున్నాడు.

"ఏడుస్తున్నావా?" అంది ఉమ చటుక్కున.

రమణ ఒక్కసారి ఆగి జబాబీయకుండా మళ్లీమామూలుగా నడుస్తున్నాడు.

"కూర్చో రమణా" అంది కంఠస్వరం మార్చి. పచారు చేస్తున్నవాడి ముఖంలో అదుర్దా కనబడింది. ఆమె యొక్క సంభాషణలోని ఆంతర్యాన్ని గ్రహించలేకపోయాడు.

కూర్చున్నాడు. పాప రమణపీకను రెండుచేతులతో మెలివేసింది.

"చూశావా? మాపాపకి నువ్వంటే ప్రాణం."

తలెత్తి ఆమెవేపు ఒకసారి చూసాడు.

"మేం వెళిపోతున్నాం తెలుసా?"

"ఎప్పుడన్నాడు తెల్లబోయి."

'ఆయన వస్తున్నామని వ్రాసారు. వెళిపోతాం! కొంచెం ఆగి "ఆయన కెప్పుడూ ఆఫీసుగొడవే. కాస్త తీరకదొరుకుంటే పుస్తకాలు. పాపకు ఆయనదగ్గర చేరికేలేదు".

రమణరావేమీ మాటడలేదు.

"నువ్వుచాలా గట్టివాడివేనోయ్" అంది ఉమ. యీ మాటలు వింటోంటే ఆతనిమనస్సు తేటపడుతోంది. హృదయంలో ఆమెనుగురించి తప్పించి మరేభావాలేదు.

"నిన్న యేదో అన్నాను, నీకూ మొదడుందిగా. ఒకరి వ్యవహారాల్లో సరిగ్గా తెలుసుకోకుండా జోక్యం చేసుకోటం తెలివి తక్కువ కదూ? యేం అనుకోకేం?"

ఏమనటానికి తోచలేదు. ఉమ సౌజన్య స్వరంలో అన్నది.

"ఎప్పుడైనా చిరాకువేసి యే మాటైనాఅంటే, ఆయన నవ్వేసేవారు. ఆ నవ్వు మరింత చిరాకు పుట్టించేది. ఏమనే వారో తెలుసా?" ఆడజన్మ—ఉహూ" అని నీరసంగా చూస్తే యెలావుంటుంది రమణా?"

రమణ జవాబుకు యెదురు చూడకుండానే మళ్లీ అంది "ఆడవాళ్లకీ రక్తం, మాంస, మానం, అభిమానం, వుందని, మీకంటే యేం తీసిపోలేదని పెద్ద లెక్చరు కొాస్తే ... మళ్ళీ ముసి ముసి నవ్వులే. ఒకనాడు నాకు భరించలేనంత కోపం వచ్చింది. "వెళ్లండి" అని గట్టిగా అరిచానేమో నోరుమూసు కొని వెళిపోయారు. రాత్రి పది గంటలవరకు రాకపోతే నాకు మరింత కోపం వచ్చింది."

"అహా" అన్నాడు రమణ పరధ్యానంగా వింటూన్న ట్లుగా. వచ్చారు. ఆకలేస్తోందన్నారు. కోపంతోనే వడ్డించాను. కబుర్లు చెప్తేగాని తినలేనన్నారు. ఏం కబుర్లు చెప్తాను? ఐతే లేచిపోతున్నామన్నారు. 'ఏం' అన్నాను చిరాకుగా. నాకిప్పుడు చిరాకెత్తిందన్నారు. "మరేం? నన్ను పొమ్మని అరవండి" అన్నాను. ఉహూనేను నీలాంటి ఆడదాన్ని కాను. సరే! రా యిద్దరం భోంచేద్దామన్నారు. బలేవారే నేను భోం చెయ్య లేదని ఆయన కేం తెలుసు"

రమణ నవ్వాపుకోలేక పోయాడు.

"ఏం రమణా నవ్వుతున్నా"వంది ఉమ.

"ఈప్రశ్నతో రమణ ఫక్కున నవ్వేశాడు. పాప నవ్వుతూ తలెత్తి చప్పట్లు కొట్టింది. తులసి గబగబ మీదికి వచ్చి "యేమిటీ గొడబ" అంది.

"మంచి పెద్ద కథ" అన్నాడు రమణారావు నవ్వుతూ. పాప "మంచి పెద్ద కథ" అని రెట్టించింది.

"మంచి పెద్దకథే—యేదీ మళ్లీ చెప్పు వింటానంది" తులసి.

"సరి! రెడ్డొచ్చాడు మొదలెట్టమన్నట్లుంది"

"చెప్పు రమణా!" ధీమాగా విందామని కుర్చీ లాగుకొని కూర్చుంది.

"చెప్పింది నేను కాదు— మీ అక్కే!"

"ఓహోహో అక్కా! మరేంచేస్తుంది? శ్రీ శ్రీ శ్రీ లక్ష్మణరావు బావగారి గురించేగా?"

అంటూ నవ్వుతూంటే ఉమ అక్కడనుంచి లేచి చరచరా వెళ్లిపోయింది.

వరుసగా మూడురోజులు పెద్దనాన్న దగ్గరకు వెళ్లలేదు. పాపని ఆడిస్తూ కూర్చున్నాడు. ఈవేళ ఉమ ప్రాణ స్నేహితురాలింటికి వెళ్లింది. తులసి కేరియర్ పట్టుకొని ధీమాగా వెళ్లిపోతూంటే రమణారావు మేడమీద నిల్చుని చూశాడు. తను కేరియర్ మోసు కెళ్లేటప్పుడు యెందుకు సిగ్గు

పడ్డాడో, యీయింట్లో మొదట యెందుకంత సిగ్గుగా మెలగ వలసి వచ్చిందో అంతు తెలిసింది కాదు.

పాప యీవేళ చాలా సర్దాగావుంది. మేడమీద యిటూ అటూ పరిగెడుతోంది. పరిగెత్తుతూనే చాచా అని పిలుస్తోంది కూడాను.

ఆలోచననుంచి బయటపడి "రోగంలేని మనిషి యీ ప్రపంచంలో లేడమ్మా" అన్నాడు.

పాప ఆగిపోయి "ఏమిటి చాచా" అంది.

"చీమని యెప్పుడైనా చూశావా?"

"ఓ......ఎన్నో...మొన్న— బిస్కట్లు తినేశాయి చాచా"

"ఎందుకు తిన్నాయే?"

"తినేశాయ్"

"ఎందుకూ?"

"ఎందుకా" అంటూ మొగం వేలవేసింది.

"ఎందుకో తెలుసా ? వాటితిండి అవే తెచ్చుకుంటాయి. మరి నువ్వో—అమ్మ గౌను తొడిగించాలి—చాచా కథలు చెప్పాలి. పిన్ని అన్నం పెట్టాలి—అలా వుండకూడదు. నువ్వే గౌను తొడుక్కోవాలి నువ్వే కథలల్లుకోవాలి. నువ్వే అన్నం పెట్టుకోవాలి. తెలిసిందా ?"

"ఓ"

"అయితే రేపట్నించి నువ్వే గాను తొడుక్కుంటావా?"

"ఎలా తొడుక్కోవాలో చెప్పు చాచా !"

"మంచి పాపవే నువ్వు. నీ కేవైతే తెలియవో, వాటిని అమ్మనో, నాన్ననో, అడిగి తెలుసుకోవాలి !

"నిన్నే అడుగుతాను చాచా !"

రమణమనసు యేదో ఒక అనుభూతితో వూగులాడింది.

"చాచా" అంది పాప, ఆ లేతచేతులలో కాళ్లను చుట్టివేసి.

"ఏం పాపా ?"

"చాచా, చాచా, అంటే యేమిటో ట—పిన్ని అంటోంది ఏమిటి చాచా ?"

"నేనే నమ్మా చాచాని."

"చాచా అంటే బూచీ అట—పిన్ని మళ్ళీ మళ్ళీ అంటోంది."

"చాచా : తెలుగుమాట కాదమ్మా. హిందీ లో చాచా అంటే చిన్నాన్న."

"అయితే చిన్నాన్న అని పిలవనా చాచా ?"

"వద్దమ్మా! చాచాయే బాగుంది కదూ." అన్నాడు ఆ చిట్టిచేతులను ముద్దు పెట్టుకుంటూ. ఆ వెనకనే నిట్టూర్పు గాఢంగా విడిచిపెట్టాడు.

తులసి తిరిగి వస్తూనే ఏమండోయ్ రమణారావుగారు! అంటూ పిలిచి అక్కడేవున్న కుర్చీని ఆనుకొని ముఖం రెండో వైపు త్రిప్పి "మిమ్మల్ని నమ్మి యింటివాళ్లెవరినీ రావద్దన్నాను. నా నమ్మకమైన బంటులని, నమ్మాను. ఇక వారం రోజులే వుంటానుగా. యింట్లో చూస్తే యిప్పుడు వచ్చేవారెవరూ లేరు. అందరికీ రోగాలే. యీ వెయ్యేళ్లు ధనంతో వర్ధిల్లేవాడికి యింత గర్వం ఊడిపడిందేం? ఇలాంటి వాడినేగా వాడు తగిలేశాడు."

"పాపకు యీ మాటలు చిరాకెత్తించినట్లుగా, "చాచా, ఆకలవుతోం"దంది.

"వెళ్లు, అన్నం పెట్టుకో అమ్మా" అన్నాడు నవ్వుతూ.

"నువ్వురా చాచా"

'ఇదేమిటి స్వయం పోషకత్వానూ?' అంది తులసి ముందుకు తిరిగి.

'అవును యీ వేళకి అన్నం యెలా పెట్టుకోవాలో చెప్పు. తేపటినుంచి పాపే వడ్డించుకుంటుంది.'

మాటలవరస మారుస్తూ 'యేమిటోయ్, ఆయన అలా అడుస్తున్నారు. ఏం లోటొచ్చిందని.'

రమణ యేమి అనలేదు.

'అవును అణిగేవాళ్లని అథఃపాతాళంలోనికి అణిచేయటం నాగరికత అనుకున్నాడేమో,' నవ్వు మనిసనుకొని ఆయన మాటాడ్డంలేదు.

'ఎవరే అంది' ఉమ గదిలో కాలుపెట్టూ.

'పెదనాన్న గారూ...!!'

'రమణేమంటాడు ?'

'మామూలే—నడు—పాపకి ఆకలేస్తోందట !'

రమణారావు నవుస్తూనే ఆలోచించుకున్నాడు. తన తరపున వకాల్తా తీసుకొని వాదిస్తూన్న యీ ఆడదాని మనస్సేమో, అర్థంగాని ఆల్జీబ్రాలా తలను చుట్టివేసింది.

౮

లక్ష్మణరావు రేపు వస్తాడనగా యీ వేళ వెంకటరమణ మూర్తిగారు బరంపురం ప్రయాణం కట్టారు.

పెళ్ళిముందు అందరి యెదురుగానే రమణారావును చూపించటం జరిగింది. ఈసారి తులసి అంతా వింది. కానీ యేమీ మాట్లాడలేదు. రమణారావు ఒక విధంగా ఒళ్ళు మండి జవాబీయలేదు.

చేసిన తప్పేమిటంటే కొన్నిరోజులు ఆ అమ్మాయిలను ఆస్పటల్ కు కేరియర్ లతో నడిపించాడు.

తులసి ఎందుకు తాతయ్య ఆ వేళ స్టేషన్ లో ఈ మనిషి తాలూకూ గుణగణాల్ని కొలిచి చెప్పారో అర్థమయింది.

రమణారావు ఆ మరునాటిరోజు రాత్రి తొమ్మిది గంటలకు తలుపుతట్టాడు. రాఘవయ్యగారు తలుపు తీశారు.

రమణను చూసి "యేమిటోయ్. యిప్పుడొచ్చావ్ ?" అన్నారు. "పాపని చూద్దామని" అంటూ లోనికి వెళ్లాడు.

"లక్ష్మణరావు వచ్చాడు. నీకోసం చాలా సేపటివరకూ చూశాడు. ఈ వేళ యింత ఆలస్యంగా వచ్చావేం ?"

"కాస్త పనిమీద యింకోవూరు వెళ్లవలసి వచ్చిందండి."

"కూర్చో వాళ్లూ సినిమానుంచి వచ్చే టయమయింది" అని మళ్లీ మంచంమీద చారబడ్డారు.

ముసలాయన యిక కబుర్లకు వుపక్రమించారు "ఏంవోయ్ చదరంగంలో నీకేమయినా తరిఫీదుందా" అన్నారు.

"యేనుగులూ, శకటాలు అనటం విన్నాగాని నేనెప్పుడూ ఆడలేదండి."

"ఇంత చాతకాని వాడవోయ్" హేళన చేశారాయన. రమణ యేమిటో ఆలోచించుకోవటంవల్ల యీ మాటలంతగా పట్టింపు చేసుకోలేదు.

"కాస్త పెద్దలు గడించింది వుంటే పంతులు ఉద్యోగం అంత సుఖం మరే వుద్యోగంలో వుండదు సుమా!"

"హా...హా...!" అన్నాడు పరధ్యానంగా.

"ఈ వూళ్లోనూ వున్నారోయ్. ఘటుకులు—కొండప్ప చిట్టాబిగించి మెత్తేశాడంటే చెరువుడి నీరు తాగాలిసిందే..."

"జెమస్రుసి నీరే..." తొందర్లో అనేసి మళ్లీ నాలిక కరుచుకొని "హా...నేను విన్నానండి" ఆగిపోయాడు.

"ఏమిటోయ్..."

ఇంతలో సినీమాకు వెళ్లినవాళ్లు తలుపు తోసుకొచ్చారు. మొదట కాలుపెట్టిన పాపను చూడగానే తలలో ఆలోచనలన్నీ భగ్గున మండిపోయాయ్. పాప రమణను చూచి లోనికి పరిగెత్తిపోతోంది. రమణ మనస్సులో గాబరాపడుతూ గడబిడగా పాప వెంటపడ్డాడు. మేడమీద గదిలోనికి పోయి చిన్న బీరువాలోంచి అల్లికబుట్ట తీసింది. చాచాను ప్రక్కను కూర్చోబెట్టి ప్రక్కను కూర్చుంది. 'ఇద్దరమే తిందాం చాచా ...పిన్నికి యివ్వొద్దు' అంటూ బుట్టలోంచి ఏపిల్ పండ్లూ, కోవాబిళ్లలూ చాచా చేతిలోపెట్తోంది.....

హృదయంలో ఆనందతరంగం ఘూగులాడుతున్నా కళ్లలో బాష్పాలు.....మనసులో 'ఏమిసంబంధం?' అనే ఒకవిధమైన జిజ్ఞాసతో రమణవున్నాడు.

అంతలో లక్ష్మణరావు మేడమీదకు రావటంతో రమణరావు గప్పున నిల్చుని చేతులు జోడిస్తూ 'నమస్కార మండి' అన్నాడు. మాటాడకుండా ఆయన ఒకసారి చేతులెత్తి బట్టలు మార్చటంలో నిమగ్నుడయిపోయాడు. 'కూర్చో— చాచా' అంది పాప బిగ్గరగా. రమణ కూర్చున్నాడేగాని తల దించుకొని ఉమ చెప్పిన లక్ష్మణరావుకూ, యీలక్ష్మణరావుకూ,

హృదయంలో యెక్కడా పోలిక దొరక్కపోవటంచేత మనసులో గింజుకొంటున్నాడు.

"అమ్మయ్యా! ఈపులివేషం వ్రాడపీ కేసరికి నాజీవితంలో విలువైన ఐదు నిమషాలు వృధాగా పోయా' యంటూ కుర్చీ మీద కూర్చొన్నాడు లక్ష్మణరావు. ఈమాటలు విని అర్థం చేసుకొనే పరిస్థితిలో లేదు రమణ.

కొద్ది నిమిషాలు యీ మౌనాన్ని యెలాగో సహించిన లక్ష్మణరావు, లేస్తూనే చాలా గంభీరంగా అన్నాడు. 'ఏమిటోయ్. మెత్తగా కనిపిస్తున్నావే... చీకటి బజారులో యెంత దోచావో చెప్పు.....మా డ్యూటీ మాది...'

రమణ విస్తుపోయి తలెత్తాడు. లక్ష్మణరావు ముఖం నిండా చిరునగవు చిందులుతొక్కుతోంది. పాపను యెత్తుకొని నిలుచున్నాడు.

"భోజనానికి నడు తమ్ముడూ.....రానంటే యిన్కంటాక్సు వేస్తాను—తప్పదు."

యీ యిన్కంటాక్సు ఆఫీసరు యెదురుగా భోంచేశానని అబద్ధం ఆడడానికి నోరు పెగిలిందికాదు. వెనకాలేనడిచాడు.

లక్ష్మణరావు, రమణ, మధ్యను పాప కూర్చున్నాది. 'యీ మగాళ్లంతా యింతే' భర్తనుద్దేశిస్తూ అంది. ఇద్దరూ ఒక్కసారి తలెత్తారు. 'నిన్న రాత్రి యెంత బలవంతంచేసినా భోంచెయ్యలేదు.....ఇప్పుడో...'

"పిలిచే విధం వుంది. చిరాకుగావున్న ఆడవాళ్ళని చూస్తే మగాళ్ళకి మరింత నవ్వొస్తుంది."

"వస్తుంది. రాదూ..." ఉమ ముఖం తిప్పుకొని కాస్త దూరంలో నిల్చుంది. తులసికూడా అక్కడే వుంది.

"పోనీ—ఆ శూర్పణఖైనా చిరాకుపడకుండా చూసిందా మిమ్మల్ని?"

"ఏ శూర్పణఖ?" అన్నాడు లక్ష్మణరావు చప్పున.

"తులసిని అడగండి...అందో లేదో...ఏం లేకపోతే వూరకనే అంటానా? కావలిస్తే రమణ సాక్ష్యం."

"ఏం తమ్ముడూ! ఎంతవరకు నిజం?"

రమణ ఆలోచనతో ఆగి, మళ్ళీ యధావిధిగా అన్నం కలుపుతూ, 'అనటం నిజం అర్థంచేసుకోవటం తప్పు. లక్ష్మణుడు శూర్పణఖ ముక్కూ చెవులూ కోసి పంపించాడుగా...!" అన్నాడు.

అందరూ ఫక్కున నవ్వేశారు. పాపయింకా నవ్వుతోంది.

"నీకేమిటే అర్థమయింది" అన్నాడు లక్ష్మణరావు పాపతో.

"బాబా మంచి మంచి కథలు చెప్తాడు నాన్నా. చెప్తాను విను నాన్నా"

"వింటూన్నానుగా...మీ చాచా మెత్తగా కనిపిస్తాడు గాని ఘట్టివాడే కదమ్మా?"

"ఓ" అంటూ తలవూపేసింది పాప. అవునన్నట్లుగా నోరు ఆవలించిన ఉమ వేపు ఎవరూ చూడలేదు.

౬

భోజనా లయ్యాక మేడమీదగదిలో కాకుండా క్రింద హాలులో రాఘవయ్యగారి దగ్గర కుర్చీలమీద కూర్చున్నారు. ఉమ వేగంగానే వచ్చి మాటలు కలిపింది. పాపకు నిద్దర కమ్మేయటంవల్ల తాతయ్య పరుపుమీద పడుకుంది.

తులసిమాత్రం యిక్కడ వాదోపవాదాల్లో మొదట కలుగజేసుకోలేదు. నోరు మెదల్చకుండా మిటుకు మిటుకుమని రమణ చూస్తున్నాడు. మొగుడూ పెళ్ళాల వాదన విననట్టి ముసలాయన మంచంమీద కంపెనీ చుట్ట వెలిగించారేమో మెదడు ఏదో యెత్తుమీద పనిచేస్తోంది.

"తెలుగు వాళ్ళగొప్ప చెప్తే మీకు మంట వస్తుంది. అలాంటి వాళ్ళకి జవాబు చెప్పగలనా? ఉండండి—తులసిని పిలుస్తాను?"

భయం అనుకున్నావా! మనలో నీలాంటి—నీ చెల్లెలి లాంటి భటాకిజు లుండబట్టి యిలా యీనాడు అధోగతి పాలైనాం! అన్నాడు, లక్ష్మణరావు. నిజానికి ఉమకు తులసిని పిలవ

టానికి మనసు పోలేదు. ముఖం చిట్లించుకొని అన్నది "మీ రెప్పుడూ యింతే."

" అదిగో ఓడిపోయావ్ " అంటూ పరిహాసించాడు లక్ష్మణరావు. ముసలాయన చుట్ట ధాటీగా కాల్తోంది, మాట వరసకైనా నోరు పెగల్చ లేదాయన. తులసి చప్పునవచ్చి తాతయ్య దగ్గరగానే కూర్చుంది.

లక్ష్మణరావు తులసివేపుచూసి నవ్వుతూ "ఏం! మీ అక్కయ్యకు సహాయం వచ్చావా ?" అన్నాడు.

"లేదు" అంది క్లుప్తంగా.

ఉమ చప్పున కలుగజేసుకొని "దానితో జాగ్రత్తగా మాట్లాడండి.

"పిరికిమందు నాదగ్గర పనిచెయ్యదు లే."

"మా నాన్నకన్న మీరెక్కువ కాదు దానికి—ముందే చెప్పటంమంచిది—ఢిల్లీలో యెవరో ఒక బెంగాలీ ఆయన అంగటి గదిలో నాన్నతో తెలుగు వాళ్ళని తిట్తూంటే యెలా విన్నదో యేమిటో గబగబ వెళ్ళి ఇంగ్లీషులో "సిగ్గులేదూ? నీ సంగతి ఆలోచించకుండా, తెలుగువాళ్ళని వాళ్ళ సంప్రదాయాల్ని విమర్శిస్తున్నావ్—నీకు మీసం లేదు—మీసం పెంచాకే ఆంధ్రదేశం వెళ్ళు. అంతా నీ కర్థమవుతుంది."

రమణి ఒక్కసారి చిరునగవు వెళ్ళబోయటం చూసి లక్ష్మణరావు సర్దుకొని "అంతేనా" అన్నాడు.

"వాడు వెళ్ళాక నాన్నమీద లేచింది...వింటూ యెలా సహించగలిగావని!"

"ఓహో! ఇంక పాతగొప్ప నేమీ చాటలేదుగా— మా రుద్రమ్మ భుజశక్తి—మల్లమ్మ పతిభక్తిని"—

"లేని గొప్పని నేనేమి చాటలేదండి" అంది తులసి తీక్షణంగా.

"నువ్వుకూడా కావ్యాలల్లి, లెక్చరుకూడా యిచ్చావన్నమాట!!" పరిహాసం చేశాడుబావ.

తులసి చటాలున "నోటిలో భాష, బుర్రలో మెదడు వున్నంతకాలం నా వాళ్ళని గురించి యెంతగా మాట్లాడినా చెల్లుతుం"దండి.

లక్ష్మణరావు పక్కన నవ్వాడు.

"నీ మాటలే చెప్పుతున్నాయ్ రుక్కు బాపతని—ఇంకా చెప్పు వీరనాయకుల గొప్పలు."

"కొరివి దెయ్యాలతో యేంమాటాడతాం! అంది ముఖం తిప్పుకొని. ముసలాయన చుట్టనోకసారి చేత్తోపట్టుకొని వాడించేటప్పుడు అసభ్యంగా మారిపోగూడదమ్మా" అన్నాడు.

తులసికోపం సిగ్గుతెచ్చుకుంది. యింతలో లక్ష్మణరావు పూరుకోలేదు. "ఆ కొరివిదెయ్యాలు—వుడుకుబోతులే

దెయ్యాల్లా యేడ్చుకోవు."

తులసి కావాలని మాట్లాడింది. "నువ్వు మనుష్యుల్ని నమ్మవు బావా? బ్రతుకులంతా చెత్తకాగితాల బుట్టల్లోకి పోవాలంటావ్. మనుషుల తప్పులనుచూపించి తిట్టావుగాని, ఒప్పుల మాటే మరచిపోతావ్."

ఈ లోంగివచ్చిన తులసిని చూడడానికి రమణ ముఖం యెత్తాడు. మళ్లీ కళ్లు నేలకప్పచెప్పి స్వవిషయం ఆలోచించుకో సాగాడు.

లక్ష్మణరావు హేళనగా చిన్న నవ్వుతో 'నాలుగు పుస్తకాలు చదివి నువ్వు మాట్లాడుతావ్. నలుగుర్ని చూసి నేను మాట్లాడుతున్నాను. గర్వించటానికి యిప్పుడు మనలో యేమీ లేదు. తీరా మన సీమలో రాజకీయాల్లైనా మన ముఖాల్ని యెత్తించలేక పోతున్నాయ్. మనలో నైతికంగా ప్రత్తేజాన్ని రేకెత్తించే కవీ లేదు, నాయకుడూ లేదు.'

ముసలాయన మెల్లగా దగ్గి కలుగచేసుకొన్నారు. 'ఒక్కటి మాత్రం మనం నేర్చాం' అని. తరువాత మాటాడ లేదు. నిశ్శబ్దం తర్వాత ఆయనే భంగపరచవలసి వచ్చింది. 'మనల్ని యెవరైనా అన్యాయం చేస్తే—మన చేతకాని తనానికి మనల్నే తిట్టుకోవటం.'

"సెభాష్" అన్నట్లుగా లక్ష్మణరావు తలవూపాడు. తులసి పండిపోయింది మనసులో. ఉమ మాత్రం వూరుకోక

'తాతయ్యా' యీ నాయకులందరికీ అందరూ కలసి వుత్తరాలు వ్రాస్తే!!" అంది.

భర్త ఫక్కున నవ్వటంతో ఉమ సిగ్గుపడింది. లక్ష్మణ రావు మళ్ళీ నవ్వుతూ నేటి రాజకీయాలంటే పిల్లి మొగ్గలని యింకా తెలుసుకోలేదూ? ఒకాయన అన్నట్లు మామూలు మనిషిని బాధపెట్టకండా రాజకీయాలు వర్ధిల్లవు. రాజకీయ నాయకులమీదే మనం పూర్తిగా ఆధారపడితే, కుక్కతోక పట్టుకొని గోదావరి యీదినట్లేలే.

'ఈ పట్నాల్లోవున్న వాళ్ళందరూ యీ విషయాల్లో ఒకే తప్పు చేస్తుంటారోయ్.' అన్నాడు ముసలాయన వెను వెంటనే.

అందరి దృష్టీ ఆయనవేపు మళ్ళింది: 'ఏ విషయమైనా దేశం మొత్తంమీద మాట్లాడేటప్పుడు యీదేశంలో కొన్ని లక్షల గ్రామాలున్నాయని—వాటిలో ప్రజలున్నారని మరచి పోతుంటారు.

ఇది లక్ష్మణరావుకు నచ్చలేదు. అన్నాడు. 'తగూలు తప్పించి మరేం వున్నాయ్ యిప్పుడు ఆ వూళ్ళలో.'

ముసలాయన యీసారి నవ్వి సావధానంగా అన్నారు. 'మా తులసిలా వుత్సాహపడే వాళ్ళని వెక్కిరించే వాళ్ళుంటా రోయ్.'

'వెక్కిరించటంవల్ల పొరపాటేమీలేదు మన తాత

ముత్తాతలు చేశారనటమే కాని—మనం యిది చెయ్యగలిగా మని బల్లగుద్ది చెప్పుకోలేంగా?'

'చెయ్యటం—చెయ్యటం అంటే, యీ రోజుల్లో యేం చేస్తామని–ఒకరికి ఆతిథ్యం యివ్వటానికే వీలులేని రోజులైతే. మన మంచి చూసుకోవటమే నాగరికతకాదు. ఉన్నదానితో తృప్తిపడి పొరుగువాడి మేలు చూడకపోతే, యీ ప్రపంచం యెప్పుడో అల్లకల్లోలం అయిపోయింది. అప్పుడు మనిషికి మనిషికి, అడవిలో పులికి—మేకకివున్న సంబంధం వుంటుంది. అప్పుడే మన పెద్దలు చెప్పిన ప్రళయంతో ప్రపంచం పతన మౌతుంది. తులసి వుత్సాహపడుతూందంటే నాయకులని, నీలాంటి వాళ్ళని చూసికాదు. ఆంధ్రుల్లో పొరుగువారిమీద వుండే ఆదరణని చూసే...యేమతంవాడవనీ—యే జాతివాడ వనీ—పొరుగున ఒకడు బాధ పడుతుంటే చూడలేరు. వూరుకోలేరు.'

లక్ష్మణరావు విడిచిపెట్టలేదు. "లలిత కళలు అవి యివి అంటూ పొగడ్తదేనికి...మనం అభివృద్ధిచేసిన లలిత కళ లేవని—"

"విజ్ఞానం హెచ్చుగా విధ్వంసానికి వుపయోగించుకొనే యీ రోజుల్లో మనిషికి భద్రతవుందని యెలా అనుకుంటాం? విజ్ఞానాన్ని జాతివికాసం కోసం వుపయోగించుకొనే పూర్వులను స్తుతించటంవల్లనైనా మనకు ఉత్సాహం వుంటుంది."

రమణ మెల్లిగా ఎంతసేపటినుంచో అడగాలనుకున్నది

అడిగాడు. "మరి మనలో వెక్కిరించి తిట్టుకొనే వాళ్లసంగతే మంటా" రని.

దీనికి తులసి చప్పున "ఇలాంటివాళ్ల గురించి నేనెప్పుడో ఒక నిర్ణయానికి వచ్చాను" అంది.

"ఏమిటో ఆ నిర్ణయం?" అన్నాడు లక్ష్మణరావు.

"వా ళ్లలాంటివా ళ్లంటావేమో బా వా! మసిలేని ముఖంలో మసివుందని — మసివున్న చేతులతో ముఖం తుడుచుకొనేవాళ్ళంటాను..."

"అమ్మయ్యో" అని గొణిగాడు రమణ.

"అంతేకాదు" తులసి స హ జ మై న హుందాతో "వీళ్ళంతా వ్యక్తిని తీసుకొని జాతిని దూషిస్తారు గాని— జాతిని తీసుకొని వ్యక్తిని క్షమించరు. అలాంటివాళ్ళకు ఫ్రాంకా పేరా."

ముసలాయన ఫక్కున నవ్వి "విన్నావోయ్ లక్ష్మణరావు! వినమ్మా ఉమా!! దీనిని చెంగల్పట్టు తీసుకవెళ్తే రోజుకొక కయ్యం తీసుక వస్తుంది!"

ఈ చివరి వాక్యానికి అందరూ నవ్వేరు కాని రమణ ముఖం పేలవమయిపోయింది. ఆ నవ్వుల్లో యెవరూ గుర్తించ లేకపోయారు.

లక్ష్మణరావు లేస్తూ "సరే! మీతులసిని, యీకాలం మధ్యతరగతి వాళ్ళలో చైతన్యం తేడానికి యే 'జోన్ ఆఫ్

ఆక్ర్ట' గానో, పీడిత ప్రజాసేవ కోసం ఫ్లారెన్సు నైటింగేల్ గానో తయారుచేసే బదులు, కబుర్లుచెప్పే కాకమ్మగా తయారుచేస్తు న్నారు! ఈ ఆంధ్రదేశంలోని కవి, గాయక, నాయక శిఖా మణులలో చేర్చేస్తున్నారు!"

తులసి నవ్వుతూ "కూర్చో బావా! వెళ్ళిపోతే నాజబా బెలా వింటావ్?" అంది.

"ఏవమ్మా, మరదలు పిల్లా నీకో నమస్కారం, ఇప్పుడు నాతో ఆ గొప్ప లేం చెప్పక ఎప్పుడైనా యీ రోజు వాళ్ళని చెప్తేవింటాను.

"ఈ రోజు వాళ్ళగురించే చెప్తాను. కూర్చో బావా?"

"తిడ్తావా పొగుడ్తావా?"

"తిట్టే అవసరం నాకేం అగపడలేదు"

"అయితే మీ దేశంలో మీలో గొప్పవాళ్ళని మీ రంతా గౌరవించిన్నాడు, మీలో యెవడైనా మంచి చెయ్యా టానికి ముందుకొచ్చేటప్పుడు విఘ్నం చెయ్యకుండా ప్రోత్సాహ పరచిన్నాడు, మీలో మేమంతా ఒకటి అనే జిజ్ఞాస మొల కెత్తిన్నాడు నన్ను ఆ చెంగల్పట్టునుంచి పిలిపించి నాయెదరగా యెంత పొగిడినా సహిస్తాను. కాని..."

తులసి కూర్చో బావా అంది నవ్వుతూ. ఉమ "యెందుకు కూర్చుంటారులే!"

"ఆడవాళ్లు అలక సాగించటానికే పుట్టారేమో!"

"సరే గానీ! ఇంతకీ నువ్వెవరవు బావా!" అంది తులసి నవ్వుతూ.

"ఎవర్ని! ఎవరిని! లక్ష్మరావుని"

"సరేగానీ లక్ష్మణరావుగారూ! ఒకటడుగుతాను. కోపం రాదు కదా?"

"ఎందుకూ! కోపం తెచ్చుకున్నవాడు కోతికంటె అథ్వాన్నం!"

"అయితే నువ్వు కోతివేనోయ్" అన్నారు చప్పున, నవ్వుతూ ముసలాయన. "ఎంచేతంటే నీలో సంస్కారం తక్కువ, కోపం ఎక్కువ."

"అంతే" అంది తులసి.

"ఏమిటీ యింతమంది సంస్కారం గురించి మాట్లాడు తున్నారు. అదేదో సెలవియ్యండి నేర్చుకుంటాను."

ముసలాయన చాలా తేలిగ్గా అన్నారు "సంస్కారం అంటే హేటూ బూటూ వేసుకోవటం కాదు. నోటికొచ్చి నట్లు వాగటంకాదు. సంస్కారం అంటే మర్యాద. తెలుగు వాడవైయుండి తెలుగువాళ్లమీద యీ కనీసపు మర్యాద లేకపోవటంవల్ల నీలో సంస్కారం లేదనే అంటాను."

"సరి! నువ్వేమంటావ్!" అన్నాడు తులసివేపు తిరిగి. "నాకేమీ అభిప్రాయము లేదు. కానీ ఒకరు అన్నారు.

ఒకరిని మెప్పించాలని ప్రయత్నించకుండా తన పని తను నిర్వర్తించటమే సంస్కారంఅని. అయితే..."

"అబ్బా!" అంది ఉమ చిరాకుగా—"ఏమిటీ సంస్కారాల గొడబ. ఒకప్రక్క కడుపుమాడి ప్రజలు చస్తుంటే యింకోప్రక్క మత్తెక్కి కొందరు కొట్టుకచస్తుంటే సంస్కారం అని పట్టుకకూర్చున్నారు. ఏ దేశంలో కలసి మెలసి అన్ని వర్గాలవారు సుఖంగా బ్రతుకుతారో ఆ దేశంలోనే సంస్కారం వుంది. లేవండి. పదకొండైంది" అంటూ లేచి వెళ్లిపోయింది.

## ౧౦

**మే** నెల యెండధాటి సాయంత్రం మూడు గంటల వరకూ తీక్షణంగానే వుంది. పడమటిదిక్కున ఒక్కసారిగా మేఘాలు అలుముకున్నాయ్. నాలుగు గంటలకల్లా కారుమబ్బులు, వీచే గాలితో సహా యిటూ అటూ ప్రయాణం చేశాయ్.

వర్షం కురిసింది. వెలిసింది. పశ్చిమాంబుధిలో కృంగిపోతున్న దినకరుని తేజస్సు మెరుపు వర్ణంతో ప్రకాశించి కొద్దినిమషాలలో వివర్ణమయింది.

ఆ సంధ్యాసమయాన తెలుగు ఫిల్ములకు చాచిపోయిన లక్ష్మణరావు భార్య, పాపతో సహా సినీమాకు వెళ్లాడు. చదరంగం తలలో తిరగటంచేత ముసలాయన వున్నట్లుండి క్లబ్ కి జారారు. తులసి ఒక్కర్తే యీ వేళ ఆ గులాబీరంగు సిల్కు

చీర, తెల్లని సిల్కు జాకెట్టు వేసుకుంది. రెండేరెండు సంపెంగ పూలు రెండు జటలకు వున్నయ్. సినిమాకు బయలుదేరాలని యీ వేషంవేసినా వసంతం రావటంవల్ల, చూసిన సినీమా ఆనే, ఆగిపోయింది.

వసంత వచ్చేపని చెప్పేముందు, తులసిని వాదనలోకి దించింది. ముక్కుపట్టి లాగినా తులసి యీ వేళ చిరాకునే వెళ్ళగక్కుతోంది కాని ఉత్సాహంగాలేదు. వసంత చప్పున "కొంపతీసి విరహతాపం కాదుకదా" అంది. తులసి మెల్లగా నవ్వగానే "అదిగో కులుకునవ్వు లొస్తున్నాయ్—ఎవరమ్మా ఆ మగాడు?" అంది.

"ఉన్నాడు—నీ కెందుకూ?"

"ఎలాంటివాడో—ఎలా ప్రేమిస్తున్నావో అని."

"నీ మగాడిని ఎలా ప్రేమిస్తావో ముందు చెప్పు?"

"ఎలా ప్రేమిస్తాం—ఉత్తరాల ద్వారా—విరహం ద్వారా దగ్గరగా చేరుకుంటాం."

తులసి పొడినవ్వు నవ్వుతూ "నీ గురించి మాట్లాడే, అందరిగురించి మాట్లాడక?"

"ఇప్పటి కాలం అందరూ అంతే—నువ్వుమాత్రం!"

"ప్రేమించే పెళ్ళి చేసుకొంటే, నే నలా చెయ్యనే."

"ఎలా చేస్తావో సెలవియ్యి....."



కథా నిలయం
545
శ్రీకాకుళం

"ఈ అవకాశం మనకు సాధారణంగా రాదు గాని— నాకు వస్తేమాత్రం ఆ మగాడు నేను ప్రేమిస్తున్నానని పెళ్ళాడే వరకూ తెలుసుకోలేడు."

"ఓహోహో! ఇవన్నీ వుత్తి కబుర్లే—వలచి వలపించుకోవటం వుండాలికాని."

తులసి పొడినవ్వు నవ్వి "నాకు కోపం తెప్పిస్తున్నావే—ఆడదాని కోమలత్వాన్ని కొలిచే మగాడిలో, పశుత్వం యే డిగ్రీలో వుందో కనిపెట్టకపోతే నీ చదువెందుకే?"

"పశుత్వం కొంచెం హెచ్చుడిగ్రీలో వుంటే—యింత ప్రేమా కాల్చుకుంటావన్నమాట"

"నేను కాల్చుకోవటమేమిటి? ఆ ప్రేమున్నదే మరి వుండదు."

వసంత ఆలోచనగా ఆగి అన్నది. "ఒక పేదవానిలో నీకు నచ్చిన యీ గుణగణాలుంటే ప్రేమించగలవా?"

"హాఁ" అంది క్లుప్తంగా తులసి.

"నేను నమ్మను..."

"నమ్ము—నమ్మకపో—డబ్బుతో ప్రపంచం వుందంటే నమ్ముతానుగాని డబ్బుతోనే ప్రేముందంటే నమ్మలేను—నిజంగా, నువ్వు ప్రేమిస్తే డబ్బును చూడవు."

వసంత ఓటమిని సహించకుండా మాటలవరుస మార్చింది. "నడు మహిళాభవనానికి" కని.

మహిళా భవనంలో ఏదో వీణావాయిద్య కాలక్షేపం వుంది. వెళ్లివద్దామని వసంత బలవంతంచేసింది, రానని నిష్కర్షగా చెప్పినా పట్టిన పట్టువిడువలేదు. ఆ బలవంతం భరించలేక తులసి చిరాకు పడింది కూడాను.

వసంత గజంపావుపొడవు వాలుజడను చేతిలోనికి తీసుకొని గిరగిర తిప్పుతూ "నువ్వెందుకే చిరాకుపడాలి. మాలాంటి వాళ్లంపడ్డామంటే అర్థముంది కాని."

తులసి ముఖం చిట్లించుకొని "నేనూ నీలాంటి మనిషినే." అంది

"నువ్వు మనిషివి కాదఃకాదు. మీ యింట్లో యే ప్లీడర్లూ—యే గుమస్తాలు వున్నారని.

"ఏం వాళ్లుంటే—"

"నే పద్తున్నా నే—పద్తున్నా—మా నాన్నకి భోజనాలదగ్గరకూడా క్లైయింటుల గొడబే! మా అన్నయ్యకు ఆ కలక్టేరిట్ గుమస్తాగిరి కాదుగాని...దిన్ అండ్ దట్ యిలాగీకి పారేశాన్, అలాగీకి పారేశాన్ అంటూ ఇంట్లో పిల్లితో సహా చెప్పకుంటాడు."

తులసికి నవ్వాగిందికాదు. నవ్వుతూ నే, "వినటం మానేయగూడదూ ?"

"నువ్విప్పుడు మహిళాభవనానికి యెందుకు రావలసి

వస్తోందో. నేనూ అందుకే విసవలసి వస్తోంది. బలవంతం— యేం చెయ్యమంటావ్..."

"సరేగాని! నేను రాలేనే — ఒంట్లో యీ వేళ ఏమీ బాగా లేదు."

"అందుకే కాబోలు యీ వేళ యిలా తయారయ్యావ్... నాకే అదోలా అనిపిస్తోంది. !!"

"మరేం! కౌగలించుకో...!"

"మొగాడి వేషమైనా వెయ్యాలంటావా ?"

ఇద్దరూ ఫక్కున నవ్వుకున్నారు. తులసి వసంత భుజం మీద చెయ్యివేసి "నాకు మా అక్కతో వెళ్లాలని లేదు."

"ప్రయాణం ఎప్పుడూ ?"

"రేపు సాయంత్రం."

"తాతయ్య బలవంతం చేస్తారనుకోను. ఆయనలా మనుష్యుల్ని నమ్మి విడిచిపెట్టేవాళ్లు చాలా తక్కువంటాను."

"నీ అభిప్రాయాల మాటకేంగానీ...!"

"అదికాదే. మా నాన్న—మా అన్నయ్య వున్నారంటే—ఒక్కర్తెనూ ఎక్కడికి బయలుదేరినా, ఒక్కర్తెనూ యింట్లో వున్నా ముప్పువచ్చిందన్నమాటే — ఛీ, ఛీ, అనిపిస్తుంది. !!"

"తాతయ్య వెళ్తున్నారు. నేనూ కదలాలి. నానుండి

తాతయ్య చాలా కాలంనుంచి అనుకుంటున్న ప్రయాణం ఆగి పోవటం మంచిది కాదు—ఏమంటావ్ ?"

"ఏమంటానుగాని—-యింతకీ యివాళ రానంటావు..."

తులసి సమాధానంగా తలూపుతూ నవ్వింది. గుమ్మం దాటి నాలుగడుగులు సాగనంపి తిరిగి వచ్చేసరికి రమణారావు ఎదురు పడ్డాడు.

తులసి నవ్వుతూ "దారితప్పి వచ్చావా" అంది. రమణారావు కొంచెం ప్రయత్నం మీద ఆమె ననుసరిస్తూనే "పని తొందరలో రాలేక పోయాను." అన్నాడు.

తులసి వెనకకు ఒకసారి చూసి "పాపం!" గుమస్తా అంటేనే యేదో మొయ్యటానికి వుండనే వుంటుంది. ప్రభుత్వం మారినా—మీ మోతకి సానుభూతిలేదు."

కోరి యిలాంటి క్రి టి సి జ మ్ తెప్పించుకొన్నందుకు రమణ శాస్త్రి తొట్రుపాటు పడ్డాడు.

"నువ్విచ్చిన పుస్తకం పూర్తి చేశాను. అంతబాగా లేదు." అంటూ వెనుకకు తిరిగి చూడకుండానే మేడ యెక్కి-పోయింది. మొదట్లో కొంచెం వెంటాడటానికి సంకోసించినా, మనసు చివరకు మేడమీదకు వెళ్ళమని ఆత్రుత పడటంచేత తలుపు చారవేసి ఆమెను అనుసరించాడు.

తులసి గదిలోనుంచి పుస్తకం తెచ్చి చేతికిచ్చి డాబా మీద పూలమొక్కల దగ్గర నిల్చొంది. రమణారావు పుస్తకం

పక్కకొని గోడకు చారబడి నిలుచున్నాడు. తులసి అలా మాట్లాడకుండానే ఆకాశంవేపు చూస్తూనే వుంది.

వాతావరణానికి తగ్గట్టుగానే వుంది—వీళ్ళిద్దరిమౌనం. రమణారావు ఆ లావణ్యవతివేపు చూస్తూనే వున్నాడు. తులసి నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ,

"అంతా సినిమాకు వెళ్లారు—పాప నీ కోసం నిన్న టున్నుంచి యేడుస్తోంది. ఒకసారి హాల్లోకి వెళ్ళకూడదూ?" అంది.

దీని కేమి సమాధానం ఒట్టుపెట్టుకున్నట్టుగా రాలేదు. వెన్నెలలో వెలిగే తులసి మోమువైపు చూస్తున్నాడు.

తులసి గొంతుక అభిమానంతో నిండిపోయింది. మెల్లగా చిన్నస్వరంతో "ఏమీ అనుకోవద్దు రమణా—నీ లోకువను బాగా వినియోగించుకున్నాను."

రమణకు కళ్లు మండుకుపోయి పెదాలు కంపించుక పోయాయి. అనుకోని మాటలు అనుకోని వాతావరణంలో యిలా దొర్లుకు పోవటంతో శరీరం కాస్త వుబ్బినట్లయింది. మాట్లాడాలని ప్రయత్నించినా పొంగే సర్వనాడులను అణచు కోవటంలోనే వున్నాడు. తులసి దేనివేపు ఆ నిముషంలో చూస్తూందో—ఆ నిముషంలో యేమి వుహిస్తుందో ఆ అంతు కనుక్కో లేకపోయాడు. వుహించనైనా లేదు. కాని ఒకటి మాత్రం నిజమనిపించింది. ఆమె తనవేపు చూడ లేదు.

తనగురించి తలచుకొంటుందో లేదో తనెలా తెలుసుకోగలడు? మళ్లీహెచ్చు ప్రయత్నంచేసి కాస్త దగ్గరగా జరిగాడు. యింకా ఆ తీపి మెరుగని ఆ మెరిపెదాలు, మిలమిలా మెరసిపోతున్న ఆముఖం—మెరిసే చిన్నబొట్టూ—మీాదుగా మెల్లగా కదిలే ఆ ముంగురులూ—ఒక పువ్వు పూసినట్లుంది.

శరీరమంతా ఒక్కసారి వణికింది. ఎదురుగా నిల్చున్న ఆ పువ్వులో యేమాత్రం కదలిక లేకపోవటంతో, ప్రయత్నం మీాద ముఖాన్ని ప్రక్కకు త్రిప్పుకొన్నాడు. గడగడ ధ్వనులు పెద్దపెట్టున శరీరమంతా విజృంభించినయ్. ఈసారి చంచలమైన కళ్ళతోనే నిట్టూర్పును బిగపెట్టి ఆమెవైపు చూశాడు. ఏదో విషయంలోనే ఆడవాళ్ళకి వుండవలసిన వెనుకంజ, సిగ్గు తులసికికూడ ఆవరించిందని ఆలోచించకపోలేదు.

ఏదో నిరుత్సాహమాటంగా చెప్పటానికి వెనుకాడుతున్న మనసులో నవ్వు ప్రజ్వలించింది.

ఆ నవ్వుతో తులసి "అలా చూస్తావేం రవణా! నేను మామూలు మనిషినే" అంది.

రవణ మాట్లాడటానికి వ్యవధి తీసుకొన్నాడు. ఈ లోగా ఆయనలో ముక్కోటి మధుర స్రవంతులు ప్రవేశించినయ్.

"కాని యీవేళ—మామూలు—మనిషిగాలేవని—"

ఈ మాటలవల్ల తులసి చూపులో ఏవిధమైన మార్పూ

రాలేదు. అక్కడనుంచి వెళ్ళి గదిలో మంచంమీద చారబడింది. కొద్ది నిమిషాలు అక్కడ నిల్చునే కిటికీ వైపు చూశాడు. వెన్నెలలో తులసి వికసించిన కలువలా వుంది.

పుస్తకాన్ని అక్కడే విడచి గదిలోనికి వెళ్ళి నిల్చున్నాడు. బహుశః ఏమనుకున్నాడో యేమో కొద్దినిమిషాలకే "వెళ్ళిపోతున్నా" అన్నాడు.

"హఁ" అంది తులసి. యిలాంటప్పుడే వచ్చే ఒక విధమైన పిరికితనం ధైర్యం రెండూ కలిపే స్వరంతో "పాపచేయేవో మాట లనిపించినందుకు యేమి అనుకోకండి" అన్నాడు.

తులసి నవ్వింది. పరుపుమీదనే ఆవులింతలు తీసి యేమీ మాట్లాడలేదు. రమణ మళ్ళీ దృష్టి ఆమెవైపు పోనిచ్చాడు. పసిడి నిగ్గులను వెదజల్లే యావనపు కాంతులు ఒక నిగూఢమైన సౌధంలో మెరవసాగినయ్—సెలయేటి ప్రవాహం ముంచుకొచ్చి గలగలా రవముతో పరుగులెత్తి తనవేపే వస్తోందని, ఒక సేద తీర్చుకోలేని మైదానం భ్రమపడుతోంది!

సిల్కుచీర గాలికి మెల్లగా కదులుతోంది. ఆమె పెదాల్లో ఒక విధమైన గగుర్పాట్లు గోచరించాయ్. మొహంలో లావణ్యంతో పాటు ఎన్నడూ వ్రూహించని అంతం అగపడింది.

యిదివరకు డాబామీద ఎందుకు అంతసేపు నిలు

చుండో, ఆపని చెయ్యటానికి తులసి లేచింది. తలుపు గడియ వేసి వచ్చి యేదో పుస్తకంతో కాలక్షేపం చెయ్యాలనుకొంది.

జారిపోతున్న పమిటి సర్దుకొనే సమయంలో మోహాంతో వుబ్బి తబ్బిబ్బయిన రమణ యెదురుగా వున్న తియ్యని తులసిని బాహువుల్లో బంధించాడు.

పువ్వు నలిగిపోయినా...పొగమంచు చెదిరిపోయింది. వెన్నెల్లో పువ్వు ధగధగ మెరిసింది...

నేరస్థునిలా నిలుచున్నాడు రమణారావు. తులసి ముఖం ఆ వేళ కుంగిన సూర్యుని జ్ఞప్తికి తెస్తుంది. మాట్లాడటానికి శక్తి వచ్చేసరికి యీ వేళ తను మామూలు మనిషి కానని జ్ఞప్తికి వచ్చింది.

"అలా తలదించుకొనే వెళ్ళిపో బూచి! మళ్ళీ యీ యింట్లో కాలుపెట్టకు..." గుమ్మంవేపు చేయి చూపిస్తూ అంది.

రమణ తలదించుకొని వెళ్ళిపోయాడు.

⁂

"దారితప్పి వచ్చావా రమణా!" ఉమ భర్త వెనకాలే వచ్చే రమణారావును ప్రశ్నించింది. రమణ గతుక్కుమన్నాడు.

లక్ష్మణరావు నవ్వుతూ "ఏమిటా ప్రశ్న?" అన్నాడు.

"రెండురోజులైతె కనపడందే!"

"నే నిదివరకే చెప్పేనుగా, మాతమ్ముడు మెత్తగా వుంటాడేగాని గట్టివాడని..."

ఉమ మెల్లగా నవ్వింది. రమణారావు తలవంచుకొని నిల్చున్నాడు.

"సాయంత్రం ప్రయాణం పెట్టుకొని పండ్రెండు వరకూ వీధిలో ఏం చేస్తున్నార"ంది భర్త వేపు తిరిగి.

"ఏం చేశాను? దొంగను పట్టి తెచ్చానుగా...ఈ వేళ మా తమ్ముడు పెళ్లికూతురిలా...అబ్బా!! రాటానికి ఎంత మురిపించా డంటావ్ ?"

"పెళ్లికూతు రెందుకనాలి ? పెళ్లికొడుకు సిగ్గు పడడా యేం ?"

"జ్ఞాపకం తెచ్చుకో—ఆ రోజున ఎవరు సిగ్గు పడ్డారో ?"—ఉమ వెక్కిరించింది.

రమణారావు ముఖం బాగా క్రిందికి వంగిపోయింది. సంశయంతో మనస్సంతా కొట్టుకపోవటం మూలాన పాప యేడుపు నిద్రలో యేదో వింటున్నట్లుందతనికి. లక్ష్మణరావు "రా తమ్ముడూ" అంటూ మేడమెట్లవైపు పోయాడు.

ఉమ యీ పరిస్థితిని గ్రహించిందేమో దగ్గరగా వచ్చి "ఏం రమణా! అదోలా వున్నావ్ !"

"ఏమీ లేదు" సద్దుకొని ముఖం త్రిప్పాడు.

"పాప ఒకటే ఏడుపు. ఏం మంత్రం వేశావో కాని...
చెంగల్పట్టు మాతో రాకూడదూ ?"

ఈ ఆహ్వానం రమణరావులో ఒక్కసారిగా ధైర్యాన్ని చొప్పించింది. "రాకేం—వస్తా శెలవుచూసుకొని." వుమ నవ్వి "నా ముఖం చూసి చెప్పారివణా" అంది వుత్సాహంగా.

రమణరావు వెలుగులేసి నవ్వునవ్వి తలెత్తి వుమవేపు చూసి "తప్పకుండా వస్తాను" అన్నాడు.

ఇంతలో పాప పరుగెత్తి 'చాచా' అంటూ కేకలు వేసుకొని వచ్చింది. ఇద్దరూ యే జన్మలోనో పూర్తికాని అనుభూతిని అనుభవిస్తున్నట్టున్నారు. రమణ కంటిరెప్పలు చెమ్మగిల్లాయ్. మాటాడటానికి పెదిమల గగుర్పాటుతో శక్తి లేకుండా పోయింది. ముసలాయన అప్పుడేవస్తూ 'యేంవోయ్! యెక్కడా అగపడలేదే."

ఈ యింటిలో తను భయపడే విషయం తెలియనట్లే సంచరిస్తున్న వాళ్ళందరినీ చూశాక సరిగా నిల్చోగలిగాడు. ఈ సారి మాట్లాడటానికి ఆయనలో పట్టుదలా ఉత్సాహం, రేకెత్తాయ్. లక్ష్మణరావు అన్నట్లు మనిషి వాగినంతమాత్రాన వానిలో యేదో గొప్ప వుందని కాని, వాగనంతమాత్రాన వానిలో గొప్పలేదనీ మాత్రం అనలేం. కానీ మాటాడవలసినప్పుడు మౌనం దాలిస్తే, లోకువకూ అనుమానాలకు తావిస్తుందని అన్నాడు.

"ఆఫీసుపని తొందరలో రాలేదు."

"ఆ పట్టుదల మనిషిలో వుంటే మంచిది. మనం జీవితానికి పని చెయ్యకూడదోయ్. ఈ రోజుల్లో కష్టపడే వాళ్ళకి అన్యాయాలు జరుగుతున్నాయని అనుకొని మనం వాళ్ళలో కూడితే, మనిషి అంతరాత్మ ఉన్నవాడు కాబట్టి ఎప్పుడో ఒకనాడు మానసికంగానైనా శిక్ష అనుభవిస్తాడు.

రమణ బదులు చెప్పలేదు. కాని లోలోన గర్వపడ్డాడు. మీదకిపోయిన ఉమ కేక వేసింది.

పాపనెత్తుకుని తలదించి మెట్లు ఎక్కుతూంటే పాప చటాలున

"బూచీ పిన్ని అదిగో చాచా" అంది. రమణతల సిగ్గుతో బరువెక్కింది. కాళ్ళు కదపలేకపోయాడు.

"పిన్ని! అన్నీ అబద్ధాలే—బూచీ, బూచీ అటా..."

ఈ, అటా, లానే తన మనస్సు అసంపూర్ణమైన ఆలోచనలతో నిండిపోయింది.

"చాచా, బూచీ పాపాయిల్ని పెద్దవాళ్ళని బిస్కట్లలా నమిలేస్తాడు గదూ ?."

దీనికి జబాబులేదు, "చెప్పు చాచా!" అంటూ ముఖంలో ముఖంపెట్టి పీకగట్టిగా మెలివేసింది.

"ఏం తమ్ముడూ అక్కడ నిల్చున్నావ్ ? యిాదికిరా" తలెత్తాడు. తోవలో తులసి లేదు. మేడమీాదికి వెళ్ళాడు. ఉమ, తులసి ఒక సోఫాలో కూర్చున్నారు. లక్ష్మణరావు గదిలో యిటూ అటూ పచారుచేస్తూ, తులసి ప్రక్కనేవున్న కుర్చీ చూపించాడు రమణారావుకు. రమణ సందేహిస్తుంటే పాప దిగి తన చిన్న కేముకుర్చీ, ఆ కుర్చీ దగ్గరగా లాక్కుని కూర్చుంది. ఆ కుర్చీమీాద కూర్చోవటం తప్పించి గత్యంతరం లేక కూర్చున్నాడు.

ఉమ రమణను ఉద్దేశిస్తూ "ఆ దోలా వున్నావేం" అంది. ఈ ప్రశ్నకు సమాధానమిచ్చే బాధ్యత తనదన్నట్లుగా, లక్ష్మణరావు కలుగచేసుకుని "నే చెప్తాను, నువ్వు ఒక విష యం వప్పుకుంటే"

"మీారేం చెప్పక్ఖర్లేదు" అంది ఉమ.

"అయితే నువ్వు అసలు సంగతి తెలుసుకోలేవు. నీకే నిజం వినాలనుంటే, ఆడవాళ్ళుకూడా తప్పులు చేస్తారని ఒప్పుకో,"

తనని కొన్ని రోజులనుంచి ఆవరించిన అనుమానం ఎలాగో తొలగిపోతుందని వుత్సాహంగా "వొప్పుకుంటాను, చెప్పండి" అంది వుమ.

ఆ వేళను తులసి రమణవేపు కళ్లువిప్పిచూడటం అదే తొలిసారి.

లక్ష్మణరావు అటూయిటూ పచారుచేస్తూ మొద లెట్టాడు. "యిది ఒక ఆడదాని ప్రేమకు సంబంధించిన విష యం! యిలాంటివి జ్ఞాపకంవస్తే చాలా బాధగావుంటుంది ఎంచేతంటే నాకు తెలుసు. వుమ లేనప్పుడు నేనెంతగా బాధ పడ్డానో, వుమ వున్నప్పుడూ అంతగానే బాధపడ్డాడు. ప్రేమను వర్ణించేవాడు వాఖ్యానించేవాడు వుత్తి వెర్రివాడు. ఈ సంసా రం అనేది ఒకసాగరం. ఆ గగ్గోలు సర్వకాలాలలోను యేదో ఒక స్థాయిలో వుంటూనే వుంటుంది. అది కోయిల అరుపని తృప్తిపడటంగాని, గార్దభస్వరమన చిరాకు పడటం కాని మనలో వుంది..."

మెల్లగా "ఏం అక్కా తలపట్టుకున్నావ్" అంది తులసి—అప్రయత్నంగా. రమణరావు వుమవేపు చూడబోయి తులసివేపు చూశాడు. ఎవరిదృష్టీ తనవేపు లేకపోవటంతో "ఈ కాలంలో నిజంచెప్తే, అందరకూ కోపమూ, తలనొప్పీ! భావకవిలా హిమవత్ శిఖరాన్ని, వేదాంతిలా సముద్రపులో తుల్ని, చేసేవాడే, ఈ కాలంలో అసలైన ప్రేమికుడౌతు న్నాడు. నాలా భూమిని చూసి బ్రతికి పనిచేసి మాటాడేవాడి పెళ్ళానికి తలనొప్పి రాదూ?"

ఉమ బలవంతాన నవ్వుని ఆపుకొని చెయ్యి అక్కడ నుంచి తీసి వేసింది.

"ఆకలౌతూంది వడ్డిస్తారా?" అంటూ రమణదగ్గరగా వచ్చి, చెవులో యేదో చెప్తూన్న పాప దగ్గరగా వంగి వింటున్నాడు.

రమణ అంతావిని ఫక్కున నవ్వి పాపను ఎత్తుకొని చిల్చుండి పోయాడు.

"ఏం చెప్పింది రమణా" అంది ఉమ.

"వాళ్ళనాన్న నాలా కథలు చెప్పలేడట"

"డబ్బాలా డబడబ వాగమంటే — కోతలు కోస్తూ......ఊఁ."

"ఎవరూ చెవులు మూసుకోరేం ?..." ఆగి, "నాకూ వచ్చు కథలూ"......

పాప చప్పున "చాచా మంచి కథలు చెప్తాడు నాన్నా...నివ్వూ విను నాన్నా"

లక్ష్మణరావు నవ్వి "ఈ వేదాంతి వెఱ్ఱిలోపడిపోయావే! చిన్నాన్నని పిలవనే పిలుస్తున్నావ్‌గా! యిక్కడుండిపో!!"

తులసి ఆ తోవనే వెళిపోతూంటే...చిన్న కొంటె చూపు పారేసి "ఆ...ఆ...లే తమ్ముడూ భోజనానికి....."

ముసలాయన ఈ వేళ చాలా వుత్సాహంగా వున్నారేమో భోజనం దగ్గర చాలా విషయాలు చెప్పుకుపోతున్నారు. మంచి చదరంగం పెట్టుకొన్నారు. రమణను నేర్చుకోమని బలవంతం చేస్తున్నారు. లక్ష్మణరావు మామూలు ధోరణిలోనే "మనిషికి ఈ నిత్య జీవితంలో కష్టాలు కొంతసేపు మరచిపోవాలంటే ఏదో ఒక వ్యసనం వుండాలి. తాగే వాళ్ళం కాం. చీట్లాటదాసులం కాం, మరి యిదైనా..."

వృమ అడ్డొచ్చి "పుస్తకాలు చదవటం!"...మున లాయన కలుగచేసుకొని "చదరంగం ఒక వ్యసనం అంటా వోయ్" అన్నారు.

లక్ష్మణరావు నవ్వాడు సమాధానంగా. మాటలు మార్చి వృమనుద్దేశించి "తులసేదీ!......ఆ ప్రశ్న మీా చెల్లెలకు వేస్తే ?"

"అదేమో నిన్నటినుంచి అదోలావుంది,"

భార్య మాటలకు "ఏం కోపం వచ్చిందా ?"

"వస్తే మరెవరిమీాద వస్తుంది ... మీా మీా దే రావాలి......"

"అంతకంటె, యింకేం భాగ్యం కావాలి? ఆడవాళ్ళు పైకి కోపంగావుంటే, లోన అభిమానంగా వున్నారన్నమాట!"

రమణ చిన్న నవ్వు నవ్వి లక్ష్మణరావు ముఖంవేపు చూశాడు. "ఏం తమ్ముడూ అంతేనా ?"

రమణ ముఖం చిరునవ్వుతో వెలిగింది.

"సాక్ష్యానికి మంచి తమ్ముణ్నే సంపాదించారు."

వృమ కోపంగా మూతి ముడుచుకొని రమణ దగ్గరగా వచ్చి "మజ్జిగ పోసేదా రవణా!" అంది. కావాలన్నట్లు తల వూపాడు. మజ్జిగ పోస్తూండగా లక్ష్మణరావు అన్నాడు. "ఏది సత్యం...ఏది నిత్యం!...ఏదో ఆనందంగా గడపటాని

కని యీ భూమి మీద మనుష్య రూపాలతో వాలిలాం. ఈ చిన్న కాలంలో, కాంక్షలతోనూ, కష్టాలతోనూ, నష్టాలతోనూ, మూతి విరుపులతోనూ, మన ఆనందాన్ని మన చేతులతోనే ఖూనీ చేసుకోవటం...!"

వుమ తీక్షణంగా చూసింది భర్త వేపు—యీ హాస్యాలకు వేళాపాళా లేదన్నట్లుగా...రమణ నవ్వకుండా వుండలేక పోయాడు. ముసలాయన మెల్లగా జారిపోయారు.

"తమ్ముడూ—మొగాళ్లు మొగుళ్లేనోయ్ ... అసలు విషయం చెప్పకుండా ఏడిపిస్తున్నాం...చూశావా."

వుమ చిరాకుగా "తులసీ" అని కేక వేసింది. మళ్ళీ మళ్ళీ కేక వేయగా "హా" అనే పలుకు వినబడింది.

"యిలా రా" అని మళ్ళీ కేక వేసింది.

తులసి వచ్చి తలవంచుకొని నిలుచుంది. భార్యను మాటాడటానికి అవకాశం యివ్వకుండానే—"ఏవమ్మా! మరదలు పిల్లా!! కాస్త మజ్జిగ పోస్తావామ్మా! మీ అక్కగారికి కోపంవచ్చింది...!!"

తులసి మాట్లాడలేదు—వుమ జలపాతం పడేటట్లు మజ్జిగపోసింది. అన్నం కలుపుతూ "మీకు నామీద కోపం వచ్చినట్లు, మీ అక్కగారు సెలవిస్తున్నారు. మనం మామూలు మనుష్యులం — తెలిసో తెలియకో తప్పులు

చేస్తూంటాం ... నువ్వూ మామూలు మనిషివే... నీ జీవిత కాలంలో నీకు తెలియకుండానే ఉద్రేకంలోనో, అజ్ఞానంతోనో. తప్పుచేస్తావ్ ... క్షమించమనటానికి పిలిపించాను..." తన ఉద్దేశాన్ని బహిర్గతంచేసే యీ మనిషివైపు రమణ చూసి. పెద్ద నిట్టూర్పు విడిచాడు.

ఉమ వెక్కిరిస్తూ "ఇకవూరుకోండి" తులసివేపుతిరిగి... 'చూడే పెద్ద లెక్చర్లు కొట్టున్నారు ... నేనేమైనా అంటే నవ్వేస్తారు".

తులసి మాట్లాడకుండానే వచ్చినతోవను వెళ్ళిపోతూ వుంటే వుమ నోరు ఆవులించి చూసింది. లక్ష్మణరావు పకపక నవ్వి..."ఆడవాళ్ళ కోపాన్ని పట్టించుకోనేవాడు - మగవాడే కాడంటాను ... ఏం తమ్ముడూ అంతేనా?" రమణరావుకు నవ్వాలో యేడవాలో యేం చెయ్యాలో తెలియక బేజా రెత్తిపోయాడు.

౧౨

**ము**సలాయన భోజనం అయ్యాక మేడమీదకు వెళ్ళి పోతూన్న లక్ష్మణరావును పిల్చాడు. రమణకూడా ఆయనను అనుసరించాడు.

"ఆడగలను కానీ, నాకీరకం చదరంగంమీద అట్టే నమ్మకంలేదండీ...ఇది యీ శతాబ్దానిది కాదన్నాడు." లక్ష్మ ణరావు టేబులుమీద వున్నవాటిని చూసి.

ముసలాయన ముఖమెత్తి "నీ వుద్దేశం?" అన్నారు.

"ఆటంబాంబులు, హైడ్రోజన్ బాంబులు, మార్షల్సు ఫీల్డు మార్షల్సు రాజకీయ నాయకులు, మధ్యను చచ్చే అమాయకపు ప్రజలు వుండాలి, యీ శతాబ్దపు చదరంగంలో."

"బాగానేవుంది—పోనీ రెండాటలాడతావా?"

"రాతమ్ముడూ" యెదురుగా కూర్చోబెట్టి రెండాట్ల వరకూ అక్కడ వున్నాడు. రమణారావు కొంచెం తర్ఫీదున్న వాడిమల్లే రెండు ఎత్తులు వెయ్యటంతో, మేడమీదకు వెళ్ళాడు.

పాప ప్రక్కనే నిల్చుని ప్రశ్నలవర్షం కురిపిస్తోంది "గుర్రింమీద కూర్చోరేం చాచా?".

"కూర్చుంటారు."

చాచా దగ్గర, జవాబులు ఒకంతట రాకపోవటం చూసి మేడమీదకు వెళ్ళింది. నాన్న నిద్రపోతున్నారు. బూచీ పిన్ని ఒక్కర్తే కూర్చుంది. అమ్మకూడా నిద్రపోతోంది. అక్కడ వుండటానికి మనస్కరించక మళ్ళీ క్రిందికువచ్చి "చాచా" అంటూ బలవంతం చేస్తోంది. గడియారం మూడుకొట్టింది. లేవాలనుకుంటే ముసలాయన యింకో ఆటతో యెత్తేద్దామన్నారు; ఐదునిమిషాల్లో ఆటకట్టు. ముసలాయన పకపక నవ్వి "కొత్తవాడిలా ఆడలేదోయ్...వారం రోజులు ఆడావంటే యెవరాలైనా కట్టేసావన్న మాట!"

ఇంత పొగడ్తకు తగకపోయినా, ముసలాయన యేదో స్వల్పలాభంతో పై కెత్తుతున్నారని గ్రహించక పోలేదు.

లేవాలనుకుంటే వసంత వచ్చింది. ముసలాయన ఆమెను మేడమీదకు వెళ్లమన్నారు. ఆమె వెనకాల రమణారావును లాక్కెళ్లింది పాప. లక్ష్మణరావు అప్పుడే మేల్కొన్నాడేమో, వసంతవైపు నిదానించి చూస్తూన్నాడు. వసంత తులసిని వాద నలోనికి దింపటానికి ప్రయత్నిస్తోంది.

లక్ష్మణరావు ఉమ లేచాక నవ్వుతూ, "తమ్ముడూ! అలా నిల్చుండిపోయావేం—కూర్చో" అంటూ తులసిదగ్గ రగా వెళ్లాడు. వసంత లేచి నిల్చుంది. ఉమ దగ్గరగా వచ్చి "యీయనే..." అంది. పూర్తిగా చెప్పమన్నాడు లక్ష్మణ రావు. వసంత నమస్కారమండి అంది. లక్ష్మణరావు ప్రతి నమస్కారం చేస్తూ నవ్వి—

"కవులు వర్ణించినతీరు వేరు-నేనే మిమ్మల్ని వర్ణిస్తే మీతలనుండి పాదాలవరకూ వర్ణించను. ఎంచేతంటే నా ఫ్రెండ్సు అంతా సరసులు—అందకత్తెలను చూసేవాళ్లూనూ"

"మాటలు కట్టిపెట్టండంది" కోపంగా ఉమ.

"ఆ అమ్మాయికి లేనికోపం—మధ్యను నీకెందుకు"— అంటూ అటు తిరిగి "మీజడను వర్ణిస్తానండి...ఎంత కష్ట పడ్డారో—ఆ గజం పావు జడకోసం—మా ఆవిడ రీటా వగైరా సెంటెడ్ ఆయిల్స్ వదిలే సుముహూర్తం మీవలె నైనా దగ్గర పడుతుందని ఆశ..."

వసంత ఉమ పొట్టి జడవైపు చూసి సగర్వంగా నవ్వింది.

ఎదురుగా, మరిచిపోలేని లేత వెలుగుతో దీప్తమైన రమణాముఖం చప్పున చూసి, ప్రయత్నించి ముఖం యింకో వైపు తిప్పుకుంది.

లక్ష్మణరావు తన మామూలు ధోరణిలో పడగానే వుమకు భరించలేనంత కోపం వచ్చింది. ఐదు నిముషాల పరిచయంతో ఆ అమ్మాయిని వెక్కిరించటంతో ఉమ గట్టిగానే గొణుక్కుంది.

లక్ష్మణరావు ఇటూ అటూ తిరుగుతూ "స్వర్గసౌఖ్యం నరకంలోకెళ్తేగాని తెలుసుకోలేం. ప్రేమకు ఎడబాటు లేకపోతే దానికి విలువలేదు. అలాగే మీవారు మౌనముద్రాంకితులైతే అప్పుడు విచారిస్తావు—ఏమిటి యిలాంటి మూగ మొగుడు దొరికాడని...అప్పుడు నేను వరమీయని వేల్పునై పోతాను సుమా!"...

ఇంట్లో వున్నవాళ్ళంతా వుమవేపు చూసి నవ్వారు. పాపకూడా నవ్వింది. "నీకేమిటే తెలిసింది" అన్నాడు లక్ష్మణరావు.

"చాచా గట్టిగా నవ్వుతాడు నాన్నా"...

లక్ష్మణరావు ఫక్కుమని "తమ్ముడూ! భలే భట్రాజుని సంపాదించావోయ్!!" అంటూ కూతుర్నెత్తుకొని "అవునమ్మా మీచాచా నవ్వితే నవరత్నాలు రాల్తాయ్...సిగ్గుపడితే ఆడ

వాళ్లకు అభిమానం పుట్టుకొస్తుంది. చాలా మంచివాడమ్మా మీ చాచా!"

పాప మళ్లీ నవ్వింది. సాయంత్రం నాలుగ్గంటలైంది. వసంత వెళ్లిపోయింది. స్టేషనుకు బయలుదేరారు.

వాల్తేరు ప్లాటుఫారం—రమణ పాపనెత్తుకొని సెకెండ్ క్లాసు కంపార్టుమెంటు యెదురుగా నిల్చున్నాడు. ఉమ, లక్ష్మణరావు, ముసలాయన యేదో మాట్లాడుకొంటున్నారు. తులసి పెట్టెలో కూర్చుని రెండో వైపు ముఖం తిప్పింది.

పాప అప్పుడప్పుడు యేదో సందేహం తీర్చుకోటానికి "చాచా" అని పిలుస్తూ పైకుబికి రాబోతున్న కన్నీటికి అడ్డొస్తుంది. అక్కడే ఒకనాడు చిలుకలాపలికి కన్నీరు తెప్పించింది. యీవేళ అక్కడే చాచా, చాచా, అంటూ తియ్యగా పలికి కళ్లల్లో నీరు వుబికిస్తూంది.

పాప ముఖంవైపు చూస్తాడు. ఒళ్లంతా గగుర్పాటు జెందటంతో మళ్లీ ప్లాటుఫారం, అగపడుతుంది. పాప యేదో ప్రశ్న వేస్తుంది. జవాబు చెప్పటానికి ధైర్యం తెచ్చుకోక విధి లేదు.

"అయితే యమునా నవ్వాడా చాచా, ?"

"అవునమ్మా...నవ్వే పాపలను చూసి నవ్వుతాడు"

నేనెప్పుడూ నవ్వుతాను చాచా" అంటూ కిల కిల నవ్వుతుంటే గుండె మరింత బరువెక్కిపోయేది.

"సింహం జడిసిపోయింది కదూ..."

"అవునమ్మా — శాతవాహనుడూ - నీలాంటి చిన్న పాపాయే కదూ! ఆపాపాయికి భయమేలేదు"

"సింహం చూపించవు చాచా"

"ఇప్పుడు నిన్ను చూసి సింహం యేడుస్తుందమ్మా"

"సింహం యేడుస్తుందా ?"

మొదటి అంతపెద్ద సమాధానం గద్గదస్వరంతో ఎలాగో యివ్వగలిగినవాడు, గుండె గట్టిగా పట్టుకున్నాడు. పేపర్లబ్బాయి కేకలువేస్తున్నాడు. 'చా' అంటూ ఒక కుర్రవాడు అరుస్తున్నాడు. పాప 'చాచా' అంది. ఆకుర్రవాడు ఎదురుగా నిల్చొని యెన్నికప్పులుబాబూ అన్నాడు. అక్కర్లేదని సైగ చేసి "అవునమ్మా—సింహానికీ మనలాంటి ప్రాణమే...అది కూడా ఏడుస్తుంది."

"ఏడ్చే - సింహాలు మంచివే కావు..."

పెదిమలమీద నవ్వూ యేడుపూ ఢీకొన్నాయ్. ఉమ రైలెక్కుతూ—"దసరాకు వస్తావు కదూ" అంది. పాప ముఖం వేపు చూస్తూ నిలబడిపోయాడు కాని జబాబీయ లేకపోయాడు. లక్ష్మణరావు ఉమపక్కనే కూర్చుని "వీలు చూసుకొని ఒకసారి రా తమ్ముడూ" అన్నాడు. రావోయ్ బండి కదిలేవరకూ కూర్చో అన్నారు ముసలాయన. "చాచా రైలెక్కుదామా" అంది పాప.

ఉమకు దగ్గరగానే కూర్చున్నాడు. రైలువూల వేసినా కదలాలనిలేదు. లేచాడు. లక్ష్మణరావు పాపను గట్టిగా పట్టుకొన్నాడు. రమణ రైలుదిగి అందరికీ నమస్కారం పెట్టాడు. చాచా అని గోలపెడ్తూన్న పాపను పట్టుకొనే, మీ చెల్లెల్ని నమస్కారం అందుకోమను అన్నాడు. తులసి ముఖం త్రిప్ప లేదు, లక్ష్మణరావు నవ్వి "నమస్కారం అందుకొనే సంస్కారమైనా మీ చెల్లిలో లేదు" అన్నాడు. తన హృదయంలో దొర్లుతూన్న మాటలెలా అందుకో గలిగాడని రమణ విభ్రాంతి చెందుతుంటే రైలు కదిలింది. పాప కేకలు హెచ్చాయి— నీరు నిలిచిన కళ్లతో పెట్టెవైపు చూశాడు. ఉమ కళ్లు తడిసి పోయి వున్నయ్.

౧౩

లక్ష్మణరావు సిగరెట్ మీద సిగరెట్టు ముట్టించి చీకటిలో మునిగే ప్రకృతివేపు చూస్తున్నాడు. చీకటిని చీల్చుకుంటూ రైలు పోతూంది. పాపయేడ్చి యేడ్చి నిద్రపోయింది. ముసలాయన చదరంగం సెట్టుతీసి, తులసిని బలవంతంచేశారు. లక్ష్మణరావు కాస్సేపు ఆడాడు. తులసికూడా వుమలా పరుపు మీద చారబడింది.

వాచీకి కీ యివ్వటానికి లక్ష్మణరావు తీసేసరికే సరిగా రైలు ఆగింది. పది నిముషాలు తక్కువ తొమ్మిదైంది. ముసలాయన. తులసి నిద్రలో వున్నట్టున్నారు, ఉమచప్పున లేచి కూర్చుంది. ఆమె నిద్రపోలేకపోతూంది. ఆ కంపార్టుమెంటులో

పై వారింకెవరూ లేరు. కీ యిచ్చాక లక్ష్మణరావు అడిగాడు "పడుకోరాదూ" అని. ఉమ జవాబు చెప్పలేదు. పాప పలవరింపులు యిద్దరూ విన్నారు. "చాచామేడ్చే సింహాలు - మంచివే కావు." ఉమ వూపిరి పైకి పీల్చి పెదాలుబిగపట్టింది

లక్ష్మణరావన్నాడు "రవణని ఎప్పుడైనా తిట్టావా" అని.

"హా" అంది వుమ

"బహుశ : చెప్పడు మాటలు వినుంటావ్ ! ఆ బరంపురం నించి వచ్చిన ముసలాయన చెప్పుంటారనుకొంటాను."

"అవును. వాళ్ల పెదనాన్న చెప్పినమాటనమ్మలేమా?"

"నమ్మి యేమన్నావ్?"

"మెత్తగా వున్నవాళ్లు గొంతుకలు కోస్తారన్నాను"

"ఆలోచించకండా అనుంటావ్, మాటలంటే పడే సహానం రవణకు వుందని! బహుశః నీకు ఆడవాళ్ల శీలం యందువుండే గౌరవంబట్టి తొందరపడి వుంటావ్!"

ఉమ మాటాడలేదు. తరువాత యింకేమి అనుకోకు రవణా అని చెప్పానని కూడా చెప్పలేక పోయింది.

లక్ష్మణరావు సిగరెట్టు ముట్టించి అన్నాడు. "ఆముసలాయన దూరపుబంధువు. వరసకు పెదనాన్న, యేమైనా రవణ నేం స్త్రీగొంతుకా కొయ్యలేదు."

"ఆహా" అంది వుమ.

"సవతితల్లి చాకిరీ చెయ్యించి, యీ మెత్తదనం అలవరిచినా, రవణలో చెప్పుకో తగ్గ గుణాలు వున్నాయి."

ఉమ భర్తవైపు మొఖం ఎత్తి చూసింది.

"భర్త అమాయకుడు, సినీమాల్లోని. శృంగారపు నవలల్లోని, కథానాయకుడిలాంటివాడు కాడు. నలుగురి కష్టాలు వింటాడు. తనకష్టాలు నలుగురితోను చెప్పుకుంటాడు, భార్యకు కావలసింది కథానాయకుడు. ఆమెకు పొరుగున వున్న రమణ అగపడ్డాడు. ఆమెగురించి చెపుతూ రమణ అన్నాడు. "ఈ కాలంలో ఏకపత్నీ వ్రతులగురించి చెప్పుకోవటం, వాళ్లు త్రోవలో నడుచుకోవటం హాస్యాస్పదంగా వుంటుంది. కానీ నాకు బుద్ధివచ్చిన దగ్గరనుంచి ఆపట్టుదల మాత్రంవుంది." ఉమా నేనెందుకు రమణను హర్షిస్తానంటే మనిషిలో ఆ మాత్రం ఆత్మపరిశోధన వుండాలి. ఆదర్శాల వెనుక నూటికి నూరుపాళ్లూ పనులు నెరవేరవు. ఆ పొరుగావిడ కౌగిలించుకుందంటే యెంత బాధపడిందో వూహించక్కర్లేదు. ఆ తొందరపాటుతో ఆమెభర్తకంట బడింది. రమణ, భర్త యిద్దరూ తూలనాడారామెను. నిందమాత్రం రమణమీద పడింది. తండ్రి తలెత్తలేక యింటినుంచి పొమ్మన్నాడు...

రైలు కదలటంవల్ల లక్ష్మణరావు భార్య చెవి దగ్గర నోరుపెట్టి మిగతా విషయం చెప్పాడు. ఇద్దరూ చాల రాత్రి వరకు మాట్లాడి నిద్రపోయారు.

లక్ష్మణరావు నిద్రనుంచి మేల్కొనే సరికి తెల తెల వారుతోంది. తులసి అప్పటికే కూర్చుని తూర్పున ప్రకృతి పరుగును తిలకిస్తోంది. తలత్రిప్పి లక్ష్మణరావు మేల్కొనటం గమనించి చిన్న నవ్వును పెదాలమీదికి ప్రాకించింది. రైలు విజయవాడ స్టేషనులో ఆగటంతో లక్ష్మణరావు సిగరెట్టు పీకను పారేసి.

"ఏవమ్మా? ఏం కలగన్నా వేంటి?"

"నేను చెప్పనంది" తులసి.

"నాకు తెలుసు! నవ్వుతున్నావుగా, తియ్యని కలే!! వద్దమ్మా తియ్యని కలలు కన్నవారి కలలు కలలుగానే వుండి పోతాయి!"

"చాల్లెండి!" నేను మేల్కొనే వున్నానని చెప్పటానికి బదులు వుమ యీ మాటలు రాల్చింది.

"స్వానుభవంతో చెప్తున్నా! ఒకానొకప్పుడు విమానంమీద విహరించాను, అందమైన పెళ్లాంతో! కానీ యేమైంది?"

ఉమ వెక్కిరించి ముఖం త్రిప్పింది.. తులసి ఫక్కున నవ్వి "నువ్వు దొంగవు బావా! అక్కని మా యెదురుగానే ఆడిస్తావ్! అంతే."

"ఏకాంతంగా భార్యని ఆడించే వాళ్లెవరైనా వున్నారా? వచ్చే తమ్ముడు ఎక్కడున్నాడో గానీ...బహుశః నీలా కలలు కనేవాడు కాడని నా విశ్వాసం!"

"నీ విశ్వాసం మాట కేంగానీ — ఏమోయ్! కాస్త కాఫీ, గీఫీ మాట ఆలోచించావా?" ముసలాయన అందుకోవటంతో లక్ష్మణరావు లేచి నిల్చున్నాడు.

## ౧౪

రమణరావు దిగజారిన మనస్సులో వుత్సాహం ఒక్కసారిగా తొణికిసలాడింది. లక్ష్మణరావు వ్రాసిన వుత్తరం ఆయన మాట్లాడినట్లేవుంది. పాప విషయమై ప్రస్తావన తెచ్చి ఒకవ్యక్తి జీవితంలోని వివిధఘట్టాలని చర్చించాడు. "కొన్ని ముఖాలుంటాయ్. ఎలాంటివాళ్ళకైనా ఆ ముఖం చూడగానే అదొక విధమైన అభిమానం పుట్టుకొస్తుంది. ఏరోజైతే తొలిసారిగా నిన్ను చూశానో, ఆరోజే అనుకున్నాను. నీకూ నాకూ ఏదో సంబంధం వుందని" వ్రాశాడు.

ముఖ్యంగా తన జీవితాన్ని అర్థంచేసుకొని ఔన్నత్యాన్ని ప్రసాదించటం రమణరావు నమ్మలేకపోయాడు. "పైకిఘరానాగా కనబడేవారే. కార్యవాదులు, గౌరవార్హులు అనుకోవటం పొరపాటు. నిజానికి చెప్పవలసివస్తే సామాన్య మానవుల హృదయాల్లో అంతులేని ఆవేదనతోపాటు అసలైన నిజాయితీ వుంటుందని. వాళ్ళనే నమ్మటం నేర్చుకోవాలి ఇంకొక విషయం, ధనికవర్గాలు ఒక కూటమిగా వుండటం, మధ్యతరగతివాళ్ళు మీదికివచ్చే ఆర్థికస్తోమత లేకపోవటం, యీనాటి సంఘపు అనర్థాలు. రెండోది సాధారణంగా జరగని విషయం,

అంచేత ధనికవర్గాలు దిగిరావలసిన అవుసరం ఎంతైనావుంది ఇవన్నీ వాదనలు వుద్దేశాలూను. విప్లవం అన్నది వస్తేగానీ, మెదళ్లకు మేతలుండవు. ఈ విప్లవం కొందరి మెదళ్లలో పని చేస్తుందని తులసితో వాదించాక తెలుసుకొన్నాను. ఈవిప్లవం ఒకరి మీద ప్రేమ అంకురించటంవల్ల రావచ్చు, లేదా మొదటినుంచీవున్న విప్లవ పంథా ఒకరిమీద ప్రేమను అంకురించనూవచ్చు. సరే! పాప నీకోసం చాచా అని ఏడవకుండా వూరుకోలేదు. ముసలాయన నిన్ను చదరంగం ఆటకు రమ్మంటారు రోజూ వెళ్లు. నీ తెలివితేటలతో ఆటకట్టటం నేర్చుకోవాలి!"

ఐదు పేజీల ఆ వుత్తరంలో యింకా మరికొన్ని విషయాలు చర్చించాడు, ఆనెల 22 వ తేది తులసి వచ్చేస్తూందంటే రమణ నమ్మలేకపోయాడు. ఇంకా మూడురోజులేవుంది. లక్ష్మణరావు ముసలాయనను స్టేషనులో కలుసుకోమన్నాడు,

సరిగ్గా వెళ్లిన పదిరోజుల నాటికే తిరిగి వచ్చేశారు. రమణను చూసి "వచ్చేవోయ్! లక్ష్మణరావు చెప్పాడులే నువ్వొస్తావని" ముసలాయన పలుకులకు మెల్లగా నవ్వి తులసి వైపు చూసాడు. ఆమె తన వేపే చూస్తూండటం గమనించి, తల దించి, తలెత్తబోయాడు. కూలీలు వెనక నడుస్తూంటే ముగ్గురూ గేటు దాటారు...

ఇంటిదగ్గర, ముసలాయన దగ్గర రమణ శలవు తీసుకొంటూ చెప్పారు "రోజూ సాయంత్రం తప్పకండా వస్తూం

డవోయ్. చదరంగం యీ పదిరోజుల్లోనూ బాగా అబ్బిందను కొంటాను."

ఇంతలో వసంత వచ్చింది. "ఏమిటే యీ యెండలో" అంది తులసి.

"మామయ్యగా రింటినుండి వస్తూ—తలుపు తీసుంటే వచ్చాను, ఏం? యింత వేగంగా వచ్చేశావ్ ?"

ముసలాయన అందుకొన్నారు. "కారణాలే వుంటాయ్ అమ్మాయ్. తాతయ్యా! నా కిక్కడ వుండాలని లేదు. వెళ్లిపోదా" మంది. వచ్చేశాం. నీకూ చదరంగం వచ్చుగా! రోజూ ఒకసారి వద్దూ!"

యీ బిత్తిమాలే ధోరణికి తులసి నవ్వింది,

"నేనిల్లు కదిలానంటే మా తులసితో చిక్కు తెచ్చుకొన్నానన్నమాటే! ఎవరో వస్తున్నా.....ఆలోచనకు అవకాశంవున్న మీ మెదళ్లెలా వుంటాయో పరీక్షిద్దామని."

ముసలాయన మాటలకు వసంత నవ్వి "రాకేం రోజూ వస్తాను" అంది.

## ౧౫

రమణారావు రోజూ వస్తూన్నాడు. వసంత రోజూ వస్తోంది. యిద్దరినీ చదరంగంలో కూర్చోబెట్టి ముసలాయన చుట్ట వెలిగిస్తున్నారు. రోజూ రమణదే కింద చెయ్యి.

వసంత వైఖరీ రోజు రోజుకూ తనలో యేదో మార్పు తెప్పిస్తోందని రమణ గుర్తించకపోలేదు. ఆమెకు హెచ్చుగా

మాట్లాడటమంటే సరదా. ముసలాయన ప్రోత్సాహం. రమణ మౌనం, ఆమెలోని యీ శక్తి విజృంభింపచేశాయి. యేదైనా విషయం యెత్తితే రమణ అభిప్రాయం యిచ్చేవరకూ విడిచిపెట్టడు. నవ్వవలసిన సమయంలో నవ్వకపోయినా వూరుకోడు.

ఒక్కొక్కనాడు వీళ్లిద్దరూ వాదనలోకి దిగవలసి వస్తోంది. ముసలాయనకు వుత్సాహం యింతా అంతా కాదు. తులసిని పిలుస్తాడు. ఆమె వచ్చి మౌనంగా, విచారంగా కూర్చుంటుంది. కాని వాదించదు. ముసలాయన ఎన్నోవిధాల ప్రయత్నిస్తారు. అప్పుడు నవ్వేస్తుంది వెకిలిగా.

ఇలా వుంటున్నా, రవణలో ఒకకాంక్ష అలా నిల్చిపోయింది. తనువుత్కృష్టమైన జీవితాన్ని—పవిత్రమైన ఆశయాలతో కాంక్షిస్తున్నాడు. ఈ కాంక్షతో తన గత జీవితాన్ని మరిచిపోయి. భావిని గురించి ఆలోచించి మెసులుతున్నాడు.

ఇదివరలో నిరాశతో జీవించటం తప్పించి, ఆశతో మెసలే అలవాటు లేదు. యిప్పుడు తనలో యీవిధమైన జీవితాన్ని అలవరుచుకొనే విధానం, మొదట తులసి, తరువాత లక్ష్మణరావు, వసంత, అందరికంటే హెచ్చుగా పాప నేర్పింది. పాపను తను ప్రేమించేటప్పుడే అనుకొన్నాడు — భాగ్యవంతుల యిళ్ళలోవుండే గౌరవం, వాళ్లు సంఘంలో యెడంగా బ్రతటంవల్ల పైకి కనబడలేదనీ, ఉద్దేశాలలో వాళ్లకంటే తనే

విధంగా తీసిపోననీ, ధైర్యం పొడచూపటంవల్లే, "చాచా" అనే పదం పాపకు నేర్పించాడు. దానివల్ల ఫలితంకూడా కన బడింది. అలాంటి ధైర్యం యిప్పుడు ద్విగుణీకృతం కావటం వల్ల గంభీరతను అలవర్చుకొన్నాడు.

ఆవేళ సాయంత్రం వచ్చేటప్పటికల్లా వసంత, ముసలా యన అప్పుడే ఒకాట పూర్తి చేశారు. ముసలాయన నవ్వుతూ "ఏమోయ్! చూశావా? నా ఆట కట్టేసింది. భేష్! మా తులసికంటే తెలివైనదే!" అన్నారు. తులసి అక్కడే కుర్చీ మీద పుస్తకం పట్టుకు కూర్చుంది. నిల్చున్న రమణారావు చిన్న నవ్వు నవ్వి— చేతిలోవున్న బాటా రబ్బరుబొమ్మ తులసి దగ్గరగా వున్న టేబిలుమీద పెట్టి ముసలాయన దగ్గరగా వెళ్ళాడు. తులసి తలెత్తి ఎదురుగావున్న కుక్క బొమ్మను చూసింది. ముసలాయన అన్నారు "అదేమిటోయ్! కుక్కని తీసుకవచ్చావ్."

"పాప జ్ఞాపకానికి వచ్చింది. పాప యీ బొమ్మల్ని చూపి బూచీ అని పిలచేదిలెండి. యీ యింట్లో ఒక బూచీ వుంటే బాగుండుననీ."

"ఉండనీవోయ్—బాగుంది" అన్నారు ముసలాయన. తులసి అక్కడనుంచి లోనికి వెళిపోతూంటే—రమణారావు చూసి చూడనట్లు మెసిలాడు.

## ౧౬

వారం రోజులు గడిచింది. వసంత కాస్త జ్వరంతోనే ఆ వేళ సాయంత్రం వచ్చింది. ఆటలో ఓడిన రమణారావు వైపు చూసి ముసలాయన నవ్వుతూ "నీమీద వసంత అభిప్రాయం అడుగు" అన్నారు. ఈ ధోరణి ఆత్మాభిమానాన్ని రేకెత్తించటంచేత "అడిగే అవసరం నాకులేదులే" దన్నాడు కాస్త తీక్షణంగా.

"హాస్యాని కన్నానోయ్! అర్థం చేసుకోవాలి మరి" అన్నారు ముసలాయన ఫక్కున నవ్వి. అనవసరంగా కటుస్వరం ప్రయోగించినందుకు రమణ సిగ్గుపడ్డాడు. తనెన్నో పుస్తకాలు చదివాడు. కానీ తను నలుగురి మనుష్యులతోను తిరుగలేదు, నలుగురి ప్రదేశాలను కనుక్కోలేదు. ఆలోచించగా తన కొకటి తట్టింది. చిన్నప్పుడు అమ్మ, నాన్నా అని, రాను రాను యింటా బయటా మాటలెలా నేర్చుకొన్నామో, అలాగే జీవితంలో యింటా బయటా నలుగురిలో మెసలి బ్రతకటం నేర్చుకోవాలని. తను మొన్న మొన్నటివరకూ తనచుట్టు ఒక గోడని కట్టుకున్నాడు. అదే తన ప్రపంచం, ఆ కంపే యింపనుకొని తృప్తి పొందేవాడు. ఆగోడ ఒలు బ్రద్దలుకొట్టింది తులసి. తన లోకువ దాస్యాన్ని ఎత్తిపొడిచింది. విశాలప్రపంచంలో సంకుచితంగా బ్రతకటం చితికిపోటానికేగాని, పురోభివృద్ధికిమాత్రం కాదు. ఈ సంకుచితత్వ విధానానికి అలవడ్డవారు అల్ప సంతోషమునే నినాదాన్నే కాకుండా, ఒక పిరికితనాన్ని అలవరుచు

కొంటాడు. ప్రపంచంలో కొందరు మారు మూలల్లో ఎందుకు బాధపడుతున్నారో, దానికి విమోచన మార్గ మేదో ఆలోచించే అవసరమైనా వాళ్ళకుండదు. ఈ సంకుచితత్వవిధానం యెదుటివాళ్ల కష్ట. నిష్ఠూరాలకూ విజ్ఞానానికీ, పురోభివృద్ధికీ, చెవులు, కళ్లు, నోరు, సర్వేంద్రియాలు మూసు కొనేటట్లు చేస్తుంది.

రమణారావు, తనజీవితంలో మొదటిరోజులనుంచి నా మానన నేనే బ్రతుకుతాననే యీ సంకుచిత విధానానికి అలవాటు పడటంచేత, తులసి మొదట పగపట్టిన త్రాచుపాములా అగపడింది. పెంకితనంతో కూడిన ఆమె సౌజన్యం పాపనూ యింటిలో తొలిసారిగా విడిచిపెట్టేటప్పుడే అర్థం చేసుకో గలిగాడు. ఉమ తన అమాయకమైన అభిమానంతోను లక్ష్మణరావు సోదరవాత్సల్యంతోనూ, తన జీవితం వెలుగు లోనికి తీసుకవచ్చాడు. ఇప్పుడు వసంత తన జీవితంలో తుఫాను రేగించినా ప్రస్నతంగా మెసలే అవకాశాన్ని కల్పిస్తోంది. తనొక్కప్పుడు అనుకొన్న ఏకపత్నీత్వం సాధ్యమయ్యేది. పెళ్లి చేసుకొని ప్రేమిస్తేనే వీలౌతుందని యిప్పు డిప్పుడు అనుమానపడేటట్లు చేస్తోంది. ఈతడు అలా అనుమానపడటానికి కారణం తులసిలో రోజురోజుకూ కనిపించే విభిన్నమైన పరివర్తనలే. ఈవిభిన్న పరివర్తనవల్ల తన హృదయాంతరాళంలో వున్న కోర్కెను తను దాసుడైనా పైకి గంభీరంగా మెసలటానికి అవకాశం యిచ్చింది వసంత. రమణారావు ఈ వారం రోజుల్లో

తులసికంటే వసంత గురించే హెచ్చుగా ఆలోచిస్తున్నాడు. ఇద్దరి తత్వాలలో, అభిప్రాయలలో విభిన్నతను పూర్తిగా గుర్తించలేకపోయినా, యెదురుగా కనబడే ఒకనగ్నసత్యాన్ని మనస్సులో సమర్థించకుండా వుండలేకపోయాడు. తను ఇంత కాలం ఈ కలుపుగోలుతనం లేక ఈ సంఘంలో బహిష్కరించినవాడిమల్లే బ్రతికాడు. కానీ యీనాడు మనసులో నాలుగు మాటల్లోనీ, ఒకటైనా పైకి అనగలుగుతున్నాడు.

రమణను తప్పించి యీ హాస్యం హాస్యంగానే సమసి పోయింది. అందరూ మౌనంతో యేదో మనసులో అనుకొన్నారు. కొంతసేపయ్యాక అందరికీ ఆశ్చర్యం కలిగేటట్లు, "యీ వేళకు ఆటయెత్తుదామన్నారు" ముసలాయన.

"ఏం" అంది వసంత.

"నీ ఒంట్లో నీరసంగా వుంది. మెదడుకు శ్రమ యిచ్చావంటే జ్వరం ముదురుతుంది."

"ఫర్వాలేదంది" వసంత.

"అమ్మాయ్! చదువుకున్నావ్! మన జాగ్రత్తలో మనం లేకపోతే శరీరం పాడవుతుంది. ఆపత్కాలంలో యీ రాతల గీతల నమ్మిక మనకేమీ సహాయం చెయ్యలేవు. మన ధార్మికదృష్టి శక్తి మనల్నే వెక్కిరిస్తాయ్. జాగ్రత్తో భయం నాస్తి అన్నారు మనప్రాచ్యులు. భౌతికదృష్ట్యా మనం ఆలోచించటం నేర్చుకోవాలి. మన జాగ్రత్తలో మనం అన్ని విషయాల్లోను వుండాలి."

దీనికి నిదర్శనం నా ఆరోగ్యమే అన్నట్లుగా ముసలాయన లేచి నిల్చోటంవల్ల యెవరూ మాటాటలేక పోయారు.

ఆ మరుచటిరోజు సాయంత్రం రమణారావు వెళ్ళేసరికి ముసలాయన యింటిదగ్గర లేరు. తులసి అంగటి గదిలో కుర్చీ మీద కుక్కబొమ్మ పట్టుకొని కూర్చుంది. రమణను చూడగానే ఆ బొమ్మను టేబిలుమీద పెడుతూ తల దించింది. రమణ నిమిషమాత్రం నిల్చుని గుమ్మంవరకూ వచ్చి "మీ తాతయ్య ఎక్కడకు వెళ్లారు? అని ప్రశ్నించాడు.

కొంచెం ఆలస్యంగానే "క్లబ్బుకి వెళ్లుంటారు" అనే సమాధానం రాగానే తలతిప్పి ఆగి "మీతో ఒక విషయం చెప్పాలనుకొంటున్నాను." అన్నాడు.

"అనుకోవటం ఎందుకు? చెప్పాలని వుంటే చెప్పొచ్చు" పైకి చిరాకు లేశమాత్రం వ్యక్తపరచకండా యీ మాటలు వాల్చింది. రమణారావు కాస్త దగ్గరగావచ్చి "ఆవేళ ఉద్రేకంతో చేసిన పనికి క్షమించండి."

తులసి యెటువంటి ఆర్భాటం చూపించలేదు. అవ్యక్త మధురభావాలతో మనస్సంతా యీ పరివర్తన వల్ల నింపుకుంటున్న రమణారావు వేపు క్రీగంట చూపును చూసి ఆయన హృదయంలోనికి వర్ణించలేని తృప్తిని పడ్డట్లు నవ్వింది. రమణ ముఖం నవ్వుతో తేటపరచి మెల్లగా నిదానంగా ఆమెవైపు చూశాడు. తులసి మనస్సులో సిగ్గు చొచ్చుకపోయింది. మగ

వాడి ఎదురుగా సిగ్గుపడటం ఆమెకు యిదివరకు యెన్నడూ తెలియదు. ఈ నిమిషంలో అలాంటి చూపువల్ల స్త్రీ పొందే అనుభూతులు ఒకటి తరువాత ఒకటి వాటంతట అవే సహజంగా ఆమె హృదయంలో చొచ్చుక పోతున్నాయ్. తులసి యొక్క మార్పును రమణారావు వినియోగించకపోలేదు. నిశ్చితమైన చూపులతో ఆమెను బంధించబోయాడు. తులసి తన అసహాయతను తెలుసుకొని కొంత మనోనిగ్రహాన్ని తెచ్చిపెట్టుకుంది. మొదట గాంభీర్యానికై ప్రాకులాడినా, మనసు చీకటి యెదురుగా వెళ్లేదీపంలా వుంది. కంగారును కప్పిపుచ్చటానికి గంభీరవదనయై "ఆటకి యెవరూ లేరేమో!" అంది.

తగ్గట్టుగానే రమణ ప్రయత్నించి "వసంత యింటికి వెళ్తారా?" అన్నాడు.

"ఎందుకు వెళ్లాలి?" అంది తులసి.

రమణ మందహాసంతో "స్నేహం యీప్రశ్నను రానీయదనుకుంటాను. మీరు వెళ్తే ఆమె వేగంగా కోలుకుంటుందని నేను ఆశిస్తున్నట్లుగా చెప్పండి. వస్తాను." అంటూ ఆగకుండా ప్రయత్నం మీద వెళ్లిపోయాడు.

తులసి వసంత యింటికి ఆలోచించి బయులు దేరింది.

౧౭

మరుచటిరోజు వసంత రాఘవయ్యగారింటికి మూడు గంటలు కాకుండానే వచ్చింది. ముసలాయన యింకా నిద్ర

పోతున్నారు. తలుపు తీసిన తులసి వసంతను లోనికి పిలిచింది. ఇద్దరూ మేడమీదకు వెళ్ళారు. చాలాసేపటివరకూ ప్రయత్నించినా పెదాలు కదపటానికి మాటలు దొరకలేదు. తులసి ఈ పరిస్థితిని అదుపులోనికి తెచ్చుకోటానికి ఒక సంచిక వసంత యెదురుగా వేసి, యింకొక సంచిక మీద తన దృష్టిని పోనిచ్చింది.

వసంత నీరసంతో పాటు యేదో ఆవేదనతో బాధపడుతూందని తులసి గుర్తించకపోలేదు. ఆమె ప్రయత్నపూర్వకంగానే మౌనాన్ని అలవర్చుకుంది. మనసులో పొందే అనుభూతుల్ని ముఖంలో దాచటానికి సంచికమీద దృష్టిసారించి వెకిలినవ్వు వెదజల్లుతోంది.

ఆమె అడగాలనుకున్న విషయం హృదయంలో గిలిగింతలు పెట్టడంవల్ల వసంత వెకిలినవ్వు నవ్వింది. కొద్దిసేపట్లో పైన ఏర్పడ్డ ప్రశాంతతను మెల్లగా భంగపరిచేటట్లు అంది. "నిజం చెప్పు తులసీ." అసలు విషయం చెప్పటానికి సాహసించలేదు గానీ, గ్రహించిన తులసి గంభీరవదనయైంది. కొంతసేపటికిగాని వసంత నీరసపడ్డ మోములో మళ్ళీ మొదటి కాంతి వెలగలేదు. ఈ కాంతి ఆమె ప్రయత్నంమీద పిచ్చిగా చిరునవ్వు తెచ్చుకోటం వల్ల వచ్చింది. "నువ్వే కల్పించి చెప్పావుకదూ?"

ఏవో పెద్దమాటలు వాల్చబోయి క్లుప్తంగా "లేదు" అంది తులసి. వసంత ఆలోచనలో పడి తన అప్పటి పరిస్థితిని

అవగాహన చేసుకోని అమాయకంగానే అంది. "నాతో ఒక సారి రమణ చెప్పాడు. ఎందుకులే చెప్తే నే నేదో......"

"ఏం చెప్పాడు?" తులసి యీ ప్రశ్న వేసి మళ్ళీనొచ్చు కుంది. "చెప్తే నా కేదో సంబంధం వుందనుకొంటావ్. ఎందు కమ్మా నా చదువేదో నాది." తులసి పొడినవ్వు నవ్వి "అది గోనే, మళ్ళీ అబలవై పోతున్నావ్. నేనేం బలవంతం చెయ్య లేదుగా."

"నమ్ముతావో లేదో అని అలా......

"నే నొకర్ని యీ వేళ నమ్మానంటే జీవితకాలం నమ్ముతాను,"

వసంత హాహాహా అంటూ నవ్వింది. తులసి ఈ నవ్వుకు మండిపడి, ఆనవ్వు ఆగాక హేళనగా " నీ జ్వరం విరహతాప జ్వరం అనుకున్నానే! " అంది.

వసంత మళ్ళీ నవ్వుతూ లేచి జడ తిప్పుతూ "నిజం చెప్పావే. ఎప్పుడైనా నీకుమాత్రం రాకపోతుందీ?"

తులసి సమాధానంగా పెదవులనుంచే నవ్వింది. మన సులో పిచ్చిగా యింకో పిచ్చిదాని గురించి ఆలోచించుకుంది.

ఇద్దరూ క్రిందికి వెళ్లేసరికి ముసలాయన చుట్ట వెలిగించి దీర్ఘాలోచన చేస్తున్నారు. వసంతను చూడగానే "ఏమ మ్మాయ్! జ్వరం పోయినట్లేగా?" అన్నారు వుత్సాహంతో.

"పోకేంచేస్తుంది" అంది వసంత నవ్వుతూ.

"ఈ జ్వరం యెందుకొచ్చిందీ? పెళ్లి చేసుకోబోతోంది. తాతయ్యా!"

"లేదు, లేదు" అంది వసంత ఖండిస్తూ.

ముసలాయన నవ్వుతూ "పెళ్లంటే పైకి యెంత అసహ్యత చూపిస్తావో లోపల అంతఅభిమానం చూపిస్తావమ్మా, మీకు తెలీదుకాని ఆ మూడు ముళ్లలో యెంత మహాత్యం వుందనుకొన్నారు. భార్యా భర్తలు ఆ మూడు ముళ్ళలో పవిత్రతను దృష్టిని పెట్టుకుంటే ప్రపంచంలో యే మారుమూలలలో వున్నా ఫరవాలేదు."

ఈ ముసలాయన మాటలు వసంతకు వేదాంలావుంది, కాని తులసికి తెలుసు యిదంతా తాతయ్య జీవితానుభవమే అని. మనుష్యులను నమ్మటం తాతయ్యకు మొదటినుంచి అలవాటు.

ఎటువంటి వాళ్ల వనీ వాళ్లకు వ్యక్తి స్వాతంత్ర్యం వుండితీరాలనీ, ఆ స్వాతంత్ర్యాన్ని అన్యాయానికి అవినీతికి వుపయోగిస్తే అన్నివిధాలా యెదుర్కోవాలని తులసితో చెప్తూండేవారు. ఆ ఒక్క కూతురు దుర్గను చూసుకొని ఏకాంతంగా పవిత్రంగా బ్రతికాడాయన.

ఈ మాటలు పూర్తి కాకుండానే రమణరావు వచ్చాడు. ముందు వసంతవేపు తరువాత ముసలాయన వేపు చూసి "యింకా ఆట మొదలెట్టారు కాదేం?" అన్నాడు.

“మన జీవితరంగమే ఒక చదరంగంవోయ్. ఈ ప్రపంచంలో సృష్టించబడ్డ విభిన్న సిద్ధాంతాలకి మధ్య సంఘర్షణలు మన నిత్యజీవితంలోని బ్రతుకుబాటల మీద జరుగుతుంటాయ్. ఈ సంఘర్షణద్వారా ఒక సందేశాన్ని గ్రహించుకొని బ్రతకడమనేది యీ రోజుల్లో జరగకుండాపోతోంది. అనుమానాల బాధతో బ్రతకటమో, సిద్ధాంతాల సంఘర్షణకు చచ్చిపోవటమో తప్పించి గత్యంతరము లేకపోతోంది.”

ముసలాయన చుట్ట మళ్ళీ నోటిలోకి వెళ్ళినా, అందరూ మౌనముద్రాంకితులయ్యారు. కొంతసేపయ్యాక ముసలాయన మళ్ళీ అన్నారు. “అధికారం, డబ్బు, సామాన్యులలోని, అనాథులలోని ఆశయాలను ఆవేదనను గుర్తించనంతకాలం దక్షిణ వేపే ప్రయాణం చేస్తాయ్ ... భాగ్యవంతులలో కొందరు అధికార్లలో కొందరు, సామాన్యుల, పేదవాళ్ళ కష్టనిష్ఠూరాలను పంచుకోబట్టి, ఆ తెగలు నిల్చివున్నా ఇప్పటికీ ఏంవోయ్ రమణా అంతేనా!” అన్నారు.

రమణ యీపలుకుల సరళితో శరీరం గగుర్పాటు చెందడంవల్లకళ్ళతోనే సమాధానం యిచ్చాడు.

పలుకులకు బహిర్గతంగాని ఆవేదనేదో ముసలాయనను చుట్టుముట్టిందని ముగ్గురూ గ్రహించారు. తుదకు తమకు తామె మౌనంగా విమర్శించుకోటంలోనే మెదడులు పనిచేశాయి. ఆ వేళ ఆటలో తులసి పాల్గొందికాని అట్టే ఆసక్తి చూపించలేదు.

## ౧౮

ఆ వేళ ఆశాపూరితమైన హృదయంతో వచ్చిన రమణారావును వసంత హృదయంలో స్వాగత వాక్యాలు చెప్పుకుంది. ఎదుటి హృదయంలో యింకో స్త్రీ ప్రతిబింబము ఆరాధించబడుతోందని పొరపాటునైనా వూహించలేకపోవటం, ఆమెలో వెలిగిన ఆనంద దీప్తికి కారణం. తన ఆరోగ్యం తులసిద్వారా అడిగిన ప్రేమమూర్తి గంభీరంగా నిశ్చలంగా వున్నట్లు కనబడ్డాడు.

మూడురోజులనుంచి హృదయంలోకి నవ్వీన తులసి ఆ హృదయసీమను విడిచి పెట్టటంలేదు. ఈ తులసీ పూరిత పరిపూర్ణ హృదయంలో ఆరాటం లేకపోలేదు. మనసులో మధుర స్రవంతులతోపాటు, అగ్నిజ్వాలలు కూడా రేగటం చేత గుర్రిం శకటం అయిపోతోంది. బంటు యేమైపోతున్నాడు.

గోడగడియారం ఐదుగంటలు కొట్టడం ముసలాయన వులిక్కిపడి లేవటం జరిగింది,

“కొండప్పతో వస్తానని చెప్పాను. హైదరాబాదునుంచి పెద్ద ఆటగాడు వచ్చాడుట. తులసి పెద్దాడవారింటికి వెళ్లింది. ఇప్పుడే వచ్చేస్తుంది. మీరు ఆడుతూండండని” ముసలాయన వోణీ మీద వేసుకొని చేతికర్ర పట్టుకొని వెళ్ళారు.

ఆ యింట్లో వున్న యిద్దరి మనసులు, ఆ ముసలాయన మానవులను నమ్మే మహోత్కృష్టమైన మనస్సుకు జోహారులు అర్పిస్తున్నాయ్.

ఈ యింట్లో తులసి ప్రస్తుతం లేదని తెలుసుకున్న రమణ హృదయంలో నిరీక్షణాన్వితమైన నిరాశ ఆవరించింది.

వసంతకు కుడిచేతిలోని ఒకే ఒక బంగారు గాజుబరువై పోయింది. కష్టపడి ఎత్తువేసింది. రమణ మెల్లగా అన్నాడు "తొందరపడి మంత్రిని యిచ్చేస్తున్నారు."

వసంత నాలిక కరుచుకొని బంటుని యథాస్థానంలో పెట్టింది. రమణ బహిర్గతమైన వసంత మనోవాంఛితాలను గుర్తించకుండానే, ఆగదిలోనే అదేస్థలంలో మూడురోజుల క్రితం జరిగిన సంఘటనను కళ్లయెదురుగా పెట్టుకొన్నాడు. కళ్లు చదరంగంమీద వున్నా, మనస్సు యెత్తుగురించి ఆలోచిస్తున్నట్లుగా ముఖం సూచిస్తున్నా, లోపల తులసి హృదయంలోకి నవ్విన నవ్వు మనోజ్ఞంగా ప్రదర్శితమౌతోంది. తులసి తనవేపు చూసిన చూపు, తృప్తి పొందిన ముఖకళ, మళ్ళీమళ్ళీ ప్రతిబింబతంకావటంచేత, లేతవెలుగులో ముఖందీప్తితమైంది. వసంత ఆ కాంతిని కళ్లారాచూసి హృదయకుహరంలో ఒక మెరుపు మెరిసినట్లుకాగా ఆకోమల వదనంలో ప్రతిబింబిస్తున్న సుకుమారమైన కాంక్ష బలీయమైన తత్తరపాటుతో నిట్టూర్పులతో నీరసించి యెత్తువేస్తున్న రమణ కుడిచెయ్యిని రెండు

చేతులతో చప్పున పట్టుకొని ముఖాన్ని చేతులపై ఆన్చి, వూపిరి బిగపట్టింది.

రమణ కొన్ని క్షణములు, బాధ. బరువు, గాబరాతో నిశ్చేష్టుడయ్యాడు. ఉలకడు పలకడు, తన బాధను, ప్రేమను అనురాగాన్ని కన్నీటితో ఒక యావని నివాళించుకొంటాందని కొంత సేపటికి కానీ గుర్తించే పరిస్థితిలో లేకపోయాడు.

ఒకహృదయంలో యివి వర్ణించ వీలుపడని మధుర క్షణాలు ఇంకో హృదయంలో వర్ణించ వీలులేని సంశయపు సెకండ్లు.

కానీ ఆ సంశయం కొద్దిక్షణాలకు ఆమెపై గౌరవంగా అభిమానంగా మారిపోయింది. వసంతను చూచి తనెప్పుడూ అసహ్యించుకోలేదు. ఈ నిముషానికికూడా ఆమెయందుండే గౌరవం చెక్కు చెదర లేదు.

నిజంగా నిముషం దొర్లుకపోయింది. రమణ మెల్లగా ఆమె తలమీద చెయ్యివేసి పట్టిన గొంతుకలోనుంచి ఆమెను నిరాశతో కృంగిపోనిచ్చే హృదయఘోషను వెళ్లగక్క లేక పోతున్నాడు. నీరు వుబికి కళ్లను పొడుగుపాటి ఆ జడలోని చిన్న మల్లెగుత్తు అగపడింది. ఆగుత్తు వెదజల్లే సువాసన యెడారిలో అత్తరు పోసినట్లుంది.

అప్పుడు తలుపు త్రోసుకొని యీదృశ్యాన్ని చూసిన తులసి క్షణకాలం కొయ్యబారిపోయింది కీయిచ్చి నడిపించిన రబ్బరుబొమ్మలా నడుస్తూ లోపలకు వెళ్లిపోయింది.

తలెత్తిన వసంతముఖం కన్నీటిచే వుబ్బివుంది. పెదాలు ఆ చేతికి ఘట్టిగా హత్తి మరీ విడిచి పెట్టింది. రమణ లేచి ఖిన్నునిలా వెళిపోతూంటే వసంత వ్యథిత హృదయంతో చప్పున లేవబోయేసరికి టేబులుమీది చదరంగం పిక్కలు సగం నేల మీద చెదరాయి.

ఇంకా ఆ లోకంలో వున్న వసంత తులసి మాటాడే వరకూ ఉలిక్కిపడలేదు. తులసి బలవంతాన తెప్పించుకొన్న శాంత గంభీరస్వరంతో "ఇది సంసారుల యిల్లు! మళ్ళీ కాలు పెట్టకు" అంటూనే అక్కడనుండి వెళిపోయింది. వసంతలో యింతవరకూ ఉన్న దుఃఖం ఒక్కసారిగా ప్రవహించుకపోయింది. పిచ్చిదానిలా హృదయంలో వేనకు వేలసార్లు దుఃఖపు నగవును వెళ్ళగ్రక్కుకుంది. ఆ పొడుగుపాటి జడను లాక్కుంటూ, ఆ జుత్తు పీక్కుంటూ, ఆ మల్లెగుత్తును విసిరి కొట్టింది. ఆ టేబిలుమీద పడి ఒక నిముషం, ఒకగంటలో కారే కన్నీరు కార్చింది. మళ్ళీ వుద్రిక్తయై "యిది సంసారుల యిల్లు నేను" అని పదేపదిగా అంటూ మెల్లగా ఏడ్చుకొంటూంది.

తులసి వచ్చి ముఖం ఎత్తకుండానే "తొందరపడి అనేశాను క్షమించవే వసంతం!"

వసంత తలెత్తింది. తులసి కళ్లలో నీటికీ తన కన్నీటికీ యేదో సంబంధం లేకపోతే యీమాట లేపి ద్రోల్లేవి కావని గ్రహించిన వసంతం "వస్తానే" అంటూ వెళిపోయింది.

తులసి కాళ్ళదగ్గర పడున్న మల్లెగుత్తును వీధి కాలవలో విసిరి తలుపు గడియవేసి తలుపుకు అంటుకపోయింది.

## ౧౬

ఆరాత్రి రమణారావు హోటలులో భోంచేసి వేగంగానే వచ్చాడు. అప్పుడే వచ్చిన ముసలాయన భోజనంకూడా పూర్తయింది. కాస్సేపు ముసలాయన ఆటవిశేషాలు చెప్పాక పరుపుమీద చారబడ్డారు. మళ్ళీ లేచి యింకో చుట్ట వెలిగించి మాటలు పొడిగించారు.

"సాయంత్రం ఆ ఆట ఎవరు కట్టారు?"

రమణ జవాబుకు తడబడ్డా 'నేను' అనగలిగాడు.

"ఎన్నాళ్ళకి విన్నానోయ్ వసంత ఆటను కట్టేటం.— చాలాం తెలివైనపిల్ల సుమా!"

ఆలోచనలో మౌనముద్రాంకితుడైన రమణ వేపు చూడకండానే మళ్ళీ అన్నారు "మనసులో యేవుంటే అది పైకి అనేవరకు నిద్దరపట్టదు. కల్ల కపటంలేని పిల్ల—నవ్వుల బండి."

రమణ ముఖం పక్కకు తిప్పి నీరసస్వరంతో "వస్తానండి" అన్నాడు. "రేపు వస్తావుకదూ" అన్నారు ముసలాయన "హఁ" అంటూ శెలవు తీసుకొని వెళ్ళిపోయాడు.

వరుసగా మూడురోజులు సాయంత్రం వచ్చి రాత్రి యెనిమిదివరకూ వున్నా తను యెదురు చూసిన ముఖం అగపడలేదు. ముసలాయన రమణాకంటే ఆతృతతోనూ నీరసం

గానే వున్నట్లు అగపడటంచేత యీ కాలంలో హెచ్చు నిశ్శబ్దంగానే గడిచిపోయేది. వసంత రాకపోవటానికి కారణం యెవరూ చెప్పటంలేదు. ఆయన మనసును యేదో వూరికి వెళ్లివుంటుందని సంబాళించుకున్నారు. వసంత నాలుగోరోజు సాయంత్రం వచ్చింది. రమణారావు ఈ విషయం తెలుసుకున్నాక ఆశ్చర్యపడలేదు. ముసలాయన వుత్సాహంతో "వచ్చావ్ అమ్మాయ్. తొందరగా వూరికి వెళ్ళవలసి వచ్చిందా?"

రమణ మనస్సు, పొంచి వింటున్న తులసి మనస్సు, చివుమన్నట్లు "లేదు. తులసి మీ యింటికి రావద్దంది. కానీ మిమ్మల్ని చూడాలని మనస్సు పుట్టడంచేత వచ్చాను. నమస్కారం. సెలవిప్పించండి."

తులసి మండిపోయిన మనస్సు ముందుకు కాలిడమని ప్రేరేపిస్తున్న సమయానికి ముసలాయన నవ్వు వినబడింది. వెనువెంటనే "మా తులసి రావద్దందా? హాస్యానికనుంటుంది ఇంకా దాని మాటలు అర్థం చేసుకోలేదమ్మాయ్" ఒకనిట్టూర్పు విడిచి అనబోయే మాటలు ఆపుకోటానికి చుట్ట నోటిలో పెట్టారు.

చప్పున యేదో స్మరణకు తెచ్చుకున్న వసంత నవ్వి కూర్చుంది. పైకినవ్వుతూనే "మీ తులసి నన్ను రావద్దనిందని నేనంటే మీరెలా నమ్మారండి? మా మేనత్తకు బాగులేదని కాకినాడనుంచి, వైరువచ్చింది వెళ్లి యిప్పుడే రావటం!"

ఇది అబద్ధం అని తెలుకున్నవాళ్లు ముఖాలు యెత్తలేకపోయారు. ముసలాయన అన్నారు "కులాసాగా వుంది కదూ!" అని.

"ఉంది మళ్ళీ నేను రేపు వెళ్ళి వారంరోజులైనా వుండవలసి వస్తుందేమో!"

ముసలాయన ఆ మేనత్త విషయం అడగటం వసంత తొట్రిపాటును అణచుకొని జబాబు చెప్పటం అయ్యాక ముసలాయన బలవంతం చేసినా ఆగక శలవు తీసుకొని వెళ్ళి పోయింది,

ఆ వారం రోజుల్లోను వసంత అగపడలేదు. రోజూ రమణారావు వస్తున్నాడు, ముసలాయన అనుభవాలతో ప్రపంచపు తీరు కూడా రమణ చెవుల్లో వేసి అభిప్రాయాన్ని కూడా అడుగుతున్నారు. రమణారావు యిదివరలో అనుమానంతో కుంగిపోకుండా తనకు తోచింది చెప్తున్నాడు. ఈ చెప్పటమైనా పైకి ప్రయత్నంమీద గంభీరాన్ని తెచ్చుకుని. లోలోన తులసి మార్పును నోచ్చుకోకపోలేదు. ఒకనాడు తులసిఒంటిగా కూర్చుని వెకిలిగా నవ్వుకోవటం ఆ నిమిషంలో ముఖం గంభీరమై, మళ్ళీ మరుక్షణంలోనే దుఃఖపడుతు వుండటం గుర్తించాడు. ఈ మార్పుకు ప్రధాన కారణం తన గుండెకు నాటుతున్నా చెప్పే అవకాశం దొరకలేదు. ఒకప్పుడా అవకాశాన్ని వినియోగించుకోవాలన్న విషయంలో కూడా సంశయంలో

పడిపోయాడు. ఆరాటం అన్నది, ఆనందం దుఃఖంతో మేళవించి అనుభవించుటమనేది, తన జీవితంలో యీరోజుల్లోనే.

ఈరోల్లోనే ముసలాయన దేని విషయమయ్యో ఆతృత పడుతున్నట్లు గ్రహించాడు. పోష్టు బంట్రోతు వచ్చేటప్పుడు "చూడునాయనా ఆవుత్తరాల్లో ఢిల్లీనుంచి యేదైనావుందేమో అనేవాడు. ఆవారంరోజుల్లోనూ అల్లుని దగ్గరనుంచి రాలేదు.

ఆ వుత్తరం వచ్చిన రోజున చీకటి పడ్డాక రమణారావు వచ్చాడు. మనస్సిలావున్నా ఆఫీసు పని తప్పే పరిస్థితిలో లేదు. అది తప్పాలని దొంగరాతలేమీ రాయాలని కూడా మనస్కరించలేదు. ఆవేళ వచ్చేసరికి ముసలాయన ఒక వాలు కుర్చీలో చారబడివున్నారు. తులసి అచ్చటలేదు. కాని ఒక క్రొత్త మనిషి అగపడి ది. ఆమె చిట్టెమ్మ, వంటమనిషి.

ఏలూరినుంచి వచ్చిందేమో కష్టసుఖాలు ముసలాయనతో చెప్పుకుంటూంది.

రమణ కూర్చున్నాడు ఆమెమాటలు ఆపివేసి "తులసమ్మ ఒకర్తె వంటింట్లో వుంది. మళ్ళీ వస్తాను బాబూ" అంటూ వెళ్ళిపోయింది. ముసలాయన "యీవేళ నీభోజనం యిక్కడేనోయ్" అన్నారు.

వద్దని అనాలనుకున్నా అనలేకపోయాడు. ముసలాయనకు కొంచెం పొడిదగ్గుతో సహా ఆయాసంగా కూడా వుంది. వీధిలోనికి వెళ్ళి వచ్చాక అలా కూర్చునే సరికి చిట్టెమ్మ

కబుర్లు చెప్పటం మొదలు పెట్టింది. దగ్గుతూనే యింతవరకూ విన్నారు. ఆయన రెండోసారి ఆవేళవచ్చిన వుత్తరం చదివాక తులసి కోసం కేకవేశారు. తులసి మాటాడకండా నిల్చుంది. "చూశావా? మీ అమ్మ యేంచేసిందో?"

తులసి జవాబు చెప్పలేదు. రమణారావు నిరీక్షణగా చూశాడు.

"నీకు వ్రాసిన వుత్తరం అదే ధోరణిలో వుందను కుంటాను సరేకానీ! నేనీరాత్రి భోజనం చెయ్యనమ్మా. రమ ణని భోజనానికి వుంచేశాను." అన్నాడు.

తులసి యీమాటలకు జవాబు చెప్పలేదు. "ఏమమ్మా అలావున్నావ్" నవ్వుతూ మళ్ళీ ఒకసారిదగ్గి "ఓహో! అలాగా! ఆ ఎంబాసిడర్ నే అన్నట్లే దొరుకుతున్నాడులే" తులసిచప్పున వెళిపోయింది గాని రమణ గతుక్కుమన్నాడు.

ఆఫీసులో ఒకరితో విరోధం లేకుండా యెవరైనా నోరు జారేసుకుంటే కలిపేస్వభావంగల రమణను "యెంబాసిడర్" అని పిలుస్తుంటారు. సంశయంతో నిండిన మనస్సుతోనే భోజ నందగ్గర కూర్చున్నాడు. చిట్టెమ్మ వడ్డించింది. దగ్గరగా నిల్చుని ఎంతో పరిచయమున్న మనిషితో మాట్లాడుతున్నట్లుగా, కుల గోత్రాలనుంచి కుశలప్రశ్నలవరకూ వేస్తుంటే ముక్తసరిగా జ వాబులుచెప్పక వీలులేకపోతూంది. మజ్జిగ కావాలన్నాడు చివరకు విసిగి. చిట్టెమ్మ మరికొద్దిగా అన్నంకలిపాక పోస్తానం

టోంది. ఈ బలవంతంతో మనసులో విసుక్కున్నా కలిపాడు. చిట్టెమ్మ మజ్జిగకోసం వెళ్లేటప్పుడు పెద్ద నిట్టూర్పు విడచి గొంతుకదగ్గర చేతితో నిమురుకుంటూనే తలెత్తి చూశాడు. ఎదురుగానున్న గదిలో చీకటిలో తలుపు చాటున పొంచి నిలుచుని చూస్తున్న తులసి అగపడింది. మళ్లా రెప్పపాటులో ఆమె అగపడలేదు. "మజ్జిగ యెక్కడ పెట్టావమ్మా" అన్న కేక వినబడింది. కాస్సేపటిలో వంటియింటిలో తులసి నిల్చోవటం గమనించాడు. మజ్జిగఅన్నం సగం విడిచిపెట్టి లేచిపోయాడు.

భోజనం అయ్యాక ముసలాయనతో మాట్లాడుతూ కూర్చున్నాడు. "లక్ష్మణరావన్నది నిజమేనోయ్. భాగ్యవంతుల అమ్మాయిలు పేదవాళ్లా సామాన్యులయిన యువకుల్ని ప్రేమించటం పుస్తకాల్లోనూ సినీమాల్లోను తప్పించి నిజానికిలేవు. ఉన్నత విద్య నభ్యసించిన భాగ్యవంతుల పిల్ల కొన్ని వేలకట్నంపోసైనా భాగ్యవంతుల యింట్లోకి వెళ్తానంటుంది. యీజబ్బు సామాన్య కుటుంబాల్లో చదువుకున్న పిల్లల్లోనూ ప్రవేశించింది."

ముసలాయన దగ్గురావటం వల్ల ఆగారు. మళ్లీ మెల్లిగా అన్నారు. "మనదేశం నిజంగా దరిద్రమైంది కాదని నావుద్దేశం. భాగ్యవంతుల ఆర్థిక పరిస్థితికి సామాన్యుల పేదవాళ్ళ ఆర్థిక పరిస్థితికి, తూర్పు పడమరలకు వున్నంత దూరముంది. ఒకరు పర్వతాగ్రింలో వుంటే యింకొకరు గోతిలోవుంటారు,

ఈ వేళ ముసలాయన దగ్గుతో బాధపడుతూనే హృదయాన్ని విప్పటానికి, యేదో వుంటుందని బహుశః ఢిల్లీనుంచి

వచ్చిన వుత్తరంలోని విషయాలే యీయన్నిలా కలవరపరు స్తున్నాయని రమణ అనుకొన్నాడు.

పదిగంటల రాత్రివరకూ ఆయన ఆగి ఆగి మాట్లాడు తునే వున్నారు. రమణలేచి శెలవు తీసుకొనేటప్పుడు కూర్చో మని సైగచేసి "నన్ను కప్పెట్టెనంత డబ్బు గడించి చచ్చారు మా పెద్దలు. సద్వీని యోగం చేసినా యింకా యింకావుంది. ఇస్తాను. నీకు కావలసినంతడబ్బు యిస్తాను. చాలా మంచికుర్రి వాడివి. చదువుకో...నువ్వు పెద్దవాడవై—పేదవాళ్లని పెద్ద వాళ్లని చెయ్"

రమణకళ్లు అశ్రుపూరితము లయ్యాయి, విచారంలో రేగిన ఆనందంవల్ల ముఖం పక్కకు త్రిప్పుకొన్నాడు, ముస లాయన రమణవేపు చూడనట్లుగానే చూశాడు.

"జీవితంలో ఒకర్ని మర్యాదగా చూస్తే, ఆయన పవి త్రింగా వున్నన్నాళ్లూ చూడాలి. మాఅల్లుడు యిప్పుడు పెద్ద వాడయిపోయాడోయ్! వెళ్లునాయనా చాలా రాత్రియింది."

ఈచివరి పలుకులులోని అంతరార్థం, మళ్ళీ మొదటి పరిస్థితికి తీసుకురావటంచేత, యెలాంటి మనస్సుతో వచ్చాడో అలాంటి మనస్సుతోనే యిల్లు కదిలాడు.

## ౨౦

కాలగర్భంలో పదిహేనురోజులు కుంగిపోయినయ్. ముసలాయన శరీరంలో స్వస్థత చేకూరింది. కానీ ఇంకా బయు

టికి కదలలేదు. పది హేనురోజుల క్రితం వున్న వుద్దేశం యీ వేళ రమణలో లేదు. ఒకపక్క కోపం రెండోపక్క కన్నీరు తీరేదూ అనురాగంవల్ల వుత్పన్నమైనవని తెలుసుకోలేక పోలేదు. అయితే బహిర్గతమైన కన్నీరుగా మార్చేటందుకు తనేమి చెయ్యాలనే ఆలోచనలో పడిపోయాడు. తను తులసికి చెప్పాలనే వుద్దేశాన్ని విరమించుకొన్నాడు.

వసంత విషయం ముసలాయన వాకబుచేస్తూనేవున్నారు. నిజం చెప్పిన రమణరావు వుళ్లా యెందుకు చెప్పేనని విసుక్కున్నాడు, కూడాను. వసంత మాత్రం ఆ యింట్లో అడుగు పెట్టననే పట్టుదలను మాత్రం సడలించుకోవటంలేదు.

వానజల్లు ఆవేళ వచ్చి పడటంచేత రమణ బాగా చీకటి పడ్డాక వెళ్లాడు. ముసలాయన చుట్ట వెలిగించి యేకాంతంగా యేదో ఆలోచించు కుంటున్నట్లున్నారు. కుర్చీ దగ్గరగాలాగి కూర్చోవోయ్ అన్నారు.

రమణ కొంతసేపటికి కాని కూర్చోలేదు. ముసలాయన యే విషయం ఎత్తకండా చుట్టపూర్తయ్యేవరకూ అలానే కూచున్నారు. తరవాత అన్నారు "కాలం మారిందోయ్. రాజులు, మహారాజులే మామూలయి మనుషు లవుతున్నారు. కాని....."

కాని ఆతృతకు తగ్గట్లు అసలు విషయం చెప్పకండా వుండడంచేత రమణకు విసుగ్గా వుంది.

ముసలాయన మెల్లగా అన్నారు. "లక్ష్మణరావుకు మాట యిచ్చాను. ఉమ కూడా మరీమరీ చెప్పింది. ఆ మాట

నిలబెట్టుకోవటానికి అన్ని విధాలా ప్రయత్నించాను. కన్నవారి యిష్టంగానీ...... నామాట వాళ్ళిప్పుడు యెందుకు వింటారు? ఇద్దరూ ఢిల్లీనుంచి త్వరలో వస్తున్నారట. ఎవరో పెద్దఇంజనీరుకు పదివేలముడుపుతో తులసిని అర్పించుకొంటారటోయ్!” ఇన్నాళ్ళూ ఇదరినడతలో కలిగిన మార్పులకు కారణం ఎప్పటికప్పటికి గ్రహిస్తూ ముసలాయన యీ చివరిమాటలు బహు కష్టం మీద అన్నారు.

రమణ ముసలాయనకు తన ముఖం అగపడకూడదని ప్రక్కకు తిప్పేసరికి పొంచి వింటూన్న తులసి అగపడింది. కళ్ళొక్కసారి మూసి తలదించాడు. లేచి తడబడుతూనే “వస్తానండీ......నమస్కారం” అన్నాడు. ముసలాయన విడిచిపెట్టకండా దగ్గరగా వచ్చి భుజంమీద చెయ్యివేసి సాగనంపుతూ “నీలోసహనం వుందోయ్. యీకాలంలో ఈ గుణం వున్నవాడు గొప్పవాడని నమ్ము. యింటరు ప్యాసయ్యావు కదా. నీకు సీటు తెప్పించే పూచీనాది. ఆ యింజనీరులా దోచే బదులు ఒక డాక్టరై ప్రజాసేవ చెయ్యకూడదూ?”

ఎటువంటి జబాబూ యే విధంగానూ లేదు. ముసలాయన విడిచిపెట్తూ “రేపుతప్పక రావాలి” అన్నారు. జబాబు కోసం నిరీక్షించిన పెద్ద మనిషి తలుపు వేసుకొని మెల్లగా పరుపువద్దకు పోతూ “యింక మాతులసమ్మ యిష్టం” అంటూ గొణుక్కున్నారు.

మూడు రోజులు గడచింది. సర్వస్వం పోయేటప్పుడు జీవచ్ఛవంలావుండే నిర్భాగ్యునిమల్లే రమణారావు యిల్లు కదల లేదు. ఆతృతగావున్న ముసలాయన వసంతను చూసి ఆశ్చర్య పడ్డారు. వచ్చిన వసంత యెంతో ప్రయత్నంమీద నవ్వటం మాటాడటం అలవరుచుకుంది. అది సరిహద్దు లెరుగని విచా రంవల్ల వచ్చే వెకిలినవ్వు. ఇటూ అటూ అనే ఆందోళనతో వుండిన జీవితపు ఘడియల్లో నిరాశ పెనవేసుక రావటంవల్ల జనితమైన పిచ్చి చూపు ఆమెది. ఆమె ప్రేమించిన వ్యక్తి జీవి తం ఆమె అనుకున్న దానికన్న వుత్కృష్టమైనదని గ్రహించిన నిముషాల్లోనే, అతను తనను లేశమాత్రం ప్రేమించ లేదనిన తెలుసుకున్నాక వచ్చాక దుఃఖాన్వితమైన ఆవేశమిది.

ముసలాయన చాలా మర్యాద చేస్తున్నారు. మర్యాద తెలియని మూఘులాలిలా వసంత పకపక నవ్వుతోంది. "ఏం అమ్మాయ్ అలావున్నావ్" అన్నారు ముసలాయన. "ఎలా వున్నాను కోతిలావున్నాను...కనిపిస్తున్నాగా." వసంత మళ్లీ నవ్వింది. ముసలాయన తులసి కోసం కేకవేశారు. వసంతమళ్ళీ నవ్వి "మెడపట్టుకు గెంటేరుగా...ఆ అసలు సంగతి మరిచి పోతూను...ఎలావుంది నాపిచ్చివేషం!"

ముసలాయన స్తబ్ధుడయ్యారు. తులసివస్తోందని గుర్తించి వసంత తన బాధ్యతను తెలుసుకొని గబ గబ ముసలాయన దగ్గరకూర్చుని "ఈవేళ మహిళా భవనంలో నాటకం వేస్తు న్నారు. అందులో నేను పిచ్చిదాని వేషం వెయ్యాలి. మీ రే

బాగుందంటే అందరూ మెచ్చుకు తీరవలసిందే అని ఇలా... ఈ మాటలకూ పిచ్చిగా నవ్వుతూనే అంది.

ముసలాయన ఫకాలునావ్నురు. "తప్పకండా నీదీ ఫస్టు ప్రైజు. ఎంతబాధ పెట్టావమ్మా?"

"బాధ" పైకి ఒక్కసారే అని లోన వందసార్లు ప్రతిధ్వనించేటట్లు అనుకుంది. చివరకు అక్కడ నిల్చున్న తులసిని చూసి "ఇదిగోండి ఆరు దగ్గరౌతూంది. తులసిని పంపిస్తారని వచ్చాను!" "వెళ్లమ్మా" అన్నారు ముసలాయన. తులసి నే రానంది. "వసంత వేషం వేసేటప్పుడు వెళ్లకంటా ఎలాగ వుంటావ్. వెళ్లమ్మా, వెళ్లు" అన్నారు ముసలాయన.

తులసి అక్కడనుంచి వెళ్లినా గదిలోకి తిరిగిరాలేదు. వసంత గబగబ మేడమీదకు పరుగెత్తింది. "నేను పెంకిదాన్నే ...పిచ్చిదాన్ని కూడాను. యీవేళ విడిచిపెట్టేదిలేదు." వసంత మాటలకు తులసి జబాబు చెప్పలేదు. కానీ ఆ బలవంతంవల్ల వున్నపాటున బయులుదేరక వీలులేకపోయింది.

ఇదివరకు చూడని సందులగుండా వసంతం తులసిని తీసుక వెళ్తోంది. తులసి చివరకు మౌనాన్ని విడనాడి యిలా తిప్పటంలో ఆమె వుద్దేశాన్ని అడిగింది. వసంత నవ్వి వెంటనే గంభీరవదనమైంది. కొద్ది నిముషాలు గడిచాక "యిదిగో యీ యింటెని గుర్తుపెట్టుకో" అంది. సందురోడ్డు సిమ్మెంటుదైనా గృహిణుల ధర్మమా అంటూ చెత్తా చెదారం రోడ్డు పక్కన

కుప్పలు పడివుంది. వసంత చూసిన యిల్లు చాలా చిన్నది. వసంత గబగబ ముందుకు పోతూంటే ఆమెను అనుసరించింది.

తులసికి యిదంతా అయోమయంగా వుంది. ఎక్కడ మహిళాభవనం — తనెక్కడికొచ్చినట్లు! ఆమెకు సముద్రి ఘోష వినబడింది.

వసంత మాట్లాడే పరిస్థితిలో లేదు. తులసిలో న్రారు కొనే శాంతంకూడా లేదు. చివరకు "ఒక్క నిముషంవూరుకో" అంది వసంత.

ఆనిముషంలో కెరటాలు మీదికి లేచి దిగజారిపోతున్న దృశ్యం వాళ్ళ కళ్ళయెదుట వుంది. వీచే పవనాలకి యిద్దరి తలలో ముంగురులు యెగురుతున్నాయ్. వసంత నవ్వింది.

తులసి అలా ఆమె వేపు చూస్తూ నిలుచున్నా, వసంత ముందుకు సాగిపోయి నిల్చి, "రావే యిక్కడ కాసేపు కూర్చుందామంది" తులసి ముందుకు కాలు కదిపినా, మనసు వెనుకకు లాగుతోంది.

యిద్దరూ యేకాంత ప్రిదేశంలో ఇసుకమీద కూర్చున్నారు. మౌనం ఇద్దరినీ మ్రింగివేసింది. ఐతే వసంత తను నిర్వర్తించే విధికి ధైర్యం తెచ్చుకొనే ప్రియత్నం మాత్రిం విడవలేదు. మహాసముద్రిపు లోతుపాతుల్ని ఆమె వూహించుకొనే వరకూ జాకిట్‌లో దాచిన వుత్తరాన్ని తులసి చేతికి అందించ లేకపోయింది. అందించే ముందు తలముడుకుల మీద ఆన్చి ముఖం కప్పుకొని ధైర్యంలేని దీన స్వరంతో "నేను

సంసారిని కానే తులసి ! .....” తులసి నిశ్చేష్టురాలయి చూసి, ఆమరుక్షణంలోనే ముఖం తిప్పింది వసంత మెల్లగా తలమెత్తి కీగగ్గింటిగా చూసి మళ్ళీ తలదించి “క్షమించు. నే నేదో అనవసరంగా వాగుతున్నాను. నువ్వు సుఖపడాలని నేను జీవితకాలం మనస్ఫూర్తిగా తలుచుకుంటాను.”

ఈమాటలు ఆమె ఆగి ఆగి అంటూనే తులసి చేతికి వుత్తరాన్ని అందించింది. తులసి విప్పి అడుగున రమణ సంతకం చూసి వుత్తరాన్ని మడిచింది. “చదువు. మళ్ళీ మళ్ళీ చదువు. నీదగ్గర ఒక పవిత్రమైన చిహ్నంగా ఆ వుత్తరాన్ని వుంచుకో” అంది.

తులసికేమీ అర్థం కావటంలేదు. వసంతకు రాసిన వుత్తరం చదవటానికి ఆమె యిష్టపడినట్లు లేదు. వసంత ముఖ మెత్తి “నేనేదో నిన్ను మోసగించుదామని వచ్చే నను కొన్నావా? లేదు లేదు. నిజాన్ని బయటపెడదామని ... ఆ వుత్తరం నువ్వు చదివి తీరాలి... అప్పుడే నీకొక విషయం చెప్తాను.....ఊ చదువు.”

సౌజన్యమూ దుఃఖము మిళితమయ్యే స్వరం వినటంతో తులసి వుత్తరం పైకి దృష్టి పోనిచ్చింది.

“ఆ వేళ మీరొక్కరే రోడ్డుమీద వెళిపోతూంటే, మీకు వినబడేట్లు రాఘవయ్యగారు మీకు చూడాలని ఆతృతపడుతున్నారని చెప్పిన నాటినుంచి మీకు వుత్తరం వ్రాద్దామని నేనెన్నోసార్లు అనుకొన్నాను. మీకు మళ్ళీ

నాలుగుసార్లు నాయింటిదగ్గర కలుసుకుని నా మంచి చెడ్డలు, బాగోగులుమీద శ్రద్ధ చూపించేటప్పుడు నా మనస్సులోని విషయాలు చెప్పలేకపోయాను. యీ చేతకానితనంవల్ల మీ కన్నీటిని కోపంగా మార్చేనేమో అని అనుమానపడి వుత్తరం వ్రాద్దామని నిశ్చయించుకొన్నాను కాని నేను యీ రోజు వరకూ వ్రాయలేక పోయాను.

ఈ అనంత విశ్వంలో అనురాగానుభూతితో బ్రతకాలని నాకుంది. జీవితం యిటా అటా అన్న యీ ఘడియల్లో చచ్చిపోనని భగవంతునితో చెప్పుకుంటున్నాను. నాకీ నమ్మికవల్ల వచ్చే శక్తితో యీ వుత్తరాన్ని మీకు వ్రాసి సంఘ జీవినని తృప్తి పొందుతున్నాను.

నాతల్లి నాచిన్నవయస్సులోనే పోయింది. మారటితల్లి నానాచాకరి చెయ్యించింది. మామేనత్త యిదంతా చూసి నా తొమ్మిదవయేట ఆమె యింటికి బలవంతాన్న తీసుక వెళ్ళింది. ఆమె దగ్గిర రెండేళ్లువుండి చదువుకున్నాను. నేను మొన్న మీతో అన్నాను. "నా జీవితంలో ఒక లక్ష్యంవుందని" అదిమాత్రం మీతో చెప్పే ధైర్యం. ఆనాడు లేకపోయింది. ఈ విజ్ఞానం యిచ్చే చదువులన్నీ ఒకరు నొకరు నమ్మి అర్థం చేసుకొని జీవించటానికే పుట్టబడ్డాయని నానమ్మకం. తమ పవిత్రహృదయాలతో ప్రియుని హృదయంలోనికి నవ్వే స్త్రీలకు ద్రోహం తలపెట్టేవాళ్లు, జీవితకాలం ప్రేమతత్వం తెలుసు

కోలేరు. మెదడు లేక పోవటంవల్ల నీతినియమాలు లేక మెసలే జంతువుల్లో ఒకడిగా లెఖ్ఖింపబడతారు.

నాపుద్దేశం యేమిటో మీకు విడమరచి చెప్పనక్కర్లే దని అనుకోంటాను. నే నీవిధంగా నా తొమ్మిదవ యేటనుంచే అనుకోంటున్నా. నేనప్పుడు పిడికిలుపట్టి బల్లగుద్ది అనుకున్నాను. "మా మామయ్యలా నేను చెయ్యను. నేను పెద్దయితే మా అత్తయ్య అన్నట్లు పెళ్ళిచేసుకుంటాను. మాఅత్తయ్యలా నా పెళ్ళాం యేడవదు. యెంచేతంటే మా మామయ్యలా పై ఆడ వాళ్ళని యింటికి తీసుకరాను." నే నలా ఆ వయసులో అను కోడానికి మాఅత్తయ్య కన్నీరు బలవత్తర కారణం. ఆమెను నే నెంతగానో పూజించే వాడిని. మామయ్య యింటికి ఎవరో ఆడవాళ్లు వచ్చేవారు. మా అత్తయ్య వాళ్ళకి భోజనం కాఫీ యిచ్చేది. నేను వంటియింట్లో ఆమెకు సహాయం చేస్తూండే టప్పుడు ఆమె కళ్లలో నీరు చూసే వాడిని. యేడ్చేవాడిని. నన్ను గట్టిగా పట్టుకొని యేడ్చి యెన్నో బుద్ధులు కూడా చెప్పేది మా అత్తయ్య. నన్నిలా చెయ్యవద్దనేది. ఈఆడవాళ్లు రావటంవల్ల అత్తయ్య కష్టపడుతోంది. నేను పెద్దయితే పై ఆడవాళ్లను యింటికి తీసుకురాను అనుకొనే వాణ్ణి. కాని రాను రాను నా కర్థమయింది, మాఅత్తయ్య ఎందు కేడ్చేదో నా జీవితంలో అందుచేత నే ఒకలక్ష్యం పెట్టుకోగలిగాను. ఇలా పెట్టుకోవటంవల్లనే కామోసు నేనెన్నో అడ్డంకులను ఎదుర్కో వలసి వచ్చింది.

నేను యింటరు పూర్తయ్యేక శలవులు చాలా దుర్భరంగా గడుపుతున్నాను. పొరుగింటావిడ నావిషయమై చాలా జాగ్రత్త తీసుకొంటోందని రానురాను ఆమె నాకోసం సర్వస్వం ధారపోయటానికి సిద్ధపడుతోందని తెలుసుకొన్నప్పటికి నాకెంతో కష్టమనిపించింది. అయితే ఆమె పిచ్చిదయిపోయిందని కొన్నాళ్ళకిగాని తెలుసుకోలేకపోయాను. ఆమె పిచ్చిలో తనభర్త కళ్ళ యెదుట పడింది. నాకొక వేపు రాజ్యలక్ష్మి (ఆమె) మీద కోపం రెంకోప్రక్క ఆమె కన్న వారి విషయం తెలుసు కాబట్టి జాలివేసి, నేనే ఆమెను పిలిచానని నాదే తప్పని అరచినా లాభం లేకపోయింది. ఆమెను కన్నవారింటికి పంపించాడు. మానాన్న కోపానికి మాపిన్ని మంత్రాలు తోడయినాయ్. నిలుచున్న పాటున నన్ను యింటినుంచి పొమ్మన్నాడు. బయలుదేరాను. మాయింట్లో మాఅమ్మ బ్రతికివున్నదగ్గరనుంచి ఒకపనిమనిషి వుంది. ఈ గందరగోళం అంతా విందేమో నేను కొంతదూరం వెళ్ళాక వెనక పరుగెత్తుకు రావటం చూశాను. నా చిన్న సూటు కేసు తెచ్చి నా చేతికిచ్చి దగ్గరనున్న రెండురూపాయలు నాచేత పెట్టి మాఅమ్మను తల్చుకొని యేడ్చింది. మా అమ్మకు యీమెకు భేదమేమిటా అని యేడుపు ఆపుకోలేకపోయాను. సరాసరి యీ వూరు వచ్చాను. వచ్చిననాడే మెయిన్ రోడ్డుమీదనుంచి వెళిపోతున్నాను. నాముందుగా వెళిపోతున్న ఒకాయన రోడ్డుమధ్యను పొన్సుకిళ్లి వుమ్మివేశాడు. నేనూ అప్పుడే రోడ్డుమీద వుమ్మేశాను. ఒకపెద్దమనిషి మాయెదురుగా వస్తున్నారు. నాముం

దుగా వెళ్తున్నాయనతో "తప్పు రోడ్డుమీద వుమ్మెయ్య కూడదు" అన్నాడు. "నీ కెందుకు పోవయ్యా!" అని నిర్లక్ష్యంగా వెళిపోయాడు. ఆ మాటలే నాతో అనే సరికి నా చదువంతా వృథా అనిపించింది.

"క్షమించండి తెలియక చేశానన్నాను" ఆ పెద్దమనిషి నాభుజంమీద చెయ్యివేసి "చూడు నాయనా! ఈ దేశంలో రోగాలకి యీ వుమ్మే కారణం! అంటూ యేవేవో ప్రశ్నలు వేశారు. కడుపు ఖ డుతోంటే యేం చెప్పానో యేంటో యింటికి తీసుకొనిపోయి తనతో భోజనంకి కూర్చోబెట్టారు. ఆయనే నన్ను వుద్యోగంలో పెయ్యించారు. ఆయన పేరు కస్తూరి నరసింహంగారు రిటైర్డు సబ్ జడ్జి. ఇప్పుడు మద్రాసులో పెద్దకొడుకు దగ్గర వున్నారు. ఉద్యోగం అయ్యాక నాలుగేళ్ళ యింది. కష్టపడి నెలకు పదిరూపాయిలు రాజ్యలక్ష్మికి పంపిస్తున్నాను. ఈ సంవత్సరంలో తనకాళ్ళ మీద నిలబడేశక్తి వచ్చిందని నాకెంతో తృప్తి కలిగింది. ఆమె వుద్యోగంలో చేరి తనకన్న వారిని పోషిస్తుంది. ఒకతప్పుకై నా క్షమించటం మనిషికి లక్ష్యం కాకపోతే యీ సంఘంలో అవినీతి పెరగటానికి యెంతైనా అవకాశంవుంది. తులసి నా ఒక్క తప్పు క్షమించకపోతే నేనీనాడు మీకు వుత్తరం వ్రాసేవాణ్ణి కాను.

తులసిని గురించి హెచ్చుగా వ్రాయలేను ఆమెను గురించి నేనెంత వున్నతంగా తలుస్తున్నది చెప్పే భాష వ్రాయలేను. ఈ తలపుల్లవలనే నిన్నమీరొచ్చి "నన్ను ప్రేమించానంటే"

చాలన్నా, నా అంతరాత్మ ఒప్పుకోలేదు. నా జీవితం దుర్భరమైన దారిద్ర్యం, కష్టాలతోనే యెదుటివాళ్ల కరుణకు అనురాగానికి, ప్రేమకు పాత్రమైంది. ఇంతకంటె అదృష్టమనేది యేమీ వుండదనుకొంటాను. మీరు, తులసి, రాఘవయ్యగారు, నరసింహంగారు, మా పనిమనిషి, మా అత్తయ్య, రాజ్యలక్ష్మి, ఉమ, లక్ష్మణరావు, పాప, వీళ్ళందరి అభిమానం తలచుకొనేటప్పుడు నా గడచిన జీవితం ఒక ఎడారికాదని, ఫలపుష్పభరితమైన ఒక ఉద్యానవనమని అనుకుంటూంటాను.

ఐతే తులసిని గురించి కొంతైనా చెప్పదలచుకొన్నాను. నా యీ కళ్లతో ఆమెకంటె అందగత్తెలను చూశాను. కానీ ఆమెను చూచిన మొదటిరోజునే యెందుకో నా హృదయం చలించింది. ఆరోజు సాయంత్రం రాజ్యలక్ష్మి దగ్గరనుంచి వుత్తరం వచ్చింది. పరీక్షలు అయినట్లు వ్రాస్తూ చాలా వేదాంతం వ్రాసుకొచ్చింది. ఇప్పటికి ఆమెను గౌరవించకుండా వుండలేను. ఆ ఒక్క తప్పు తీసుకొని ఆమె జీవితం కాల్చివేస్తే, యీ సంఘంలో యెందరి కళ్ళో బలవంతాన కప్పి నోరు బలవంతాన మూయించి సంచరించే వాళ్ళ సంగతేమిటి? ఆ వేళ వుత్తరం నా హృదయాన్ని ద్రవీభూతం చేసింది. ఇంట్లో రాత్రి యేడుగంటలవరకూ యెలాగో కూర్చో కలిగినవాడిని, యిక కూర్చోలేక బయటకువచ్చి, యీరోడ్డు ఆరోడ్డు అనక తిరుగుతూ, ఒకరోడ్డు మలుపు తిరిగేసరికి ఎలక్ట్రిక్ స్తంభం అడ్డొచ్చింది. అప్పుడే ఆ మలుపుతిరిగి యెదురుగా వచ్చిన

తులసిని చూడలేదు. నేను చెయ్యాలని చెయ్యలేదు. స్థం భానికున్న దీపపు వెలుగులో ఆమె ముఖంవేపు ఒక్కసారి చూసి, నామీద నాకే అసహ్యంవేసి, గబగబ వెళ్ళిపోయాను. తులసి ఆ మరుచటిరోజున "బూచి" అని కేకలు పాపచే వెయ్యించేది. ఎన్నోసార్లవమాన బాధ భరించలేకపోయాను. ఒకరోజునమా పెదనాన్న వస్తున్నానని వుత్తరంవ్రాస్తేవాల్తేరు స్టేషనుకు మెయిల్ కు వెళ్లాను. అక్కడకూడా తులసి నన్ను యేడిపించింది. వీళ్లూ మా పెదనాన్న కోసమే రావటం నా కాశ్చర్యం వేసింది. రాఘవయ్యగారు, మా పెదనాన్న సరికి సరియైన చేతులు. యిద్దరూ ఒక దగ్గరే చదువుకున్నారట. అదీకాకుండా వీళ్లకు దగ్గర బంధువులలో ఒక అబ్బాయి, వాళ్లదగ్గర వాళ్ళ అమ్మాయి మెడలో మూడుముళ్లూ వెయ్యటంవల్ల బంధుత్వంకూడా యేర్పడిందిట. ఈ విషయాలన్నీ నాకు తెలియవు. మా పెదనాన్న వరసకు పెదనాన్న. ఎప్పుడూ వుత్తరం వ్రాయని మనిషి. నన్ను స్టేషనుకు రమ్మని వ్రాశాడంటే అభిమానంవల్ల కాదు. వాళ్ళ బంటోత్రుకన్నా అధ్వానంగా చూసేవారు. ఇది నే నెప్పుడైతే గుర్తించానో, మాటాడకుండా పని యెగేసేవాడిని. ఆస్పత్రిలో కూడా నలుగురియెదుట తన అహంభావాన్ని చూపించేవారు. ఒకరికింద సేవచెయ్యటం నాకు ఎంతో సరదా. మనిషి తాలూకు మనస్సు, మేధస్సు యెంత గొప్పదైనా, లోకువ, దాస్యం మనిషిని అతఃపాతాళంలోకి అణచి వేస్తుం

దని లక్ష్మణరావు నాతో ఒకసారి అన్నాడు. నామంచిని ఆయన లోకువ దాస్యంకింది తీసుకున్నారు.

సరే యెదుటివాళ్ళ కష్ట నిష్ఠూరాలని గుర్తించనివాళ్ళ గురించి హెచ్చుగా యెందుకు చెప్పుకోవటం. తులసి మూడు నాలుగురోజులవరకూ, నావేపు చూసి కొఱకొఱలాడుతునే వుంది. నేను ఆమెకు చాలామర్యాద ఇచ్చేవాడిని. ముఖ్యంగా ఆడవాళ్ళను నన్ను నేను గౌరవించుకొనే కంటే, హెచ్చు గౌరవించడం నాకు పరిపాటి. చాలా భయపడ్డ వాడిలా మెసిలాను. ఆమెతో చెప్పి చూద్దామని నామనసు తహతహ లాడింది. నే నెప్పుడైతే నెమ్మదిగా బ్రతిమాలుతూ చెప్పానో ఆమె లోకువకింద తీసుకొని పరిహాసించింది. ఈ నాటికైనా తులసి తన తప్పును గుర్తించుకొని వుంటుంది. ఆ పరిహాసమే ఒకమగాడు చేస్తే బహుశః చెయ్యి చేసుకొనేవాడినేమో. ఆమె పెంకితనాన్ని అణచట మెలా అని నామనస్సు పనిచేస్తున్న సమయంలోనే, వుమవచ్చి తులసిని మందలించి నన్ను, పాపని మంచి చేసుకోమని సలహా యిచ్చింది. అప్పుడు నాకో ఆలోచన తట్టింది. నేను తులసిమీద యెదురు దెబ్బ తీయాలని అనుకొనేసరికి తులసి మారిపోయింది. నాగుబాములా కనిపించిన తులసి నాకెంతో వున్నతమైన హృదయంలా అగబడింది. ఇంట్లో నన్నొక్కణ్ణి పాపతో సహావిడిచిపెట్టి ఆపాపచేతనే నమస్కారం పెట్టించేటప్పుడే నాకామె పరిపూర్ణ హృదయం గోచరించింది. ఐనా పాపను నేను మంచి చేసుకొని తులసిని

యేడిపించాలనే కోరికమాత్రం చంపుకోలేదు. చాచా అని పాపచేత పిలిపించుకొని తులసిని యేడిపించాను. ఆమె యెంత చిరాకుగా వుంటే నాకంత ఆనందంగా వుండేది. ఆమె వూహా పథంలో విహరించి, నోటిలో భాషను, బుర్రలో మెదడుని వుపయోగించుకొనేటప్పుడు నేనామెకు జోహారు లర్పించకుండా వుండలేకపోయాను. నేను చిన్నప్పుడు సవితితల్లి పిల్లలను ఆడించిన నేర్పు వృథాకాలేదు. పాపను నాపాపగా చేసుకొనే చాకచక్యం నాలో లేకపోతే బహుశః యింతవరకూ వచ్చేది కాదు.

లక్ష్మణరావు రావటం, నా తరఫున మాట్లాడటం నాలో యెంతో మార్పు తెచ్చింది. మేం యిద్దరం యెన్నో విషయాలు మాట్లాడుకొనేవాళ్ళం. నాజీవితం చాలావరకు ఆయనతో చెప్పివున్నాను. నావుద్రేకంలో నేనొకనాడు తులసి ముందు అమానుషంగా ప్రవర్తించాను. ఈపనికి నేనిప్పటికి విచారిస్తున్నాను. లక్ష్మణరావు ఆ మరుచటిరోజున నన్ను బలవంతాన తీసుక వెళ్ళకపోతే తులసి మళ్ళీ గుమ్మంలో కాలు పెట్టకు అన్నందుకు, సిగ్గుతో ఆయింటికి వెళ్ళడం మానివేసే వాడినే. ఆ ముందు రోజు జరిగిన విషయం లక్ష్మణరావుతో చెప్పలేదు. కాని యెదుటి వాళ్ళ హృదయాలు తెలుసుకొనే సమర్థత కలిగిన మనస్సు అతనిది. నాలో ధైర్యాన్ని చొప్పించాయ్ ఆయన మాటలు. ఆమాటలే బహుశః తులసిలో కూడా మార్పుని తెచ్చివుంటాయ్.

నేను అసలు విషయాన్ని మరచి చాలా హెచ్చుగా వ్రాస్తున్నానని తలుస్తున్నాను. నేను తులసిని గురించి యేమి వ్రాయకపోయినా తులసిని గురించి తలుస్తూనే వుత్తరం వ్రాస్తున్నాను. ఆమె అందం, డబ్బు, సంస్కారం, నన్నిలా పిచ్చివాడిని చెయ్యలేదు. ఆమెలో ఒకవిధమైన ఆవేశాన్వితమైన ప్రేమ నన్ను చుట్టివేసింది. ఆమె నన్ను ప్రేమిస్తోందని చెంగల్పట్టునుంచి తిరిగి వచ్చిననాడే తెలుసుకొన్నాను. సరిగ్గా తెలుసుకొంటే తులసి మనస్సు గర్వించదగ్గ అభిమానయుక్తమైనది. మారే ప్రపంచపు పరిసరాల్లో తృప్తిగా జీవించగల సంతోషి ఆమె. క్రిందటి జన్మలన్నిటిలోను ఆమె నాభార్య అయివుంటుంది లేదా నా యీ జీవితంలో అపూర్వమైన సంఘటనలతో ఆమెను కలుసుకోవటం జరిగేదికాదు. నేనామెను పొగడలేదు. మీరు చూపించిన అభిమానానికి కూడా నేను పొగడలేను. ఈఅభిమానాన్ని ఒక సోదరి నిండు హృదయంతో చూపించిన వాత్సల్యంగా నే తీసుకొన్నాను. కానీ యీవిషయం తులసి యెలా తెలుసుకుంటుంది? నేచెప్తే ఆమెనమ్మదు. నేను ఎప్పుడు యెంతగా బాధపడింది చెప్పినా ఆమె వినిపించుకోలేదు. దీనికి కారణం నేను వివరించి చెప్పఖ్ఖరేదనుకుంటాను. ఆ ఘట్టం తులసి కళ్ళారా చూడకపోతే యీవేళ నేనిలా ఆరాటపడే అవసరం వుండేది కాదు. నేనిలా చచ్చిపోనని భగవంతుడితో చెప్పుకొనే ధైర్యాన్ని కూడా తెచ్చుకొనే అవసరం వుండేది కాదు.

మీరిలా సహాయం చెయ్యండని నేననలేను. కాని నా బాధను అర్థం చేసుకొనే చెల్లాయ్ వుందని గర్వపడు తూం టాను.

ఇదే!...
రమణా రావు.

వుత్తరం చదివిన తులసి మాట్లాడదు. ముడుకులపై ముఖంపెట్టిన వసంత దుఃఖంతో బరువైన తలను యెత్త లేదు. ఎదురుగావుండే సముద్రం వీళ్ళిద్దరికి మూగదై పోయింది. ఇద్దరి హృదయాలుపొందే బాధను కాని, యిద్దరి మనస్సుల్లో ఒక ప్పుడు ఆలోచనలంటూ మిగిలివుంటే చెప్పే చాకచక్యం యే కవికీ వుండదు.

వసంత తలయెత్తింది, సముద్రం అంతా ఒక చెరువులా వుంది. లిప్తలో లేచిన కెరటం కొండ చిలువలా ఆమెమీదకు వురుకుతున్నట్లుంది. కానీ ఆమె కదలలేదు. ఒక అరగంటకు కానీ ఒక పెద్ద నిట్టూర్పుతో కళ్ళల్లో కన్నీరు మనసులో ఆవ్యక్త పోలేదు. అప్పటికప్పుడే చీకటిపడింది

"తులసీ! యేడుస్తున్నావే" అంది. చీరకొంగు కళ్ళదగ్గర పెట్టుకొని చుట్టూతిరిగే లైటుహౌస్ దీపప్రకాంతిలో ఒక్క సారి తులసి ధూళితో నిండిన బంగారుబొమ్మలా అగపడిం దామెకు. అప్పుడే వసంత నవ్వింది. ఆ పిచ్చినవ్వును పొడిగి గిస్తూనే అంది. "చచ్చిపోను. నాలో మిగిలివున్నది ప్రేమకాదు ఋకామాన్ని మోహాన్ని యేమగాడికోయిస్తాను. నిండు

మనసుతో ప్రేమించి పూజించే భర్తను పొందావు. మీరు సుఖంగా బ్రతికాలని యీసోదరి కాంక్షిస్తోందని చెప్పు...... వస్తాను."

ఆ నిముషంలోనే అక్కడనుంచి లేచి చీకటి వెలుగుల్లో వెళ్ళిపోతున్న వసంత తులసి హృదయసీమలో పవిత్రంగా నిల్చుంది.

ఏనాడు తులసి రమణను కలుసుకుందో ఆ నాటినుంచి ఏడిపించాలనే పట్టుదల హెచ్చింది. రమణ వచ్చి క్షమాపణ కోరిననాటినుంచీ ఆమెలో రమణమీద అభిమానం పెరుగుతూనేవుంది. ఆమె యీపదహారేళ్ళ జీవితంలో ఎందరి యువకుల్ని కలుసుకొంది. వాళ్ళతో గంటలకొద్దీ చర్చించింది. పెద్ద పెద్ద కుటుంబీకులలో తనలా చదువుకున్న యువతుల జీవితాలను చూసి ఆలోచించి అర్థం చేసుకొని ఒక నిర్ధారణకు వచ్చి అనుకొన్నది. "ఈ ఒళ్లు కప్పుకోడానికి సిల్కుబట్టలక్కర్లేదు. ఈకడుపు నింపుకోవటానికి పంచభక్ష్యపరమాన్నాలు కావాలా? నిండు హృదయంతో పూజించి ప్రేమించే భర్తకంటే స్త్రీకింకేం కావాలి? లొంగుబాటు మనసులోవున్నా పైకి తేలకపోవటమే ఆమెలో ప్రత్యేకత. తను యెంత హెచ్చుగా మగాణ్ని నమ్మాలనుకుంటుందో అంతకంటే హెచ్చుగా. తనని నమ్మే మగాడికోసం ఆమె నిరీక్షిస్తోంది. రమణతో మళ్ళీ గుమ్మంలో కాలుపెట్టుకన్ననాడు ఆమె చిరాకుగానేవుంది. ఆ రాత్రి తరువాత యిప్పటివరకూ, ప్రతిరోజూ నిద్దరపోయే

వరకూ రమణగురించే తలచేది. లక్ష్మణరావు రైలులో వసు తో చెప్పిన మాటలు వినకపోతే ఆమె తెల్లవారేసరికి నవ్వేది కాదు. చెంగల్పట్టునుంచి అంతవేగంగా వచ్చేదికాదు. రమణ శీలంమీద పటుతరమైన విశ్వాసం కుదురింది. వసంత పిచ్చిగా భాషాభేషజంతో వ్రాసిన ప్రియునికి అందివ్వని వుత్తరాలు ఆమె పుస్తకంలో చూసిననాడుకూడా ఆమెలో యీవిశ్వాసం చలించనేలేదు. ఈవిశ్వాసం ఆమెలో వుండబట్టే వసంత ఆరోగ్యం విషయం రమణ చెప్పమన్న మాటలు చెప్పగలిగింది. ఎప్పుడైతే కళ్లారా రమణ వసంతను లాలించటం చూసిందో ఆమె మనస్సు చితికిపోయింది. ఆచితికిపోయిన మనసులోకూడా నమ్మకం లేశమాత్రం లేకపోతే తొంగి తొంగి చూసేదికాదు. తాతయ్య 'మాతులసమ్మ యిష్టం' అని గొణుక్కున్నప్పుడు ఆమె యెంతగానో యేడ్చింది. ఈవేళకి యీ సముద్రతీరాన చీకటిలో ఒంటిగా కూర్చొని ఏదో తెలిసీ తెలుసుకోలేని బాధతో అటమటించి వాపోతోంది. ఈ బాధావృతమైన ఆమె మనసులో యేమోమో పలవరించుకొంటోంది. చాలా సేపటి వరకూ శరీరం గగుర్పాటు చెందినా ప్రేమలాలింపుతో కూడిన రమణ శరీరస్పర్శకోసం తహతహలాడకపోలేదు. ఈతహతహలో మనసు బాధతోనే కాకుండా యింకోప్రక్క గతస్మృతులు జ్ఞప్తికిరాగా తియ్యని వలపుతలపుతో నిండిపోయింది.

గిలిగింతలు పెట్టిన హృదయంతో లేచి నిల్చుంది. రమణ యింటిదగ్గరగా వెళ్తున్న కొద్దీ ఆమె ఆగిపోవాలని అనుకుం

టోంది. కాని తుఫానులో ఒకవేపునుంచి రేగిన గాలి మనిషిని ముందుకు త్రోసివేసినట్లామె మనస్సు ముందుకు పరిగెడుతోంది. సెలయేటి ప్రవాహంలా ఆమెలో ప్రవహిస్తున్న చైతన్య స్రవంతి ఆ ప్రేమవాహిని కట్టలు తెంచుకొని ప్రవహించుక వస్తూంటే, ఆమెకు ఆ ప్రదేశం విడిచిపెట్టటానికి శక్తి చాలిం దికాదు.

మెల్లగా కిటికీదగ్గర తొంగిచూచింది. చిన్న టేబుల్ మీద హరికెన్‌లాంతరు 'డిమ్'గా వెలుగుతూంది. రమణ కుర్చీ మీద కూర్చుని టేబిల్ మీద తల ఆన్చివున్నాడు. భరించలేని అభిమానంతో ప్రతి కణం పొంగిపోగా తలుపుతట్టింది. కొంత సేపటికిగాని తలుపు తెరవబడలేదు. తులసి లోనికి వెళ్ళి తలుపు చారవేసి తలదించుక నిల్చుంది. రమణమాట్లాడలేకపోయాడు. కాని టప్‌టప్‌మని ఆమె కన్నీరు ఆమె పాదాలమీద పడటం చూశాడు.

మాటలతోనూ, చేతలతోనూ, ఆశించి, నవ్వించి, యేడ్పించి చివరకు సర్వస్వం అతని చేతులలో పెట్టిన యీ తులసిని యెలా ఆరాధించటమో తోచిందికాదు. ఆతని భుజం మీద తలపెట్టి నిట్టూర్పులతో నీరసపడ్డ ఆమెతో మాటాడ టానికి శక్తి కొంతసేపటికికాని రాలేదు.

తులసి మెల్లగా తలయెత్తి రమణ కళ్ళలోకి చూసింది. రమణ ఆమె కళ్ళలోకి చూస్తూనే నవ్వుతూ ముఖం ప్రక్కకు త్రిప్పి "బూచీ యెవరూ? అన్నాడు.

"ఎవరా?" కాస్సేపాగి "పె...ద్ద...రా...క్ష...సు...డు?"

"పాపలా అయిపోయావే!!"

వెనువెంటనే తులసి సర్దుకొని "బూచి ఎవరో చెప్పనా? ...మానాన్న...".

"బుస్సీలా యేనాటికైనా పశ్చాత్తాప పడతారంటావ్."

తులసి లేతగులాబీ రంగు బుగ్గలు సొట్టలు దేరాయ్.

భారతి నుండి
పునర్ముద్రితము.

శ్రీ కృష్ణా పవర్ ప్రెస్, విజయనగరం.